

టీడీపీలో చేరిన సింగరాయకొండ వాసులతో ఎమ్మెల్యే స్వామి

టీడీపీలోకి వలసల జోరు

వైసీపీని వీడి సైకిలెక్కుతున్న విభిన్న వర్గాలు ▪ జిల్లావ్యాప్తంగా భారీగా చేరికలు

ఒంగోలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీలోకి వలసల జోరు పెరిగింది. విభిన్న వర్గాల వారు భారీగా చేరుతున్నారు. జిల్లావ్యాప్తంగా పక్షం రోజుల నుంచి వివిధ నియోజకవర్గాల్లోని పలు గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల నుంచి పెద్ద సంఖ్యలో కుటుంబాలకు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నాయి. వారిని ఎక్కడికక్కడ టీడీపీ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇలా తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకుంటున్న వారిలో అధిక శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారే ఉంటున్నారు. పేదలకు సంక్షేమ పథకాలు బటన్ నొక్కి అందిస్తున్నామని సీఎం జగన్ నుంచి కింది స్థాయి వరకు వైసీపీ నేతలు చెప్తూ ఆయా వర్గాలు తమ వెంటే ఉంటాయని పదే పదే గొప్పలుపోతున్నారు. అయితే ప్రస్తుతం జిల్లాలో వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరుతున్న వారిలో అత్యధికులు పేద వర్గాల వారే ఉంటున్నారు.



ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన సీఎస్‌పురం మండలం చింతపూడి వాసులు

సంక్రాంతి తర్వాత ఇలా వలసలు పెరుగుతుండగా ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం పంచాయతీ దేవళంపల్లెపాలెం, కొత్తపాలెంకు చెందిన పలు కుటుంబాలు కొండపి ఎమ్మెల్యే డీఎస్‌బీవీ స్వామి నివాసానికి వచ్చి పార్టీలో చేరారు. అదే మండలంలోని సోమరాజుపల్లిలో శుక్రవారం స్వామి.. బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించిన సందర్భంగా వైసీపీకి చెందిన 40 కుటుంబాల వారు సైకిలెక్కారు. ఒంగోలులోని నాల్గో డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు షేక్ ఆరిఫ్ నేతృత్వంలో 30 కుటుంబాలకు చెందిన ముస్లిం యువకులతోపాటు ఇతరులు పార్టీలో చేరారు. కనిగిరి నియోజకవర్గంలో నిత్యం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జరుగుతుండగా ఆదివారం కూడా ఆ జోరు కొనసాగింది.



సీఎస్‌పురం మండలం చింతపూడిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నేతృత్వంలో దాదాపు 50 కుటుంబాల వారు చేరారు.



ఒంగోలులో దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరిన యువకులు

ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ, సభ నిర్వహించారు. అలాగే పామూరు మండలం రేగిమడుగులోనూ పలు కుటుంబాలు డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నేతృత్వంలో గిద్దలూరు మండలం గుమ్మలపల్లి, కంభం మండలం చిన్ననల్లకాలువ గ్రామాలకు చెందిన పలు కుటుంబాల వారు సైకిలెక్కారు.

టీడీపీలో చేరిన కృష్ణయాదవ్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

పేద విద్యార్థులకు 25శాతం ఉచిత సీట్లు

ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో అవకాశం

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 11 : బాలల నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం అననుకూల, బలహీనవర్గాల విద్యార్థులకు అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వతరగతిలో ప్రవేశానికి 25శాతం సీట్లను ప్రభుత్వం కేటాయించింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఆ ప్రకారం 13వతేదీన అన్ని ప్రైవేటు పాఠశాలలు తమ వివరాలను పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఈనెల 23నుంచి మార్చి 14 వరకు అడ్మిషన్‌ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు పోర్టల్ అందుబాటులో ఉంటుంది. ఏప్రిల్ 1న అడ్మిషన్లకు మొదటి విడత లాటరీ నిర్వహిస్తారు. 25వ తేదీన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి. మిగిలిన సీట్లకు 15న లాటరీ తీసి జాబితాను ప్రకటిస్తారు. అడ్మిషన్లకు సంబంధించిన వివరాల కోసం హెల్ప్ డెస్క్ 14417 నంబర్‌ను సంప్రదించవచ్చు.

అంతా అవినీతి, అరాచకం

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

ఓటు అనే ఆయుధంతో ఆ పార్టీని సాగనంపాలి

పెద్దకొత్తపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో టీడీపీ నేతలు



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో నూకసాని, గొట్టిపాటి, దామచర్ల, బీఎన్, మండవ

మద్దిపాడు, ఫిబ్రవరి 11: వైసీపీ పాలనలో అవినీతి, అరాచకం తప్ప అభివృద్ధి శూన్యమని టీడీపీ నేతలు, ఎమ్మెల్యేలు విమర్శించారు. ప్రజలు ఓటు అనే ఆయుధంతో ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దకొత్తపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ టీడీపీ అన్ని సామాజికవర్గాలకు సమన్యాయం చేసిందన్నారు. వైసీపీ పాలనలో దళితులు, బీసీలను అన్ని విధాలా దగా చేసిందన్నారు. ఎస్సీలపై అనేక దాడులు జరిగాయన్నారు. దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా వైసీపీ నేతలు ముందుకు సాగుతున్నారని మండిపడ్డారు. టీడీపీ జెండా కనిపించకుండా చేస్తామని జగన్ అనేక సార్లు చెప్పారని, ఇప్పుడు వైసీపీ నాయకులే ఆపార్టీ జెండాను పీకేసే రోజులు వచ్చాయన్నారు. ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి రైతులకు నీరు అందించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉన్నదని దుయ్యబట్టారు. వైసీపీ నాయకులు భూరాబందులుగా మారి వందల ఏళ్ల నాటి రైతుల భూములకు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేస్తున్నారన్నారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టుకు కొత్తగేటు నిర్మించే పరిస్థితి లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర మాట్లాడుతూ సొంత చెల్లెలు అయిన షర్మిలకే అన్యాయం చేసిన జగన్.. రాష్ట్ర ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ మండవ రంగారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, నల్లూరి సంజీవరావు, నల్లూరి చంద్రయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనుభారం

తడుల కోసం రూ.200 కోట్లు

పొగాకు రైతులకు సాగు వెతలు

నీరు దొరక్క కిలోమీటర్ల దూరం పైపులు ఏర్పాటు

రాత్రింబవళ్లూ పొలాల్లోనే అష్టకష్టాలు

దక్షిణాది ప్రాంత పొగాకు రైతులు తోటల రక్షణ కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. తీవ్ర వర్షాభావంతో ఎదుగుదల లేకుండా గిడసబారిపోతున్న మొక్కలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రింబవళ్లూ పొలాల్లోనే ఉంటున్నారు. కిలోమీటర్ల దూరం పైపులు వేసి కనిపించిన కుంటలు, చెరువులు, వాగులు, వంకలు, బావులు నుంచి నీటిని తరలించి మొక్కలకు తడి అందిస్తున్నారు. పొగాకు పండే ఏ గ్రామంలో చూసినా ప్రస్తుతం పంట రక్షణ కోసం రైతులు పడుతున్న కష్టం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. మరోవైపు ఆర్థికంగా రైతులకు నీటి తడులు పెనుభారంగా మారాయి. ఆయా ప్రాంతాల రైతులు చెప్తున్న ప్రకారం రూ.200 కోట్ల మేర అదనపు ఖర్చవుతున్నట్లు అంచనా.



మొక్కకు నీరు పోస్తున్న రైతు



మాదిరెడ్డిపాలెం వద్ద ట్రాక్టర్‌తో కుంటలో నీరు తరలింపు

ఒంగోలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం పొగాకు రైతులకు నీటి కష్టాలు వచ్చిపడ్డాయి. ఆరుగాలం కష్టం చేయడం ఒకెత్తు అయితే తోటలను రక్షించుకోవడం మరో ఎత్తవుతోంది. సాగులో ఉన్న వాటిని రక్షించుకోవాలన్న ఆశతో రైతులు కాలానికి ఎదురీదుతున్నారు. దీంతో పెట్టుబడులు రెట్టింపవుతున్నాయి. సొంతంగా బోర్లను ఏర్పాటు చేయడంలో కొందరు తలమునకలై ఉన్నారు. ఒకపక్క బోర్లు వేస్తూనే, మరోపక్క పైపులు అందుబాటులో లేక అదనపు ధరలు చెల్లించేందుకు వెనుకాడకుండా ముందుకు సాగుతున్నారు. ఆ క్రమంలో ఖర్చు తడిసిమోపెడవుతుందని వాపోతున్నారు. పొలం సమీపంలో బోర్లు వేసినా నీళ్లు పడకపోవడంతో సుమారు కిలోమీటరు దూరంలో నీటి వనరుల నుంచి జనరేటర్ సాయంతో పొగాకుకు తడులు అందిస్తున్నారు. ఈ పరిస్థితి జిల్లావ్యాప్తంగా కనిపిస్తోంది.


1.80ఎకరాలకు రూ.23,500 ఖర్చు



ఈ ఏడాది ఐదెకరాల్లో పొగాకు సాగు చేశా. వర్షం లేక మొక్కల్లో ఎదుగుదల లోపించింది. సాగర్ కాలువలకు నీరు రాకపోవడంతో తోటలకు నీరుపెట్టే అవకాశం కూడా లేదు. మా ఇంటి దగ్గర పొలంలో వ్యవసాయ బావి ఉంటే మోటార్ ద్వారా మూడు రోజుల నుంచి నీరు పెడుతున్నా. ఇంట్లోని ముగ్గురు మనుషులం పనిచేస్తున్నాం. ఒక్క నీటి తడికే ఎకరా 80 సెంట్లకు రూ.23,500 ఖర్చయింది. కూలీలతో చేసేవారికి ఎకరాకు రూ.20వేలు అవుతోంది. అయినా నీరు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు.

-చలువాది వెంకటేశ్వర్లు, రైతు, మంచికలపాడు

బోరు వేసినా నీరు రాక అవస్థలు



ఈ ఏడాది 25 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. వర్షాలు లేక తోటలు ఎండిపోతున్నాయి. అందుబాటులో నీరు లేక కొత్తగా బోర్లు పొలంలో వేశా. నీరు రాలేదు. కిలోమీటర్ దూరంలోని ఖాళీప్రదేశంలో బోరు వేస్తే అక్కడ నీరు రావడంతో పైపుల ద్వారా పెడుతున్నా. అడుగు పైపునకు అద్దె రూ.20 తీసుకుంటున్నారు. ఎకరాకు రూ.20వేలు అదనంగా ఖర్చవుతోంది.

- దామిరెడ్డి కృష్ణారెడ్డి, రైతు, మాదిరెడ్డిపాలెం, పొదిలి మండలం

విస్తారంగా సాగు

పొగాకు మార్కెట్ రెండేళ్ల నుంచి కాస్తంత ఊపుగా ఉంది. దీంతోపాటు ఇతర పంటల పరిస్థితి అంత ఆశాజనకంగా లేకపోవడంతో ఈ ఏడాది దక్షిణాది ప్రాంత రైతులు విస్తారంగా పొగాకు సాగు చేపట్టారు. దక్షిణాదిలోని ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉన్న 11వేలం కేంద్రాల్లో ఈ ఏడాది 57వేల హెక్టార్లలో పంట సాగు, 86.82 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. గతేడాది కూడా ఇలాగే ఇవ్వగా 61 వేల హెక్టార్లలో సాగు చేసిన రైతులు ఈ ఏడాది 73వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో సాగు చేశారు. అలా దాదాపు 16వేల హెక్టార్లలో పంట అధికంగా సాగు కాగా ప్రతికూల వాతావరణంతో తోటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. నాట్లు విస్తారంగా జరిగే అక్టోబరులో నెలకొన్న వర్షాభావంతో సాగు ఆలస్యం కాగా అనంతరం మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ముదురు తోటలు దెబ్బతిన్నాయి. దీంతో డిసెంబరు, జనవరి నెలల్లో అధికంగా సాగు చేయాల్సి వచ్చింది. సాగైన విస్తీర్ణంలో 80శాతం ఈ సమయంలో నాట్లు వేసినవే కాగా ప్రస్తుతం ఆ తోటలన్నీ తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా అక్టోబరు, నవంబరు నెలల్లో అధికంగా వేస్తే సంక్రాంతి నాటికి తోటలు బాగా పెరిగి నీటి అవసరం అంతగా ఉండదు. మంచు, చలిగాలులకు పంట పెరుగుతుంది. అలాంటిది ఈ ఏడాది పూర్తిభిన్నంగా ఉండటంతో అధికభాగం తోటల్లోని పొగ మొక్కలు ఎదుగుదల లేక గిడసబారిపోయాయి. జిల్లాలోని కొండపి, ఒంగోలు, టంగుటూరు, పొదిలి, వెల్లంపల్లి వేలం కేంద్రాల పరిధిలోని ఎక్కువ గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఇతర ప్రాంతాల్లోనూ అలాగే ఉంది.

తడిసి మోపెడవుతున్న ఖర్చులు

ఏదో రకంగా పంట పండిస్తే ధరలకు ఇబ్బంది ఉండదన్న నమ్మకం రైతుల్లో ఉంది. కర్ణాటకలో ప్రస్తుత మార్కెట్ తీరు ఆ నమ్మకాన్ని మరింత పెంచుతోంది. దీంతో తోటలకు నీటి తడులు పెట్టేందుకు రైతులు చర్యలు చేపట్టారు. పక్షం రోజులుగా పొగాకు పండే ఇంచుమించు అన్ని గ్రామాల్లోని సాగుదారులు పొలాలకు తడులు పెట్టే పనిలో బిజీగా ఉన్నారు. అందుకోసం అష్టకష్టాలు పడుతున్నారు. వ్యయ ప్రయాసలే కాక నీరు కూడా దొరకడం లేదు. పొలాలకు రెండు కి.మీ దూరానికిపైగా ఉన్న కుంటలు, చెరువులు, వాగులు, వంకలు, అవిలేని చోట పొలాల్లో ఉండే బావుల నుంచి పైపులు వేసి నీళ్లను తరలించి మొక్కలకు అందిస్తున్నారు. ఇంజన్లు అంతదూరం లాగడం సాధ్యంకాక చాలాప్రాంతాల్లో ట్రాక్టర్ల ఇంజన్లు, చివరకు జనరేటర్లను సైతం వాడుతున్నారు. దీనికి భారీగా ఖర్చవుతోంది. అడుగు పైపునకు రోజుకు రూ.20 అద్దె చెల్లించాల్సి వస్తోంది. కూలీలు దొరక్క, దొరికిన వారికి రోజుకు రూ.వెయ్యి కూలి ఇవ్వాల్సి వచ్చి అవస్థలు పడుతున్నారు. అలా ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు నీటితడులకు ఖర్చవుతున్నట్లు రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం దక్షిణాదిలో సాగైన 73 వేల హెక్టార్లలో 50వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణానికి నీటితడులు పెట్టాల్సి రాగా రైతులపై దాదాపు రూ.200 కోట్ల మేర అదనపు భారం పడుతోంది. కొందరు రైతులు వడ్డీలకు అప్పులు తెచ్చి నీటి కోసం ఖర్చుచేస్తున్నారు

మంచికలపాడు వద్ద పైపులతో నీరు పెడుతున్న రైతులు



ఎస్పీ మలికగర్గ్‌కు ఘనంగా వీడ్కోలు

నేడు విధుల్లో చేరనున్న పరమేశ్వరరెడ్డి

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 11 : పోలీసు శాఖలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని బదిలీపై తిరుపతి ఎస్పీగా వెళుతున్న మలికగర్గ్‌కు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆదివారం రాత్రి స్థానిక పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గుంటూరు రేంజ్ ఐజీ పాల్‌రాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీగా మలికగర్గ్ చేసిన సేవలను ప్రశంసించారు. మంచి అధికారిగా పేరుతెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం ఎస్పీ మలికగర్గ్, ఆమె భర్త అయిన బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్‌ను సత్కరించారు. ఇటీవల వరకూ జిల్లాలో పనిచేసి బదిలీ అయిన డీఎస్పీ కె.నారాయణస్వామి రెడ్డిని కూడా సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్, అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావుతోపాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం వీడ్కోలు పరేడ్‌ను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా జిల్లా ఎస్పీగా పరమేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకూ తిరుపతిలో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వస్తున్నారు.



ఎస్పీ గర్గ్ దంపతులను సన్మానిస్తున్న ఐజీ పాల్‌రాజ్, పక్కన కలెక్టర్ దినేష్‌కుమార్

జగనా.. మజాకా!

ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పక్కన పెట్టడం, అధికార పార్టీ నేతలకు పరోక్ష పెత్తనం ఇవ్వడం ఇప్పటి దాకా రాజకీయాల్లో మనం చూస్తున్న తంతు. కానీ జగన్‌రెడ్డి సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం వింత పోకడకు తెర తీసింది. సాక్షాత్తూ అధికార పార్టీ ఎమ్మెల్యేలనే పక్కకు నెట్టేసింది. స్థానికేతరులకు, కనీస ప్రొటోకాల్ సౌకర్యం కూడా లేని వారికి పెత్తనం ఇస్తోంది. అధికార పార్టీలో ఉండి ఇంకా నాలుగు మాసాల పదవీ కాలం ఉన్నా ఎమ్మెల్యేలకు దక్కాల్సిన గౌరవం లభించకుండా చేసింది. నిన్న మొన్నటి వరకూ ఉదయాన్నే ఇంటికొచ్చి తలుపు తట్టి మరీ సెల్యూట్ కొట్టిన అధికారులు ఇప్పుడు ఆ ఎమ్మెల్యేల ఫోన్ కూడా ఎత్తడం లేదంటే వారిని ఏస్థాయికి దిగజార్చారో అర్థంచేసుకోవచ్చు. జిల్లాలోని సగం నియోజకవర్గాల్లో ఇదే సీన్ కనిపిస్తుండగా, ముగ్గురు ఎమ్మెల్యేల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

డమ్మీలైన వైసీపీ ఎమ్మెల్యేలు

ఇన్‌చార్జిల పేరుతో స్థానికేతరులు, పాలనా అనుభవం లేని వారికి పెత్తనం

విపక్ష శాసనసభ్యుల కన్నా దిగజారిన పరిస్థితి

నిన్నటి దాకా సెల్యూట్ కొట్టిన యంత్రాంగం నేడు ఫోన్ కూడా తీయని వైనం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను అధికార వైసీపీ ముందుగానే ప్రకటిస్తోంది. అలాంటి వారిని పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా నియమిస్తోంది. వారిని సిటింగ్ ఎమ్మెల్యేలతో కలిసి పని చేసుకోవాలని సూచించటం సర్వసాధారణం. పాలనా వ్యవహారాలను పక్కన పెట్టి పార్టీ యంత్రాంగం మొత్తం కాబోయే అభ్యర్థికి సహకరించాలని ఆదేశించడం కూడా జరుగుతుంటుంది. కానీ వైసీపీలో ప్రస్తుతం అందుకు భిన్నమైన రాజకీయం నడుస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో సిటింగ్ ఎమ్మెల్యేలను కాదని కొత్తగా పార్టీ ఇన్‌చార్జిలుగా జగన్ నియమించిన వారికే పెత్తనం మొత్తం అప్పగిస్తున్నారు. వారికి యావత్ అధికార యంత్రాంగం దాసోహం కావాల్సిందేనని మౌఖికంగా సూచిస్తున్నారు. అలా పని చేస్తామన్న వారినే ఆయా నియోజకవర్గాల్లో కొనసాగిస్తున్నారు. పోస్టింగ్‌లలోనూ ఇదే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అందుకు తలొగ్గని వారిని కొత్తగా వచ్చిన ఇన్‌చార్జి సిఫార్సులకు అనుగుణంగా ఎడాపెడా మార్చేస్తున్నారు. ఇక ఎమ్మెల్యేలకు కూడా తెలియకుండా ఈ ఇన్‌చార్జిలే అధికారులతో సమావేశాలు నిర్వహించడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని అన్నీ తామై వ్యవహరించడం జరుగుతోంది. తాము చేస్తుంది తప్పు, చట్ట వ్యతిరేకం అని తెలిసినా అధికారులు వారికి దాసోహం అంటున్నారు.

మూడు చోట్ల శ్రుతిమించిన వైనం

మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిల పెత్తనం శ్రుతిమించింది. ఉమ్మడి జిల్లాలో రమారమి సగం నియోజకవర్గాల్లో కొత్త ఇన్‌చార్జిల అజమాయిషీ ప్రారంభమైనప్పటికీ మూడుచోట్ల ఎమ్మెల్యేలను పూర్తిగా పక్కనపెట్టారు. సంతనూతలపాడు, దర్శి, కనిగిరి నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మూడు నియోజకవర్గాల్లో సంతనూతలపాడుకు బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన మంత్రి నాగార్జునను, కనిగిరికి హెచ్ఎంపాడు జడ్పీటీసీ సభ్యుడు అయిన నారాయణయాదవ్‌ను, దర్శిలో మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిని వైసీపీ ఇన్‌చార్జిలుగా నియమించారు. ఈ మూడు చోట్లా అధికార యంత్రాంగాన్ని స్థానిక ఎమ్మెల్యే వద్దకు కూడా వెళ్లకుండా అదిరించి, బెదిరించి ఇన్‌చార్జిలు పాలన చేస్తున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు నియోజకవర్గంలోని మల్లవరంలో నిర్మించుకున్న ఇంటికి పరిమితమయ్యారు. కనిగిరిలో కొత్త ఇన్‌చార్జిని నియమించిన తర్వాత ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ నియోజకవర్గానికే రాలేదు. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఒకరోజు నియోజకవర్గానికి వచ్చి తాను ఇంకా శాసనసభ్యుడినే అన్న విషయం గుర్తుంచుకోండి అంటూ అధికారులను హెచ్చరించి వెళ్లారు.

మంత్రి ఫోన్ చేసి చెప్పినా..

మంత్రి సురేష్ కొండపిలో బిజీ కావడంతో ఎర్రగొండపాలెంలో వైసీపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ యావత్తు యంత్రాంగంపై అజమాయిషీ చేస్తున్నారు. సాక్షాత్తూ మంత్రి ఫోన్‌చేసి చెప్పినా ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లి ఆయన అంగీకారం తర్వాతే అధికారులు పనులు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఎవరైనా నేరుగా చేస్తే ఇన్‌చార్జిలు చెప్పినట్లే నడుచుకోండి అంటూ ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు వస్తున్నట్లు తెలిసింది. దీంతో ఇప్పటికే మంత్రి సురేష్‌ను అనుసరిస్తున్న ముఖ్య నాయకులకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి.



దర్శిలో బూచేపల్లి ఏర్పాటు చేసిన సమావేశం ఫ్లెక్సీలో కనిపించని ఎమ్మెల్యే మద్దిశెట్టి ఫొటో

ఇన్‌చార్జిల చుట్టూ తిరుగుతున్న అధికారులు

కనిగిరి, దర్శి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో అధికారులు మొత్తం ఇన్‌చార్జిల చుట్టూ తిరుగుతున్నారు. దర్శిలో శివప్రసాద్‌రెడ్డి అధికారులతో సమీక్షా సమావేశాలు కూడా నిర్వహించారు. ఆసందర్భంగా వేదిక మీద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కనీసం ఎమ్మెల్యే ఫొటో కూడా లేదు. అధికారుల బదిలీలు, వివిధ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు విషయంలోనూ అయన మాటే వేదవాక్కు అయింది. కనిగిరిలో నారాయణయాదవ్ గత రెండు రోజులుగా అన్ని మండలాల్లో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని బహిరంగంగా పెత్తనం చెలాయిస్తున్నారు. సంతనూతలపాడు, కొండపిల్లో ఇన్‌చార్జిలుగా వచ్చిన నాగార్జున, సురేష్‌లు మంత్రులుగా ఉన్నందున పాలనలో జోక్యం చేసుకునేందుకు కొంత అధికారం ఉంది. కానీ దర్శి, కనిగిరి ఇన్‌చార్జిలు అధికారులపై పెత్తనం చేస్తున్న వారు ఏమాత్రం అర్హత లేని వారే. అద్దంకికి పక్కజిల్లా నుంచి వచ్చిన ఇన్‌చార్జి హనిమిరెడ్డి హడావుడికి అధికారులే కాక సాధారణ ఉద్యోగులు హడలెత్తిపోతున్నారు.

మార్కాపురం బాధ్యతలు చేపట్టిన గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు పెత్తనం ఆదివారం నుంచి మార్కాపురంలో ప్రారంభమైంది. ఆయన కుమారుడు చైతన్య కూడా ఈసారి ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం కనిపించింది. గిద్దలూరు ఇన్‌చార్జిగా నియమితులైన మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి కార్యకర్తల పరిచయ కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేసుకోగా ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి ఇప్పటికే నియోజకవర్గంలో కాలు మోపి పెత్తనం ప్రారంభించారు.

తెలుగుదేశంలోకి
కొనసాగుతున్న వలసల పర్వం

వైసీపీని వీడిన 40 కుటుంబాలు ● ఎమ్మెల్యే స్వామి సమక్షంలో చేరిక

అభివృద్ధిని కాంక్షించి చేరుతున్నట్లు వెల్లడి

సింగరాయకొండ, ఫిబ్రవరి 11 : మండలంలో తెలుగుదేశం పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. ఐదేళ్లలో అభివృద్ధిని విస్మరించిన వైసీపీకి అన్ని గ్రామాల్లో ఎదురుదెబ్బ తగులుతోంది. ఆపార్టీకు తొలి నుంచి దన్నుగా ఉన్న నాయకులు, కార్యకర్తలు మెల్లగా టీడీపీ గూటికి చేరుతున్నారు. ఆదివారం ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని కొత్తపాలెంలో 20 కుటుంబాలు, దేవళం పల్లెపాలెంలో 10 కుటుంబాల వారు ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్పా ఈ ఐదేళ్లలో ఒక్క పని కూడా జరగలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా రేషన్‌కార్డులో పేర్లను తొలగించి కొంతమందికి సంక్షేమ పథకాలు అందకుండా వివక్ష చూపుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ గ్రామంలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ తమ ప్రభుత్వం రాగానే పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. సోమరాజుపల్లి టీటీనగర్‌లో 10 కుటుంబాల వారు వైసీపీను వీడి ఎమ్మెల్యే స్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గంపాల ప్రసాద్‌రెడ్డి, రంగాని వెంకటేశ్వర్లురెడ్డి, పోలిరెడ్డి, బక్కా పిచ్చిరెడ్డి, బక్కా వెంకటేశ్వర్లరెడ్డి, వేణురెడ్డి, చిట్టా రామకృష్ణ, మున్నం మణికంఠ, గంగాధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కొక్కిలగడ్డ గోవిందు, సంకే రోశయ్య, వెంకటేశ్వర్లు, గొల్లపోతు శివాజీ, ఏడుకొండలు, చలంచర్ల శివ, నాగార్జున, పొట్లూరి గణేష్, బాపట్ల కృష్ణ, బొజ్జా బ్రహ్మయ్య వీరితో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, బాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, నూతలపాటి కృష్ణచైతన్య, గొల్లపోతు బాలకోటమ్మ, కొక్కిలగడ్డ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జనసేనతోనే సామాజిక న్యాయం

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాబురావు



పాదయాత్రకకు సంఘీభావం తెలుపుతున్న విజయ్‌కుమార్, రియాజ్, హరిబాబు

మద్దిపాడు, ఫిబ్రవరి 11: జనసేన పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుకూరి బాబురావు పేర్కొన్నారు. ఆదివారం మద్దిపాడు మండలం లింగంగుంట నుంచి గుండ్లకమ్మ ప్రాజెక్టు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు దెబ్బతిన్నాయని చెప్పారు. జన సైనికులు వైసీపీ నాయకుల అరాచకాలను, దోపిడీలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు గేట్లు కూడా పెట్టలేని పాలకులు రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదని విమర్శించారు. కాగా ఈ పాదయాత్రకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్, జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ సంఘీభావం తెలిపారు.

నేటి పోలీసు స్పందన రద్దు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 11: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగే పోలీసు స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ప్రజలు ఎవరూ జిల్లా పోలీసు కార్యాలయానికి వ్యయప్రయాసలుకోర్చి రావద్దని సూచించారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీహర్షిణి విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 11: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ప్రకటించిన మూడవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. బీఎస్సీ విభాగంలో కడియం చంద్రిక 444 మార్కులు, పి.ఇందుబాయ్ 438, ఎం.పావని 437 మార్కులు సాధించారు. బీఎస్సీ (ఎంపీపీఎస్)లో అంబటి అనూహ్య 395, టి.విజయలక్ష్మి 393, పి.వైష్ణవి 390, అలాగే బీఎస్సీ(బీజడ్‌సీ)లో ఎస్‌కే.ఆశాభాను 426, బీఎస్సీ(ఆక్వా)లో జి.త్రివేణి 416, ఎస్.అనిల్ 413, బీఎస్సీ(అగ్రికల్చర్) విభాగంలో పి.వెంకటలక్ష్మీతిరుపతమ్మ 432, పి.సాత్విక 431, బీసీఏ విభాగంలో బి.భవానీబాయ్ 424, డి.అనూష, యు.అర్చన 420 మార్కులు సాధించారు. ఇక బీబీఏ విభాగంలో ఎస్‌కే.హప్ప 251, పి.సంతోష్ 250, బీఏ విభాగంలో కె.ఆశీర్వాదం 243, ఎస్‌కే.ధనుష్ యామిన్ 241, బీఎస్సీ(ఎంపీసీఎస్) విభాగంలో జి.లావణ్య 393, కె.సునీత 388, సీహెచ్.వనజ 383 మార్కులు పొందారు. మాథ్స్ విభాగంలో వందకు 100 సాధించిన విద్యార్థులు 20 మంది ఉండగా ఫిజిక్స్‌లో వందకు 100 మార్కులు ఎనిమిది మంది, కంప్యూటర్స్ విభాగంలో 12 మంది విద్యార్థులు వందకు వంద మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ రవికుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కవిత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ వీఎల్, వీజీకో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు అభినందించారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 11 : సమష్టి పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఒంగోలులోని మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం సంఘ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం ఎస్‌డీసర్దార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూజిల్లాలో కార్మికుల సమస్యలపై పోరాటం చేసి విజయాలు సాధించిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటీయూసీ స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్రపోషించిందని తెలిపారు. దేశంలో కార్మిక చట్టాల సాధనలో, హక్కుల సాధన లో కీలక పాత్ర పోషించి అనేక జీవోలను సాధించిందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు వీవీఆర్.చౌదరి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కందుకూరి సుభాన్‌నాయుడు, సుబ్బారావు, రమణయ్య, సిద్దపతి, వి.వీరాంజనేయులు, ఎ.దానియేలు, హనుమంతరావు, తిరుపతయ్య, ఎన్.నాగేశ్వరరావు, హరికృష్ణ, రాఘవ, బీవీ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుపై స్పష్టత ఇవ్వాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి కొండారెడ్డి



మాట్లాడుతున్న కొండారెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 11: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జీవీ.కొండారెడ్డి పేర్కొన్నారు. మార్కాపురంలోని రెడ్డి మహిళా కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు డిజైన్ ప్రకారం లేదని కాగ్ తప్పుబట్టిందన్నారు. 2017-21 మధ్యకాలంలో కాలువల్లో, టన్నెల్‌లో తగ్గిన సామర్థ్యాన్ని కాగ్ గుర్తించినట్లు చెప్పారు. అంచనాలు మాత్రం డిజైన్‌లో చూపిన విధంగా రూపొందించలేదన్నారు. సొరంగ మార్గాల ద్వారా నీటిని సరఫరా చేసే సామర్థ్యం 453 క్యూసెక్కులు కాగా కాలువ సైజు తగ్గిపోవటంతో 323 క్యూసెక్కుల నీరే వస్తోందన్నారు. ఇది వెలిగొండ ప్రాజెక్టు లక్ష్యానికి తూట్లు పొడిచినట్లేనని ఆరోపించారు. ప్రాజెక్టు రైతులకు కాకుండా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరుస్తుందన్నారు. సమావేశంలో సోమయ్య, రఫీ పాల్గొన్నారు.

రజకుల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

● రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల



మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్, పక్కన విజయ్‌కుమార్, రియాజ్ తదితరులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 11: రజకుల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలులో ఆదివారం జరిగిన రజకుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రజకులు ఎప్పుడు తమ పని తాము చేసుకుంటూ వారికి వచ్చే పదిరూపాయాలో బతికే వ్యక్తులన్నారు. ఇప్పటికి రజకులు అనేక ఇబ్బందుల్లో ఉన్నారనని చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రజకులను ఎస్సీల్లో చేర్చాలని చంద్రబాబు నాయుడు ప్రతిపాదనలు కూడా చేశారన్నారు. వారి సంక్షేమం కోసం దోబీఘాట్‌లతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసినట్లు చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు పేద ప్రజల సంక్షేమం కోసం పని చేశారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేశారని, కానీ రాష్ట్రంలో ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి సైకో జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేశారని మండిపడ్డారు. జగన్ రూ.12 లక్షల కోట్లు అప్పు తెచ్చి ఏమి చేశారో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ఒక ఫ్యాక్షనిస్టు పాలన చేస్తున్నారని మండిపడ్డారు. జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ రజకుల అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేనతోనే సాధ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని మండిపడ్డారన్నారు. సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రజకుల తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి శ్రీనివాసరావు, పొదిలి శ్రీనివాసరావు, పలువురు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఒక్క రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధం !

కాంట్రాక్టు పనులు ఎవరైనా చేయొచ్చు ● 25లోపు సీఎం చేతుల మీదుగా పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ ● ఎమ్మెల్యే బాలినేని



ఇళ్ల స్థలాల మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 11 : ఒంగోలులో నివేశన స్థల పట్టాలకు సంబంధించిన భూముల వ్యవహారంలో తాను ఒక్క రూపాయి తీసుకున్నట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యామని కొందరు దుష్ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని ఎన్.అగ్రహారం వద్ద జగనన్న లేఅవుట్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పేదలకు పట్టాలు ఇవ్వాలన్న సంకల్పంతో ముందుకెళ్తుంటే దానిని అడ్డుకొనేందుకు కొందరు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారన్నారు. భూసేకరణ నాటి నుంచి ఇప్పటి వరకూ ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములు ఎక్కడ ఉన్నాయో కూడా తనకు తెలియదన్నారు. ఎన్నికలకు సమయం సమీపిస్తున్న తరుణంలో పేదలకు త్వరగా పట్టాలు ఇచ్చేందుకు ఆయా భూముల అభివృద్ధి పనులు చేపట్టామని, దీన్ని గుర్తించకుండా ఒంగోలుకు చెందిన వారు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యామని ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంట్రాక్టు పనులు ఎవరైనా చేయొచ్చన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు, అమృత్ పథకం కింద చేపట్టిన పైపులైన్ల నిర్మాణ పనులను ఎక్కడి కాంట్రాక్టర్లు చేశారని ప్రశ్నించారు. ఆరోజు లేని నిబంధనలు ఆరోజు వచ్చాయా అని మండిపడ్డారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే ప్రజలే తగిన బుద్ధిచెప్తారని హెచ్చరించారు. ఈనెల 25వతేదీ లోపు ముఖ్యమంత్రి చేతుల మీదుగా పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామని బాలినేని చెప్పారు. విలేకరుల సమావేశంలో మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, కమిషనర్, తహసీల్దార్, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

రైతులతో చర్చించిన బాలినేని

నగరంలోని పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు నిష్పక్షపాతంగా భూసేకరణ చేసే బాధ్యతను అధికారులకు అప్పగించినట్లు ఎమ్మెల్యే బాలినేని తెలిపారు. వివిధ కారణాల వల్ల భూసేకరణ డబ్బులు జమ కాని రైతులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై వారి కుటుంబసభ్యుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ అగ్రహారం, మల్లేశ్వరపురం గ్రామాల్లో 80శాతం మంది రైతులకు భూసేకరణకు డబ్బులు చెల్లించామని, మిగతా వారి కుటుంబ సమస్యల వల్ల భూసేకరణ డబ్బులు చెల్లించలేదన్నారు. ఇంకా 54 మంది రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉందని చెప్పారు. వారి సమస్యలను కూడా త్వరగా పరిష్కరించి డబ్బులు అందజేస్తామని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలను దగా చేసిన మోసకారి జగన్

27 పథకాలను నిలిపివేశారు..● ఎమ్మెల్యే స్వామి ధ్వజం ● కల్లబొల్లి హామీలతో మోసం చేయలేవంటూ మంత్రి సురేష్‌పై ఫైర్



టీపీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి, నేతలు

సింగరాయకొండ, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలను దగాచేసిన మోసకారి జగన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విమర్శించారు. వారికి గత టీడీపీ ప్రభుత్వంలో అందించిన 27 పథకాలను రద్దుచేసి పాతాళానికి తొక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధి టీపీనగర్‌లో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో స్వామి మాట్లాడారు. గత తెలుగుదేశం హయాంలో గిరిపుత్రిక కల్యాణం పథకం ద్వారా వివాహం చేసుకునే గిరిజన యువతులకు రూ. 50వేలు, ఎస్సీ యువతులకు రూ.30 వేలు అందజేశామని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పథకాలను అటకెక్కించారని మండిపడ్డారు. జగ్జీవన్ జ్యోతి పథకం కింద పేద ఎస్సీ, ఎస్టీలకు తాము ఉచిత విద్యుత్ అందజేస్తే నిబంధనల పేరిట దానికి కూడా మంగళం పాడారని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిన దుర్మార్గపు ప్రభుత్వం వైసీపీదని స్వామి ధ్వజమెత్తారు. పొన్నలూరులో గత ప్రభుత్వంలో ఐదు కోట్ల రూపాయల నిధులను ఎస్టీ గురుకుల పాఠశాల నిర్మాణానికి మంజూరు చేయిస్తే, వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆపనులను అర్ధంతరంగా నిలిపేశారని చెప్పారు. ఈ ఐదేళ్ల పాలనలో ఒక్క సైడుకాలువను కూడా నిర్మించలేని అసమర్థులు వైసీపీ నాయకులని ఎద్దేవా చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సైకిల్‌గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ సందానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, గాంధీచౌదరి, పొనుగోటి కొండయ్య, సుదర్శి చంటి, నర్రా రాంబాబు, వేల్పుల వెంకట్రావు, మించల బ్రహ్మయ్య, గుదే వెంకటేశ్వర్లు, కొనికి అమర్నాథ్, సనావుల్లా, శీలం చంటి, కళ్లగుంట నరసింహ పాల్గొన్నారు.

2 నెలల్లో అభివృద్ధి చేస్తారా మంత్రి సురేష్..

నియోజకవర్గానికి వలస వచ్చిన మంత్రి సురేష్ రెండు నెలల్లో అభివృద్ధి చేస్తానని ప్రజలకు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఎమ్మెల్యే స్వామి విమర్శించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి అటు రాష్ట్రంలో, ఇటు నియోజకవర్గంలో అభివృద్ధిని గాలికి వదిలేసి ఎన్నికల ముందు అభివృద్ధి చేస్తానని చెప్పడాన్ని ఎవరూ నమ్మడం లేదని చెప్పారు. ఒక్కసారి గెలిపించండి ప్లీజ్.. అంటూ తిరుగుతున్న సురేష్ రాష్ట్రానికి మంత్రిగా వెలగబెడుతూ కనీసం తనను గెలిపించిన యర్రగొండపాలెం ప్రజల దాహార్తిని ఎందుకు తీర్చలేకపోయారని ప్రశ్నించారు. ఎన్నికల ముగిసిన తరువాత మంత్రి సురేష్ కొండపి నుంచి తట్టా బుట్టా సర్దేస్తారని జోస్యం చెప్పారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన

● రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి సురేష్

టంగుటూరు, ఫిబ్రవరి 11 : ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చెప్పారు. మండలంలోని అనంతవరం గ్రామ ఇంటిగ్రేటెడ్ సచివాలయ భవన ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. వైసీపీ నేత వీరసత్యనారాయణరాజు అధ్యక్షతన వహించిన సభలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 'నాకు ముఖ్యమంత్రి పెద్ద పరీక్ష పెట్టాడు. నాకు లెఫ్ట్ ఒక మంత్రిని, రైటొక మంత్రిని పోటీలో ఉంచారు. వీరిలో ఏ ఒక్కరు ఓడినా నేను ఓడించినట్లేనని' చెప్పారు. అంబేద్కర్ విగ్రహ దాత డాక్టర్ అనిల్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు, ఎంపీటీసీ సభ్యుడు కసుకుర్తి కోటేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు అరుణకుమారి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ రవిబాబు, పీఆర్ ఈఈ కోటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ నాగరాజు, వైసీపీ నాయకులు నారాయణరావు, ఉప్పలపాటి సుబ్బరాజు, శారీ మందిర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సచివాలయ ప్రారంభానికి దూరంగా దళితులు

సచివాలయం మంజూరైనప్పుడు దళితవాడలోనే నిర్మించాలని పట్టుబట్టిన స్థానిక దళితులు దీనిపై హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. చివరకు వారికి అవకాశం దక్కలేదు. అగ్రవర్ణాలు వారికి అనుకూలమైన ప్రదేశంలో నిర్మించారు. అప్పటి నుంచి వీరి మధ్య వైరుధ్యం కొనసాగుతూనే ఉంది. చివరకు ప్రారంభోత్సవం నాడు దళితులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు.

సిబ్బందిపై ఫిర్యాదులపర్వం

సచివాలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామ సచివాలయ సిబ్బందిపై ఫిర్యాదులు చేశారు. కొత్తగా పింఛన్లకు దరఖాస్తు చేసుకుంటుంటే లంచం అడుగుతున్నారని మంత్రి సురేష్‌కు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు తక్కెళ్లపాటి సుధాకర్, నర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



ఘంటసాలకు నివాళులర్పిస్తున్న కళాకారులు, విద్యార్థులకు పండ్ల పంపిణీ

ఒంగోలు (కల్చరల్), ఫిబ్రవరి 11: అమరగాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం పలు సాంస్కృతిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలోని ఘంటసాల కాంస్య విగ్రహానికి పలువురు గాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మశ్రీ ఘంటసాల ఎస్వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షులు అప్పిశెట్టి రత్తయ్య మాట్లాడుతూ ఎన్ని తరాలు మారినా ఘంటసాల స్వరం అజరామరమని అన్నారు. తెలుగు పాటకు తరగని చిరునామా ఘంటసాల అని సీనియర్ గాయకులు కనకారావు నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాసరావు, గాయకులు సీహెచ్.కోటేశ్వరరావు, డాక్టర్ మల్లిఖార్జునరావు, ఐ.నరసింహారావు, ఆర్.వేణుమాస్టర్, లక్ష్మీతులసి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అభయ కళారాధన సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో ఘంటసాల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దాళి మాధవరావు ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం గర్వించదగిన గాయకుడు ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలన్నారు. విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చీమకుర్తి మునిసిపల్ చైర్‌పర్సన్ గోపురం రాజ్యలక్ష్మి, విద్యానికేతన్ పీఈటీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రేపు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 11 : జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన ఈనెల 13న ఒంగోలులోని ఆగ్జీలియం హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.సుభద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులకు సంబంధిత పాఠశాలల గైడ్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రాజెక్టులు రూపొందించేందుకు చొరవ చూపాలన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల వారీగా ఈ ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9666955504 సెల్ నంబరులో సంప్రదించాలని డీఈవో కోరారు.

14న మంత్రుల ఇళ్ల ముట్టడి

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 11: ఈనెల 14న జిల్లాలో ఉన్న మంత్రుల ఇళ్లు ముట్టడి చేస్తామని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బీఆర్.గౌస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మెగా డీఎస్సీని ప్రకటిస్తామని నిరుద్యోగులకు కల్లబొల్లి మాటలు చెప్పిన ప్రభుత్వం మినీ డీఎస్సీని ప్రకటించడం యువతను మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో 60 వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ముగిసిన సెమినార్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 11 : శాసన అధ్యయనానికి ఇలియట్ సేవలు శ్లాఘమని, అవి నేటి పరిశోధనకు ఎంతో మార్గదర్శకులుగా నిలుస్తాయని ప్రముఖ చారిత్రక శాసన పరిశోధనకుడు కొండ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సెమినార్ ముగింపు సమావేశం చరిత్ర విభాగాధిపతి జి.సోమశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ పాలక మండలి సభ్యురాలు టి.సుమతి మాట్లాడుతూ చారిత్రక అంశాలు భవిష్యత్ తరాల వారికి దర్పణంగా నిలుస్తాయన్నారు. యూనివర్శిటీ ఏర్పడి ఏడాదే అయినప్పటికి జాతీయ స్థాయి సెమినార్ విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈఎస్ఐ కమిటీకి యూనివర్శిటీ పాలక మండలి సభ్యులుగా డీన్ డి.వెంకటేశ్వరరెడ్డిని ఎంపిక చేశారు. సెమినార్ నిర్వహణలో వెంకటేశ్వరరెడ్డి కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఈఎస్ఐ ఎడిటర్ పీఎస్.నారాయణమూర్తి, పీఎస్ఎస్ఐ చైర్మన్ టీఎస్.రవిశంకర్, మన్నం వెంకటనాయుడు, ఉమామహేశ్వరశాస్త్రి, ఎంవీర్.వర్మ, ఏసుబాబు, కృష్ణమూర్తి, జ్ఞానేశ్వరరెడ్డి, బి.సూర్యకుమారి, శేషతల్పసాయి, శివనారాయణ, ఎం.హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్య ఆరామక్షేత్రం ప్రారంభం

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 11: ఒంగోలులోని గోరంట్ల మల్టీప్లెక్స్ సమీపంలో నిర్మించిన ఆర్యవైశ్య ఆరామ క్షేత్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఆయనకు ఆరామక్షేత్రం నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బాలినేని మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి తాను ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. కేవలం ఆరు నెలల్లో ఆరామ క్షేత్ర నిర్మాణం పూర్తి చేసిన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ చైర్మన్ మునగా వెంకటకృష్ణారావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాదు, తడవర్తి వాసు, తాతా మధు, దేవతు వినోద్, పర్యారి రామస్వామి, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

25న వడియరాజుల యువగర్జన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 11: గుంటూరులో ఈనెల 25వ తేదీన జరిగే వడియరాజుల యువగర్జనను విజయవంతం చేయాలని వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవెళ్ళ వెంకట్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని వడియరాజుల సేవా సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం యువగర్జన కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకట్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏ పార్టీ అయితే వడియరాజులను గుర్తించి రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేస్తుందో వారికి మద్దతు ఉంటుందని తెలిపారు. యువగర్జనలో వడ్డెరలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తన్నీరు వీరసాయి, నాగేంద్ర, దేవెళ్ళ మాధవ, తమ్మిశెట్టి కిషోర్, గుంజి శ్రీను, తన్నీరు సాంబయ్య, వేముల నాగరాజు, దేవెళ్ళ భాస్కర్, బండారు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కరవదిలో సైడు కాలువ పనులు ప్రారంభం



సైడుకాలువల పనులు చేపట్టిన సర్పంచ్ కోటేశ్వరరావు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి11: ఒంగోలు మండలం కరవదిలోని పడమర ఎస్సీకాలనీలో సర్పంచ్ దేరపల్లి కోటేశ్వరరావు ఆదివారం సైడుకాలువల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులు గతంలో కొందరు అడ్డుకోవటంతో నిలిచిపోయాయి. ఈ ఎస్సీకాలనీలో వర్షాకాలంలో నీటి ప్రవాహం లేక కాలనీవాసులు ఇబ్బందిపడుతున్నారు. ఈక్రమంలో సైడుకాలువలు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి11: నాగులుప్పలపాడు మండలంలోని కనపర్తి, ఉప్పుగుండూరు గ్రామాల్లో ఎంపీపీ నలమలపు అంజమ్మ ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఉప్పుగుండూరులో రజకుల కమ్యూనిటీ భవనంపై రెండో అంతస్తు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నలమపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, తాడి అనూరాధ తదితరులు పాల్గొన్నార.

ఘనంగా వాసవీమాతకు పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 11: సంతనూతలపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా జరిగింది. అర్చకులు జి.శివరామక్రిష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు జరిగాయి. కార్యక్రమంలో వాసవీ మహిళా క్లబ్ అధ్యక్షురాలు సీహెచ్.చంద్రావతి, జిల్లా ప్రతినిధులు వీఎస్.ప్రసాదరావు, జీఎల్.ప్రసాదరావు, పాండురంగరావు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం లక్ష్మీనరసింహుని కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మద్రిపూడి, ఫిబ్రవరి 11: పృథులగిరి లక్ష్మీనరసింహా స్వామి దేవాలయానికి ఉభయదాతలైన బరూరి లక్ష్మీనరసింహశాస్త్రి, ప్రమీల దంపతులు గజవాహనాన్ని, మాడుగుల సునీల్‌కుమార్ దంపతులు స్వామి ఉత్సవమూర్తులను ఆదివారం దేవాలయ కార్యనిర్వహణాధికారి ఎం శ్రీనివాసరావుకు కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయంలో ఉత్సవమూర్తులకు ఆలయ ప్రధానార్చకులు నారాయణం మారుతీఆచారులు, వెంకటరమణ ఆచార్యులు, తిరుమలాచార్యులు ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, హోమాలు జరిపించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామికి అంగరంగవైభవంగా కల్యాణం నిర్వహించారు. ఒంగోలు కెనరాబ్యాంక్ రీజినల్ మేనేజర్ బరూరి శశిధర్ ధర్మపత్ని జ్యోత్స్నా, సునీల్‌కుమార్ దంపతులు కల్యాణ తంతు నిర్వహించారు.

కొప్పోలు రోడ్డు అధ్వానం



రోడ్డు మధ్యలో ఏర్పడిన భారీ గుంతలు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి11: ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలురోడ్డు గుంతలతో ప్రమాదాలకు నిలయంగా మారింది. రైల్వే ఫ్లైఓవర్ వంతెన దగ్గర నుంచి కొప్పోలు వరకు ఉన్న రోడ్డు గుంతల మయంగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డులో కొత్తపట్నం, ఒంగోలు మండలాల్లోని ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేట్టాలని కోరుతున్నారు.



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామి

జైలు రాత నీకే రాసి ఉంది.. అందుకే నీనోట ఆమాట

● మంత్రి సురేష్‌పై స్వామి విమర్శ

● జయహో బీసీ కార్యక్రమానికి భారీగా హాజరు

కొండపి, ఫిబ్రవరి 11 : జైలుకెళ్లే రాత మంత్రి సురేష్‌కు, ఆయన భార్యకు రాసి పెట్టిఉందని, అందుకే నుదుట రాసిన రాత మంత్రి నోట పదేపదే పలుకుతోందని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విమర్శించారు. కొండపిలోని దివంగత ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాల సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగిన జయహో బీసీ సభలో స్వామి మాట్లాడారు. మంత్రి సురేష్ తనను పదేపదే జైలు పక్షి అని సంబోధిస్తున్నాడని, ఆ గతి ఆయనకే పట్టనుందని చెప్పారు. రూ.40 కోట్లు పన్నులు ఎగవేసిన కేసులో సురేష్ బెయిల్‌పై తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి మంత్రిగా ఉండి ఒక్క రోజైనా కొండపి నియోజకవర్గానికి రాని మంత్రి ఇప్పుడు అన్నీ చేస్తానని బూటకపు మాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నాడని విమర్శించారు. ఒక్క చోటైనా రెండుసార్లు వరుసగా పోటీ చేయడానికి ధైర్యం లేని సురేష్ కొండపిలో పోటీ చేసి సాధించేదేమీ లేదని చెప్పారు. అతనికి ఓట్లేసి గెలిపించిన ఎర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజలు ప్రజలు మంచినీటి కోసం ఆందోళన చేస్తున్నారన్నారు. ముందు అక్కడి ప్రజల తాగునీటి ఎద్దడి తీర్చి, నీళ్లు తోలిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించాలని చెప్పారు. బీసీ బాలురకు కొండపిలో, బీసీ బాలికలకు సింగరాయకొండలో గురుకుల పాఠశాలలు టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేస్తే వాటికి భవనాలు కట్టని దుర్మార్గపు ప్రభుత్వం వైసీపీదని అన్నారు. తొలుత టంగుటూరు రోడ్డు నుంచి సభా ప్రాంగణం వరకు టీడీపీ కార్యకర్తలు భారీ ర్యాలీ చేశారు. సభకు ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బత్తుల నారాయణస్వామి, బీసీ సెల్ నాయకులు బ్రహ్మయ్య, మిచ్చల బ్రహ్మయ్య, దేపూరి రత్తమ్మ, దేపూరి మస్తాన్, బండ్ల శ్రీనివాసరావు, షేక్ ఖాతీషా, ముక్కు ప్రసాద్, గొర్రెపాటి రామయ్య చౌదరి, పోకూరి రవీంద్రబాబు, బొడ్డపాటి యల్లమంద నాయుడు, బూదవాటి సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య జనసేన నేతలు యనమదిలి విశ్వం పాల్గొన్నారు. కొండపికి చెందిన పలు బీసీ కుటుంబాలు స్వామి సమక్షంలో పార్టీలో చేరారు.



విజయ్ నగర్ కాలనీలో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకులు బండి నాగేశ్వరరావు

వైసీపీకి గుణపాఠం తప్పదు!

మార్టూరు, ఫిబ్రవరి 11: వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ సీనియర్ నాయకుడు బండి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక విజయ్ నగర్ కాలనీలోని 13, 14 పోలింగ్ బూత్‌ల ప్రజానీకంతో పార్టీ నాయకులు సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశానికి పట్టణ అధ్యక్షుడు కామినేని జనార్దన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బండి నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మూడోసారి గెలవాలన్నారు. రాష్ట్రంలో చంద్రబాబును సీఎంగా చూడాలన్న ఆకాంక్షతో పట్టుదలతో ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు.. వైసీపీ అక్రమాలను రాష్ట్ర ప్రజానీకం భరించలేకపోతున్నారన్నారు. టీడీపీ ఎట్ల ఆదరణ పెంచుకున్నారన్నారు. షేక్ రజాక్ మాట్లాడుతూ సైకిలు స్పీడు పెంచడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల వారికి సమ న్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో తొండెపు ఆదినారాయణ, తాటి నాగేశ్వరరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు, జంపని శ్రీను, రావినేని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

ముగ్గురికి గాయాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 11 : మండలంలోని పెద ఉల్లగల్లు సచివాలయం ఎదురు అ ద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. దొనకొండ మండలం ఇండ్లచెరువు గ్రామానికి చెందిన దెయ్యాల అచ్చయ్య తన భార్య రాణి ద్విచక్ర వాహనం పై మండలంలోని కెల్లంపల్లి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా పసుపుగల్లు నుంచి వడియాల అబ్రహం ద్విచక్ర వాహనంపై దర్శి వెళ్తుండగా పెద ఉల్లగల్లు సచివాలయం వద్దకు వచ్చే సరికి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో భార్యాభర్తలు అచ్చయ్య, రాణి తీవ్రంగా గాయపడ్డారు. అబ్రహంకు స్వల్ప గాయాలయ్యాయి. ముగ్గురినీ 108 సిబ్బంది దర్శిలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మండలంలోని చిన ఉల్లగల్లు ఎస్సీ కాలనీకి చెందిన తప్పెట నాగ భూషణం అనే వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొనటంతో తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే నాగ భూషణం హోటల్ టిఫెన్ చేసి ఇంటికి వెళ్తుండగా పసుపుగల్లుకు చెందిన బిజ్జం శ్రీనివాసరెడ్డికి చెందిన ట్రాక్టర్ నడుపుకుంటూ పసుపుగల్లు వెళ్తుండగా నాగ భూషణాన్ని ఢీకుంది. దీంతో నాగ భూషణానికి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక కాలు విరిగి పోగా మరొక కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు నాగభూషణానికి చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ముండ్లమూరు పోలీసులు వివరాలు సేకరించారు. ఆస్పత్రి నుంచి ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

బాలాలయ నిర్మాణానికి భూమిపూజ

ఇంకొల్లు, ఫిబ్రవరి 11: మండలంలోని దుద్దుకూరులో బాలాలయ నిర్మాణాని కి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ నుంచి రూ. 60 లక్షలు సీజీఎఫ్ నిధు లు మంజూరుచేసింది గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగు లు, ఇతర ప్రాంతాలలో స్థిరపడిన వ్యాపారవేత్తలు, గ్రామస్థుల సహకారంతో రూ.30 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్ గ్రామం తరుపున చెల్లించారు. మొత్తం రూ. 90 లక్షల వ్యయ అంచనాతో శ్రీచెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దేవ దాయశాఖ కమిషనర్ ద్వారా అనుమతి లభించింది. ఈవో మీనిశెట్టి శ్రీనివాస రావు పర్యవేక్షణలో జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామస్థులు బాలాలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ఆలయ అర్చక స్వాములు సత్తిబాబు, శ్రీనివాసాచార్యులు పూజలు నిర్వహించారు. ఈనెల 29న శాస్త్రోక్తంగా పూజలు, హోమం కార్యక్రమాలు నిర్వహించి ఆలయంలోని కొలువు దీరిఉన్న దేవతామూర్తులను బాలాలయంలో స్థాపన చేయనున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

మార్టూరు, ఫిబ్రవరి 11: కారు ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మార్టూరు నుంచి డేగర్లమూడి గ్రామానికి వెళ్లే సర్వీసు రోడ్డులో చోటుచేసుకుంది. మార్టూరుకు చెందిన పాలపర్తి శ్రీనివాసరావు యద్దనపూడి జడ్పీ హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట వెళ్లి తిరిగివస్తుండ గా ప్రమాదం చోటుచేసుకుంది. ఇంటూరి ఫంక్షను హాలు సమీపంలో వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన శ్రీనివాసరావు చేతికి బలమైన గాయమైంది. అతనిని బంధువులు నరసరావు పేటలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

మిర్చి దిగుబడి.. అరకొర

» అధికంగా తాలుకాయలు

» పెరిగిన పెట్టుబడులు

» నిలకడలేని ధరలు

» ఆందోళన చెందుతున్నరైతులు



నూతలపాడు వద్ద కల్లాలో మిర్చి కాయలను గ్రేడ్ చేస్తున్న కూలీలు



గుట్టలుగా పోసిన తాలుకాయలు

పర్చూరు, ఫిబ్రవరి 11: మిర్చి రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఒకవైపు దిగుబడులు లేక, మరోవైపు నిలకడలేని ధరలతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గతంలో మిర్చి రైతులు లాభాలు గడించి ఉండటంతో ఈఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటంతో తెగుళ్ల బెడద ఎక్కువైంది. దీనికి తోడు మూలిగే నక్కపై తాటికాయ పడిందన్నట్లు సాగునీరు కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఇది చాలదన్నట్లు తాలు కాయకూడా అధికంగా వస్తుండటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత ఏడాది ఎకరానికి 20 క్వింటాళ్ళకు పైగా ఉన్న దిగుబడులురాగా, ఈఏడాది సుమారు 9 క్వింటాలు వస్తున్నాయి.

పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో దాదాపు 30వేల ఎకరాలకు పైగా మిర్చి సాగుచేశారు. వ్యవసాయ ప్రారంభం నుంచే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటం, తుఫాను ప్రభావంతో పంటలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. వ్యయ ప్రయాసలకు ఓర్చి తిరిగి మిర్చిని సాగుచేసుకున్నా సకాలంలో ఆరుతడులకు నీరు అందకపోవటంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది మిర్చి సాగుకు అధిక పెట్టుబడులు వెచ్చించాల్సి వచ్చింది. సాగు ప్రారంభం నుంచే తెగుళ్ళు వెంటాడటంతో పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. కౌలు, నారు, వ్యవసాయ ఖర్చులు, ఆరుతడులు కలుపుకొని ఎకరానికి రూ.1.50లక్షలకు పైగా ఖర్చుచేయాల్సి వచ్చింది. ప్రస్తుతం వస్తున్న దిగుబడులు పెట్టుబడులకు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట చేతికి అందివస్తున్న తరుణంలో కురిసిన అకాల వర్షంతోపాటు, సకాలంలో ఆరు తడులకు నీరు అందించపోవటంతో కాయలు తాలుగా మారాయి. పంట మొత్తంలో సగానికి సగం తాలుకాయలే వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దీనికితోడు తాలుకాయలను వేరు చేయటానికి అదనపు ఖర్చవుతుందని, దీంతో ఏమిచేయాలో పాలుపోవటం లేదని వాపోతున్నారు.

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు!

- వి.శ్రీనివాసరావు, రైతు, నూతలపాడు



ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేశా. ఎకరానికి రూ.1.5 లక్షలకు పైగా ఖర్చయింది. వచ్చిన పంటలో అ ధిక భాగం కాయలు తాలుగా మారాయి. దీంతో నష్ట పోవల్సి వస్తుంది.

ఇంకొల్లులో మృతులకూ ఓటు హక్కు

ఇంకొల్లు, ఫిబ్రవరి 11: ఇంకొల్లులోని డీఎన్‌టీ బండకాలనీలో కొంతమంది చనిపో యి ఏళ్లు గడిచినా వారి ఓట్లు మాత్రం తొలగించలేదు. 6వ వార్డు బండకాలనీలో మొత్తం 639 ఓట్లు ఉన్నాయి. అందులో 12 మంది చనిపోయి ఏళ్లు గడిచింది. 8ఏళ్లకు పైగా మృతి చెందిన వారి ఓట్లు ప్రస్తుతం వచ్చిన ఓటరు లిస్టులో ఉన్నా యి. నూతలపాటి సుబ్బారావు 8 ఏళ్ల కిందట మృతి చెందాడు. సాతులూరి సత్యవతి చనిపోయి నాలుగేళ్లయింది. దేవరకొండ వెంకటేశ్వర్లు రెండేళ్ల క్రితం మృతి చెందారు. వీరి పేర్లు ప్రస్తుతం వీరి పేర్లు ఓటరు లిస్టులో ఉన్నాయి. సుమారు పది మందికిపైగా ఈ కాలనీలో మృతి చెందగా వీరికి ఓటు హక్కు ఉన్నట్లు జాబితాలో పేర్లు రావడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఇక్కడ నుంచి వలసపోయిన వారి పేర్లు మాత్రం ఫాం 7తో తొలగించాచు. ఇంకొల్లులో 20 వార్డులు ఉండగా, ఒక్క 6వ వార్డులోనే ఇన్ని అవకతవకలు ఉన్నాయంటే మండలంలో మరెన్ని ఉన్నా యోనన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

చీరాలటౌన్, ఫిబ్రవరి 11: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని శనివారం వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల పరిధిలోని కొత్తపాలెంకు చెందిన మురళీ సుమారు వందకు పైగా మద్యం సీసాలను స్కూటీపై పెట్టుకుని దండుబాట రోడ్డులో వెళుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

జగన్‌ను గద్దెదించే సమయం ఆసన్నమైంది

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

» సంఘీభావం తెలిపిన 20వ వార్డు యువకులు



ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలుపుతున్న అద్దంకి పట్టణంలోని 20వ వార్డు యువకులు

అద్దంకి, ఫిబ్రవరి 11: సీఎం జగన్మోహన్‌రెడ్డిని గద్దె దించే సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని 20వ వార్డుకు చెందిన పలువురు యువకులు ఆదివారం జొన్నతాళి క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రతిపక్షాలు, మేధావులు, విద్యార్థులు కలిసికట్టుగా పార్టీలకతీతంగా పనిచేసి సీఎంను గద్దె దించాలన్నారు. అన్నివర్గాల ప్రజలు పార్టీలకతీతంగా చంద్రబాబుకు, టీడీపీకి మద్దతు ఇవ్వటం చూస్తుంటే వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజలలో ఎంత వ్యతిరేఖత ఉందో అర్థమవుతుందన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగ న్ పని అయిపోయిందని, 2024 ఎన్నికలలో టీడీపీ గెలవటం ఖాయమన్నారు. బండారు వెంకటరావు, కుంచాల గోపి, గుంజి శ్రీవిష్ణు, వాసు, కుంచాల రామాంజనేయులు, బండారు బ్రహ్మయ్య, మోత్కుపల్లి చిన్నపురెడ్డి, వేముల రాముడు, మేస్త్రి వేణు, గుంజి బుల్లయ్య, బండారు నారాయణ, గుంజి వాసు, పాలపర్తి అశోక్, గజ్జర్లపూడి పినేలు, గద్దల దయానందం, వల్లపు రామాంజి, రాఘవులు, బెల్లంకొండ వెంకటేశ్వ ర్లు తదితరులు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 11: నియోజకవర్గంలో పలువురుని ఎమ్మెల్యే రవికుమార్ ఆదివారం పరామర్శించారు. అద్దంకి మున్సిపల్ 7వ వార్డు కౌన్సిల ర్ మొండితోక సీతమ్మ శస్త్ర చికిత్స చేయించుకోగా పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పసుమర్తి జీవన్‌ను పరామర్శిం చారు. బల్లికురవలోని 5వ వార్డు మెంబర్ కందుకూరి చిన్న తల్లి రాజమ్మ శనివారం మృతిచెందగా కుటుంబసభ్యులను ఎమ్మెల్యే రవికుమార్ పరామర్శించారు.

పంగులూరు మండలం నూజెళ్ళపల్లిలో గంగా నాగమ్మ దశదిన కర్మకు రవికుమార్ హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విప్పర్ల నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు.



అద్దంకిలో ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఘంటసాల గానభారతి సభ్యులు

ప్రజల హృదయాల్లో ఘంటసాలకు సుస్థిరస్థానం

అద్దంకి, ఫిబ్రవరి 11: ఘంటసాల మరణించి 50 సంవత్సరాలు అయినా ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరచుకుని చిరస్మరణీయుడుగా నిలిచారని ఘంటసాల గానభారతి అధ్యక్షుడు మోటుపల్లి రామదాసు అన్నారు. ఘంటసాల 50వ వర్థంతి సందర్భంగా ఆదివారం ఘంటసాల గానభారతి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సినీ విశ్లేషకులు అన్నమనేని వెంకటరావు మాట్లాడుతూ ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలన్నారు. గాయకుడు శేషగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన పాట కచేరి అలరించింది. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్‌జేడీ దేవపాలన, మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్, బాలు, పీసీహెచ్ కోటయ్య, మస్తాన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

పర్చూరు, ఫిబ్రవరి 11: దళితుల అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని దళిత యువనేత లక్కిపోగు సుమన్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన పర్చూరు నియోజకవర్గస్థాయి ఎస్సీ సెల్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దళితులను పూర్తిగా విస్మరించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దళితుల పరిస్థితి, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో దళితుల పరిస్థితి ఎలా ఉందో ప్రతి ఒక్కరికీ అర్థమైందన్నారు. ఎస్సీలు ఐక్యంగా ఉండి రానున్న ఎన్నికల్లో తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేవిధంగా ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.వీరాస్వామి, జి.కనకరాజు, కె.రాజు, శేషగిరి, శ్యామ్, నాగరాజు, అశోక్, లక్ష్మణ్, రాజేష్, ఇజ్రాయిల్, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బ్యాడ్మింటన్ పోటీలు

చీరాల, ఫిబ్రవరి 11: బ్యాడ్మింటన్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. స్థానిక ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో నిర్వహించిన ఇన్విటేషన్ బ్యాడ్మింటన్ డబుల్ విభాగం పోటీలు కారుణ్య సేవా సమితి ఆధ్వర్యంలో జరిగాయి. 30 టీంలు పోటీలలో పాల్గొన్నాయి. ఆయా టీంల మధ్య జరిగిన పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగా యి. గెలుపొందిన విజేతలకు కారుణ్య సేవా సమితి సెక్రటరీ గోవర్థన్ బహుమతులు అందజేశారు.

బంద్‌ను జయప్రదం చేయాలని బైకు ర్యాలీ

ఇంకొల్లు, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపరచకుండా మోసం చేసిందని రైతుసంఘం నాయకులు ధ్వజమెత్తారు. ఈనెల 16న జరగనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఇంకొల్లులో ఆదివారం బైకు ర్యాలీ నిర్వహించారు.

ట్రావెల్స్ బస్సులో చోరీ

» ఇద్దరిని గుర్తించి పోలీసులకు అప్పగింత

» యువకుల నుంచి గంజాయి స్వాధీనం



అద్దంకి పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ట్రావెల్ బస్సు, ప్రయాణికులు

అద్దంకి, ఫిబ్రవరి11: ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో బంగారం, నగదు అపహరించిన ఇద్దరు దొంగలను ప్రయాణికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. పోలీసులు, ప్రయాణికుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన వైసనా ప్రొద్దుటూరులో పుట్టింటి వెళ్లారు. తిరిగి కడప నుంచి విజయవాడకు ట్రావెల్ బస్సులో వస్తున్నారు. ఇదే బస్సులో ఇద్దరు యువకులు ప్రొద్దుటూరులో ఎక్కారు. పైన బెర్త్‌లో సనాతో పాటు కుమార్తె చిన్న పాప ఉంది. ఇద్దరు యువకులు కింద సీట్లలో కూర్చున్నారు. మార్గమధ్యలో చినారికట్ల వద్ద అర్ధరాత్రి దాటిన తరువాత బస్సు కొద్దిసేపు ఆగింది.

అనంతరం బయలుదేరి దర్శి-అద్దంకి మ ధ్యకు వచ్చేసరికి సనా తన హ్యాండ్ బ్యాగ్ పరిశీలించగా అందులో ఉం డాల్సిన డైమండ్ నక్లెస్, రూ.6 వేల నగదు కనిపించలేదు. దీంతో తోటి ప్రయాణికులతో కలిసి బస్సులో పరిశీలించగా చోరీకి గురైన బంగారం, నగదు గుర్తించారు. దీంతో బస్సును పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకువచ్చి ఇద్దరు యువకులను పోలీసులకు అప్పగించారు. వీరిని పోలీసులు విచారించగా గతంలో పలు చోరీలలో నిందితులుగా ఒప్పుకున్నట్లు తెలుస్తుంది. ఈ యువకుల వద్ద కొద్దిమేర గంజాయి కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. సనా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆదరించండి అండగా ఉంటా..!





రేణిమడుగు, డీవీపాలెంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

» మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర

» వెల్లువలా కొనసాగుతున్న వలసలు

» చింతపూడిలో ఆయన సమక్షంలో 46 కుటుంబాలు చేరిక

» పామూరులో వైసీపీని వీడిన 115 కుటుంబాలు

కనిగిరి (సీఎస్‌పురం), ఫిబ్రవరి 11: కనిగిరి ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని తనను ఆదరించి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ము క్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలంలోని చింతపూడిలో ఆదివారం జరిగిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనతో అన్నివర్గాల ప్రజలు నానా అవస్థలు పడ్డారన్నారు. దాదాపు ఐదేళ్లుగా వైసీపీ నేతల అరాచకాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలతో ప్రజలు విసుగు చెం దారన్నారు. తెలుగుదేశం పార్టీతోనే సంక్షేమం, పారదర్శకమైన పాలన ఉంటుందని ప్రజలు విశ్వ సిస్తు న్నారన్నారు. ఈ క్రమంలోనే టీడీపీ కి ప్రజలు చేరవవుతున్నారన్నారు. పాలనా ద క్షతకల్గిన చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కనిగిరి నియోజకవర్గంలో వైసీపీ పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. రోడ్లు అ ధ్వానంగా మారాయన్నారు. అన్నిచోట్లా రోడ్డు ప్ర మాదాలు జరుగుతున్నాయన్నారు. తాను అ ధికారంలోకి వచ్చిన తర్వాత సీఎస్‌పురం మం డలంలోని అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పను లు చేస్తానన్నారు. ఇంటింటికీ తాగునీటి ని ఇ స్తానన్నారు. బత్తాయి, దానిమ్మ, జామ, బొ ప్పాయి లాంటి ఉద్యాన పంటల సాగుకు ఊతమిస్తామన్నారు. వాటిఎగుమతికి సౌకర్యం క ల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పా ల్గొన్నారు.

చింతపూడిలో వైసీపీని వీడిన 46 కుటుంబాలు

టీడీపీలోకి వెల్లువలా వలసలు కొనసాగుతున్నాయి. సీఎస్‌పురం మండలంలోని చింతపూడి గ్రామంలో ఆదివారం డాక్టర్ ఉగ్ర సమక్షంలో వైసీపీని 46 కుటుంబాలు వీడాయి. వా రంతా టీడీపీలో చేరగా, వారికి డాక్టర్ ఉగ్ర కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి సైనికుల్లా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూ పర్‌సిక్స్ పథకాలతో పాటు, కనిగిరి ప్రాంత అ భివృద్ధికి తాను ఎంచుకున్న 5 కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో గుంటిమడగు సర్పంచ్ శ్రీనివాసు రాజు, చింతపూడి వలంటీర్ శ్రీనివాస్, గోనెపూడి ప్రసాద్, యాసారపు వెంగయ్య, పులి జే మ్స్ రాజేష్, కుమార్, రవి, ఏబేలు, మల్లికార్జునయాదవ్, ప్రకాశం, యేసు, చల్లగాలి ఆరోను, పోలెయ్య, రవికుమార్, తిరుపతయ్య, అంతేలయ్య, రమేష్‌తో పాటు మరికొన్ని కుటుంబాలు ఉన్నాయి.

టీడీపీలో చేరిన 115 కుటుంబాలు

పామూరు : రానున్న ఎన్నికల్లో తనను ఆదరించి, ఆశీర్వదించడండి.. అభివృద్ధి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రేణిమడుగు గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉగ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం వద్ద జరిగిన సభలో ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంత ప్ర జలు, రైతుల నీటి సమస్యకు వెలిగొండ జలాలతోనే శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. గత 10 సంవత్సరాలుగా తాను అధికారంలోకి లేకపోయినా ఇరిగినేనిలా నిత్యం ప్రజా సేవలో ప్రజల చెంతనే ఉంటున్నానని గుర్తు చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడా అభివృద్ధి అనేమాట లేదన్నారు. అధికార పార్టీ పాలకులు దోచు కోవడం..దాచుకోవడం తరహాలో ముందుకు సాగుతున్నాన్నారు. రోడ్లు, విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసిన సుమారు 30 కుటుంబాల వారు నాయకుల తీరు నచ్చక ఆ పార్టీకి గుడ్‌బై చె ప్పారు. ఉగ్ర ప్రజాసేవ, రానున్న రోజుల్లో ఈ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరిస్తారన్న భ రోసాతో వారంతా టీడీపీలో చేరారు. వారందరికీ పచ్చ కండువాలు కప్పి ఉగ్ర పార్టీలోకి ఆ హ్వానం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మం డల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జీ దశరథరామయ్య, మాజీ మాజీ స ర్పంచ్ గోళ్ల మాల్యాద్రి నాయుడు, సింగిల్ విం డో మాజీ చైర్మన్, గద్దె గంగయ్యచౌదరి, కంభాలదిన్నె, బొట్లగూడూరు గ్రామ పార్టీ అధ్యక్షులు మన్నం రమణయ్య, కోట చినవెంకటేశ్వర్లు, గ ద్దె మోహన్‌రావు, వై.చెన్నయ్య, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గో ళ్ల కొండయ్య, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, కమ్మబాలకృష్ణ, జీ వెంకటేశ్వర్లు, తలపనేని మాలకొండయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి వైసీపీ తూట్లు

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి
- టీడీపీలో పలు కుటుంబాల చేరిక


కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 11 : ప్రజా సంక్షేమానికి వైసీపీ తూట్లు పొడిచిందని, నిరంకుశ పాలనకు త్వరలోనే అంతం అవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం బేస్తవారపేట మండలానికి చెందిన వైసీపీ కీలక నేత సత్తెలి కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో 70 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు టీడీపీ పెద్దపీట వేస్తోందన్నారు. వారి అభ్యున్నతి కోసం అనేక ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన కృష్ణయాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గిద్దలూరు నియోజకవర్గంలో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషిచేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో సత్తెలి రంగయ్య, సత్తెలి కాశి, చక్కా సరస్వతి, వీణ, బాదం కృష్ణ, తదితరులు ఉన్నారు. బేస్తవారపేట మండలపార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుంటక నరసింహయాదవ్, ఎంపీటీసీ సభ్యుడిగా పూనూరి భూపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఆదాం, పట్టణ అధ్యక్షులు దూదేకుల సైదులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ముప్పూరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలుకుటుంబాల చేరిక

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో ఆదివారం ఉదయం కంభం మండలం యర్రబాలెం పంచాయతీలోని చిన్ననల్లకాల్వకు చెందిన 15 కుటుంబాలు, గిద్దలూరు మండలం గుమ్మళ్ళపల్లి గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. చిన్ననల్లకాల్వకు చెందిన వారిలో ఎస్.లక్ష్మమ్మ, ఎన్.పెద్ద రామయ్య, బలరామయ్య, నాగన్న, ఎం.వెంకటయ్య బి.తిరుపతి, ఎన్.లక్ష్మయ్య, టి.మల్లయ్య, ఎస్.సుధాకర్, జయరాములు, రామకృష్ణ, పిచ్చిరెడ్డి ఉన్నారు. గుమ్మళ్లపల్లికి చెందిన పందిళ్ల పెద్దగురువయ్య, గుమ్మళ్ల వెంకటరమణ, ఎం.ఆంజనేయులు, బి.చిన్నగురువయ్య, బి.చిన్నబ్బి, బి.బ్రహ్మయ్య ఉన్నారు. కార్యక్రమంలో కంభం మండల టీడీపీ అధ్యక్షులు తోట శ్రీను, గోన చెన్నకేశ వులు, పేరబోయిన రామక్రిష్ణయాదవ్, నల్లబోతుల వెంకటేశ్వర్లు, బాలక్రిష్ణ, రమేష్ తదితరులు ఉన్నారు.

టీడీపీ అంటేనే అభివృద్ధి

మార్కాపురం వన్‌టౌన్ : రాష్ట్రాన్ని అన్ని రంగాలలో కీర్తి పథంలో నడిపించిన ఘనత టీడీపీకే దక్కుతుందని, టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ కందుల రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 27వ వార్డులో ఆదివారం రాత్రి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి మాట్లాడుతూ వైసీపీని నమ్మే పరిస్థితులలో ప్రజలు లేరన్నారు. టీడీపీ-జనసేన పొత్తుకే పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకురాళ్లు

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టుషాపులు

- పోటాపోటీగా అమ్మకాలు
- చోద్యంచూస్తున్న అధికారులు

రాచర్ల, ఫిబ్రవరి 11 : తాము అధికారంలోకి వస్తే బెల్టుషాపులను పూర్తిగా రద్దుచేస్తామని చెప్పిన వైసీపీ అధికారంలోకి వచ్చిన ఆ హామీకి నీళ్లొదిలింది. ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే బెల్టుషాపులు గ్రామాల్లోనే అధికంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వానికి సంబంధించి ఆకవీడు, రాచర్ల గ్రామాలలో మాత్రమే మద్యం దుకాణాలున్నాయి. అయితే అనధికారికంగా ప్రతి గ్రామంలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి మద్యం అందచేసే పరిస్థితి నెలకొని ఉంది. దీనిపై అటు ఎస్ఈబీ అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. మండలంలోని చోళ్ళవీడు గ్రామంలోనే దాదాపు 10 బెల్టుషాపులు ఉన్నాయంటే అక్కడ మద్యం వ్యాపారం ఏ విధంగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. యడవల్లిలో 4, గుడిమెట్టలో 2, అచ్చంపల్లిలో 1, జే.పీ.చెరువులో 4, అనంపల్లిలో 4 దుకాణాల్లో మద్యం అక్రమ అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. జే.పుల్లలచెరువు గ్రామంలో అయితే బస్టాండ్ సమీపంలో ఒక బెల్టుషాపు ఏర్పాటు చేశారు. అక్కడ ఒక మహిళ అడ్డుకున్నప్పటికీ ఆ మహిళను కూడా చితబాదడం గమనార్హం. క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనంగా ఈ బెల్ట్‌షాపుల్లో వసూలు చేస్తున్నారు. మరికొంతమంది మోటార్ సైకిళ్లపై ఇంటి వద్దకే మద్యం సీసాలను చేరవేస్తున్నారు. అన్నీ తెలిసినప్పటికీ అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రమాదకరంగా నేలకాలువపై వంతెన


కాలువపై ప్రమాదకరంగా పడిన గోతులు

పొదిలి, ఫిబ్రవరి 11 : విశ్వనాథపురంలోని అంజనేయస్వామి దేవాలయం ఎదురు బజారుకు వెళ్లే ప్రధాన రహదారిలో నేల కాలవపై వేసిన కాంక్రీట్ వంతెన ప్రమాద కరంగా ఉంది. వంతెనపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో ఎప్పుడు ప్రమాదాలు జరుగుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కొంతకాలంగా ప్రమాకరం గా మారిన విషయాన్ని సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుమొత్తం గుంతలు పడిపోవడంతో రాత్రివేళలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా సంబంధింత అధికారులు ప్రమాదాలు జరగక ముందే గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.

డీఎస్పీగా బాలసుందరరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన బాలసుందరరావు

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 11: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మార్కాపురం డీఎస్పీగా బాలసుందరరావు ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన గతంలో గుంటూరు ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తూ ఇక్కడికు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన వీర రాఘవరెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ బాలసుందరరావుకు పట్టణ, రూరల్ ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వరనాయక్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


వెలిగొండ ప్రాజెక్టుపై స్పష్టత ఇవ్వాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి జీవీ కొండారెడ్డి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు కొండారెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 11: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జీవీ కొండారెడ్డి పేర్కొన్నారు. స్థానిక రెడ్డి మహిళా కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు డిజైన్ ప్రకారం లేదని కాగ్ తప్పుబట్టిందన్నారు. 2017- 21 మధ్య కాలంలో కాలువల్లో, టన్నెల్‌లో తగ్గిన సామర్థ్యాన్ని కాగ్ గుర్తించినట్లు చెప్పారు. అంచనాలు మాత్రం డిజైన్‌లో చూపిన విధంగా రూపొందించలేదన్నారు. సొరంగ మార్గాల ద్వారా నీటిని సరఫరా చేసే సామర్థ్యం 453 క్యూసెక్కులు కాగా కాలువ సైజు తగ్గిపోవటంతో 323 క్యూసెక్కుల నీరే వస్తోందన్నారు. ఇది వెలిగొండ ప్రాజెక్టు లక్ష్యానికి తూట్లు పొడిచినట్లేనని ఆరోపించారు. ప్రాజెక్టు రైతులకు కాకుండా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరుస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు సోమయ్య, రఫీ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు అందుకున్న పేదలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 11: వాసవీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక అమ్మవారిశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వాసవీ క్లబ్ నాయకులు రవికుమార్, సురేష్, వాసవీ క్లబ్ యూత్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలి

- ఘంటసాల 50వ వర్ధంతి


ఘంటసాల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 11: మధుర గాయకుడు ఘంటసాలకు భారతరత్న అవార్డు ఇవ్వాలని ఘంటసాల కళాపరిషత్ అధ్యక్షుడు చీదెళ్ల నాగేశ్వరరావు కోరారు. ఎర్రగొండపాలెంలో ఘంటసాల కళా పరిషత్ ఆధ్వర్యంలో ఆయన 50 వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., ప్రపంచంలోనే అత్యధిక సంస్మరణ సభలు జరిగిన గాయకుడిగా ఘంటసాల చరిత్ర సృష్టించారని తెలిపారు. ఘంటసాల వెంకటేశ్వరరావు ఆలపించిన గేయాలు ఎప్పటికీ మధుర జ్ఞాపకాలు అని కళాపరిషత్ సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో ఘంటసాల కళాపరిషత్ సభ్యులు కేవీ.నారాయణ, మెడబలిమి అచ్యుత రావు, దొంతా బాదరయ్య గౌడ్, బొడ్డు పెద్ద అంజనేయరెడ్డి, కోట నాయక్, హుస్సేన్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కళాజాత యాత్రను జయప్రదం చేయండి

జేవీవీ జిల్లా అధ్యక్షుడు గురుస్వామి


మాట్లాడుతున్న జేవీవీ, యూటీఎఫ్ నాయకులు

పొదిలి, ఫిబ్రవరి 11 : పట్టణంలో సోమవారం జరిగే సైన్స్ కళాయాత్రను జయప్రదం చేయాలని జేవీవీ జిల్లా అధ్యక్షులు గురుస్వామి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ జె రమణయ్య హాజరవుతారన్నారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం సాయంత్రం బాలుర ఉన్నత పాఠశాల ఆరణలో రాష్ట్రస్థాయి సైన్స్ కళాజాత యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్‌మ్యాజిక్ షో సైన్స్‌ప్రయోగాలు, సైన్స్ నృత్యరూపాలు, సైన్స్‌పాటలు ప్రదర్శించనున్నట్లు చెప్పా రు. అంతేకాకుండా సమాజంలో జరుగుతున్న మోసాలను, పర్యావరణ పరిరక్షణ గురించి వివరిం చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 30 మంది కళాకారులు పాల్గొని వివిధ రకాల కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇంతరవకు ఎప్పుడు జరగని విధంగా కళాజాత కార్యక్రమం పొదిలిలో నిర్వహిస్తామ న్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు ఎలమందరెడ్డి, గోనే శ్రీనివాసులు, జె వెంకటేశ్వ ర్లు, పి.బాలనరసయ్య, వీవీ.కొండయ్య పి.ఆంజనేయచౌదరి, పించనర్ల సంఘం అధ్యక్షుడు ఏ.బాదుల్లా, యూటీఎఫ్ నాయకులు షేక్ అబ్దుల్‌హై, బాలవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు కుటుంబ సభ్యుడిగా అందుబాటులో ఉంటా..!

గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు


అన్నా రాంబాబును సన్మానిస్తున్న కుందురు నాగార్జునరెడ్డి

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 11: నియోజకవర్గంలోని కార్యకర్తలకు కుటుంబ సభ్యుడి లాగా అన్ని విధాలుగా అండగా ఉంటానని గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. స్థానిక ఏ వన్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం మార్కాపురం నియోజకవర్గ కార్యకర్తలతో పార్టీ సమన్వయకర్త ఎమ్మెల్యే అన్నా రాంబాబు పరిచయ వేదిక కార్యక్రమం మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ మార్కాపురం ప్రాంత ప్రజలకు తాను సుపరిచితుడినేనని ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతి గడప గడపకు అందించాడని ఆ విషయాన్ని ప్రజలకు సంపూర్ణంగా వివరించా లని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్ లోనూ 2019లో వచ్చిన మెజారిటీ కంటే రానున్న ఎన్నికలలో అధికంగా వచ్చేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుము ల శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బాల మురళీకృష్ణ, మార్కాపురం ఎంపీపీ పోరెడ్డి అరుణాచెంచిరెడ్డి, తర్లుపాడు ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ, సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ ఇస్మాయిల్, కొనకనమిట్ల, పొదిలి ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలువురు ముఖ్య నాయకులు డుమ్మా

మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు స్వీకరించిన అన్నా రాంబాబుకు పార్టీ కార్యకర్తల పరిచయ వేదిక కార్యక్రమానికి పలువురు ముఖ్య నాయకులు డుమ్మా కొట్టారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, పార్టీ రాష్ట్ర ముఖ్య నాయకులు వెన్న హనుమారెడ్డి, ఆయన సతీమణి తర్లుపాడు జడ్పీటీసీ సభ్యుడు వెన్నా ఇందిర, మార్కాపురం జడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి, మార్కాపురం మండల వైస్ ఎంపీపీ బండి కృష్ణారెడ్డి లక్ష్మీదేవి, గజ్జలకొండ, చింతకుంట్ల ఎంపీటీసీలు నియోజకవర్గ కార్యకర్తల పరిచయ కార్యక్రమానికి హాజరు కాలేదు.

వైభవంగా వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం


మార్కాపురంలో అమ్మవారి విశేష అలంకరణ, గిద్దలూరులో భక్తుల పూజలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 11: మార్కాపురంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం లో అమ్మవారి ఆత్మారణ దినోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవా, సుగంధ ద్రవ్యాలు, పంచ్లరసాలతో అభిషేకం నిర్వహించారు. కోనేటి నుంచి కలశం తెచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చిర్లంచర్ల బాల మురళీకృష్ణ వైశ్య పతాకాన్ని ఆవిష్కరించారు. మహిళలు లక్షలలితా సహస్ర స్తోత్రపారాయ ణం చేశారు. రాత్రి వాసవీ మాతకు అంగరంగ వైభవంగా నగరోత్సవం నిర్వహించారు.

మహిళలు ప్రత్యేక పూజలు

గిద్దలూరు : పట్టణంలోని అమ్మవారిశాలలో ఆదివారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయం ఆవరణలో ఆర్యవైశ్య పతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీకుసుమ హరనాథ మందిరం నుంచి మహిళలు తెచ్చిన గంగాజలంతో అమ్మవారికి సామూహికంగా అభిషేకం చేశారు. సామూహికంగా శ్రీలలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆయా పూజా కార్యక్రమా లలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారా యణ, గౌరవాధ్యక్షులు వాడకట్టు రంగసత్య నారాయణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్లకు అడ్డంగా కంచె

- మున్సిపల్ చైర్మన్ వియ్యంకుడి నిర్వాకం
- న్యాయం చేయాలంటున్న మహిళలు


ఇళ్లకు అడ్డంగా కట్టిన కంచె

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 11: మార్కాపురం పట్టణంలో స్థలాలు రేట్లు పెరిగిపోవడంతో భూఆక్రమణలకు అడ్డేలేకుండా పోతోంది. సొంత స్థలాలు కూడా మాయమవుతున్నాయి. పంటకాలువలు కూడా ఆక్రమించేస్తున్నారు. ఇలాంటి ఘటనే మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో కొచ్చెర్లకోట కాలువ సమీపంలో చోటుచేసుకొంది. పట్టణంలో పాణ్యం అల్లూరమ్మ, కురిచేటి నాగమ్మలు ఒంటరిగా జీవిస్తున్నారు. పాణ్యం అల్లూరమ్మ భర్త చనిపోగా నలుగురు పిల్లలు పెళ్లిళ్ల అయి వెళ్లిపోయారు. ఈమె వితంతు పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తోంది. కురిచేటి నాగమ్మ భర్త లక్ష్మయ్య చనిపోగా ఇటుకల బట్టీలో కూలీ పనులకు వెళ్తు జీవిస్తోంది. వీరిరువురు పట్టణా నికి చెందిన రామడుగు గోపి, రామడుగు రమేష్ వద్ద 2001లో సర్వే నెం.299-3సీలో చెరో 60 గజాలు స్థలం కొని రేకుల ఇళ్ల నిర్మించుకొన్నారు. గత 23 ఏళ్లుగా వీరు ఇక్కడే జీవిస్తు న్నారు. తమకు అమ్మిన వారు 18 అడుగుల దారి ఉందని చెప్పారని బాధితులు తెలిపారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ వియ్యంకుడు శ్రీనివాసులకు వారి స్థలం పక్కనే భూమి ఉంది. వీరి స్థలాల నడుమ పంట కాలువ కూడా ఉంది. శ్రీనివాసులు వీరి భూమిని కలిపి వేసుకోవాలని కొన్ని రోజులుగా ప్రయత్నిస్తున్నాడు. వీరిఇళ్లకు అడ్డంగా కంచె నిర్మించినట్లు బాధితులు వాపో యారు. తాము అధికారులకు కూడా పలుమార్లు ఈ విషయం తెలిపామని తమకు స్థలం అమ్మిన వారికి కూడా దారి విషయమై తెలిపామన్నారు. తాము నడవడానికి వీలులేకుండా రెండు అడుగులు మాత్రమే వదలడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పేదలమైన తాము నిస్సహాయ స్థితిలో ఉన్నామని, బలమైన అధికార పార్టీకి చెందిన వ్యక్తిని అడ్డుకోలేకుండా ఉన్నామని, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. చెరో రూ.2 లక్షలు తీసుకొని ఇళ్లను ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారన్నారు.

తిరుపతి ఆచారికి జాతీయ పురస్కారం


తిరుపతి ఆచారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

కంభం, ఫిబ్రవరి 11 : తాను ఎంచు కున్న టింబర్, ఫర్నీచర్ వర్క్ రంగంలో చేసిన విశిష్ట సేవలను గుర్తించిన విజయవాడకు చెందిన ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్ అసోసియేటెడ్ విత్ తెలుగు సంస్కృతి సాహితి సేవా సంస్థ అవార్డును కంభంకు చెందిన బ్రహ్మశ్రీ వేముల తిరుపతి ఆచారిని లెజెండరీ జాతీయ పురష్కారాన్ని ప్రధానం చేసి సత్కరించింది. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన అయోధ్య బాలరామునికి పాదుకలు తయారు చేసిన శిల్పి పిట్టంపల్లి రామలింగాచారి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణమాజీ అధ్యక్షులు తోలేటి శ్రీకాంత్‌ల చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకున్నట్లు తిరుపతి ఆచారి తెలిపారు.

దీన్‌దయాల్‌కు ఘన నివాళి

గిద్దలూరు, ఫిబ్రవరి 11 : పండిట్ దీన్‌దయాల్ ఆచార్య వర్ధంతి కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు నిర్వహిచారు. ఆచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు, పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, అన్న యోజన ఇన్‌చార్జి చంద్రమోహన్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 11 : ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9 వతరగతి విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులపై ఆదివారం హెచ్ ఎం రమాదేవి, ఒకేషనల్ కోర్సు ఉపాధ్యాయుడు రామాంజనేయులు శిక్షణ ఇచ్చారు. ఆటో మొబైల్స్, వాహనాలు, ట్రేడ్ రంగంపై శిక్షణ కల్పిస్తున్నట్లు హెచ్ ఎం అన్నారు. 9 వతరగతి విద్యార్థులకు ఈ కోర్సు దోహదపడుతుందని అన్నారు. ఆటో మొబైల్స్‌లో శిక్షణ పొందుట వలన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

గిద్దలూరు, ఫిబ్రవరి 11 : పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో 1987-88 పదోతనగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. బాల్య జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనాటి ఉపాధ్యాయురాలైన సుగుణమ్మ, అన్నపూర్ణమ్మ, సుబ్బలక్ష్మమ్మలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. 35 ఏళ్ల క్రితం తమ వద్ద చదివిన విద్యార్థులు సమావేశం కావడం, తమను గుర్తుంచుకొని సన్మానించడం ఆనందంగా ఉందని విశ్రాంత ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆటపాటలతో పూర్వవిద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు.

టెన్నిస్‌లో గిద్దలూరు విద్యార్థుల ప్రతిభ



కప్పులతో విజేతలు

గిద్దలూరు, ఫిబ్రవరి 11 : గుంటూరులోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరుగుతున్న సౌత్‌ఇండియా జూనియర్స్ జోనల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలలో గిద్దలూరుకు చెందిన ఇద్దరు విద్యార్థులు విజేతగా నిలిచారు. అండర్-15 బాలికల సింగిల్స్ విభాగంలో భావనదేవి విన్నర్‌గా నిలిచింది. బాలుర విభాగంలో మహమ్మద్ కుర్షీద్ రన్నర్‌గా నిలిచి ప్రశంసపత్రాలు, కప్పు పొందారు. సౌత్ ఇండియా స్థాయిలో టెన్నీస్ విజేతలుగా నిలిచిన భావనదేవి, కుర్షీద్, వీరికి శిక్షణ ఇచ్చారు. చేరెడ్డి మురళీని లాన్ టెన్నీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జీకే.మోహన్‌రెడ్డి, గిద్దలూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ చేరెడ్డి రంగారెడ్డిలు అభినందించారు.

కథల పోటీల్లో విజేతగా సుజనాదేవి

గిద్దలూరు, ఫిబ్రవరి 11 : స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న నామని సుజనదేవి రచించిన 'చివరి కోరిక' అనే కథకు రూ.25వేల నగదు బహుమతి లభించింది. స్వాతి పత్రిక ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే అనీల్ అవార్డు కథల పోటీలో సుజనాదేవి కథకు నగదు బహుమతి లభించింది.

గిరిజన గ్రామాల్లో 'గావ్ చలో అభియాన్'


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 11: మండలంలోని చెంచు గిరిజన గ్రామాల్లో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో 'గావ్ చలో అభియాన్' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మండలంలోని పెద్ద మంతనాల, కొర్ర ప్రోలు, నల్లగుంట్ల బోడు, చెర్లోపల్లి, చిలకచెర్ల బందంబావి, పనుకుమడుగు, కొత్తూరు, తదితర గూడేల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గండి వీరారెడ్డి కేంద్రప్రభుత్వం పేదలకోసం పలు పథకాలను అమలు చేస్తోందని సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరెడ్డి, శ్రీను, కాశీనాయక్, హర్షవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొలువు తీరిన నూతన పాలక మండలి


కొలువుతీరిన నూతన పాలకమండలి

త్రిపురాంతకం, ఫిబ్రవరి 11: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. యిమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు ఛైర్మన్‌గా, బత్తుల రమణ, మాటా నాగేశ్వర రావు, వేముల గురుమూర్తి, మన్నువ వెంకటేశ్వర్లు, పీవీ.రమణమ్మ, యామర్తి శ్రీలత, జి.ఆదిలక్ష్మి, ఆళ్ల వెంకటేశ్వరరెడ్డి, సభ్యులుగా, స్వామివారి ఆలయ ప్రధానార్చకుడు దూపాటి విశ్వన్నారాయణశాస్త్రి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అభినందన సభలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.చంద్రశేఖర్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని పాలక మండలి సభ్యులను అభినందించారు. ఆలయాల అభివృద్ధికి నూతన పాలక మండలి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, నాయకులు పోలిరెడ్డి, ఎస్.సుబ్బారావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు మూర్తిరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజనశాల ఏర్పాటు


భోజనాలు చేస్తున్న వృద్ధులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 11: మండలంలోని మిరియంపల్లిలో కాకతీయ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామంలోని వృద్ధులకు భోజనశాలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు కలిపి 56 మందితో భోజనశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాసమాఖ్య ప్రతినిధులు పోట్ల రాధాకృష్ణమూర్తి, అనుమోలు వెంకయ్య చౌదరి మాట్లాడుతూ దాతలు, గ్రామస్థుల సహకారంతో భోజనశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో వయోభారంతో, అనారోగ్యంతో ఉంటూ గ్రామంతో ఉన్న అనుబంధాన్ని విడిచి ఉండలేక ఉండే వారి కోసం భోజనశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పల్లెటూరి వాతావరణానికి అలవాటుపడి, తమ పిల్లల దగ్గర పట్టణాల్లో ఇమడలేని వారు ఈ భోజనశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భోజనశాలలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భోజనశాల వరకు నడవలేని పరిస్థితితుల్లో ఉన్నవారికి ఆహారాన్ని ఇంటికే అందించే కార్యక్రమం కూడా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు యామని శ్రీనివాసరావు, వెలగా కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఆర్.సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

పొదిలి, ఫిబ్రవరి 11 : గోసంరక్షణ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. స్థానిక గోశాలలో సవావేశమై గోశాల అభివృద్ధికి ఏవిధంగా ముందుకు వెళ్లాలనే అంశాలపై చర్చించారు. ఆ తరువాత నూతనంగా ఎన్నికైన సభ్యులు అధ్యక్షులుగా అప్పల శంకర్, ప్రధానకార్యదర్శిగా కాకర్ల జగదీష్, కోశాధికారిగా అంగులూరి నాగరాజు, గౌరవ అధ్యక్షుడిగా అప్పల వెంకటసత్యానారాయణలతో ప్రమాణం చేయించారు. అనంతరం పాత కమిటీ సభ్యులను నూతన కార్యవర్గం ఘనంగా సత్కరించింది. పాత, కొత్త కార్యవర్గ సభ్యులు అందరు కలిసి గోశాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామన్నారు.

గుంటిగంగమ్మకు ప్రత్యేక పూజలు



తాళ్లూరు, ఫిబ్రవరి 11 : తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లను నివేదించారు. పలువురు వాహన పూజ చేయించారు. భక్తులు అమ్మవారికి విరాళాలను సమర్పించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్. కామేశ్వర శర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తీక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ముండ్లమూరు, ఫిబ్రవరి 11 : మండలంలోని పలు గ్రామాల్లోని గ్రామ దేవత శ్రీ పోలేరమ్మకు భక్తులు ఆదివారం పొంగళ్లు నివేదించారు. మండల కేంద్రం ముండ్లమూరు, పోలవరం, పసుపుగల్లు, బొప్పూడివారిపాలెం, శంకరాపురంలోని నాంచారమ్మ, నూజెండ్లపల్లిలోని పోలేరమ్మ, సుంకరవారిపాలెంలోని పోలేరమ్మ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు ఇంటి వద్ద నుంచి నైవేద్యాన్ని తీసుకొని వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు.

ఏళ్లుగా నిలిచిన తరగతి గదుల నిర్మాణం

ఇబ్బందిపడుతున్న విద్యార్థులు

దర్శి, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్మించతలపెట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం ఏళ్ల తరబడి నిలచిపోయింది. చాలీచాలనన్ని తరగతి గదులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నప్పటికీ పట్టించుకున్న నాథుడేలేడు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కళాశాలలో మూడు తరగతి గదుల నిర్మాణానికి ఎస్సీ కార్పొరేషన్ నిధులు రూ.29 లక్షలు మంజూరు చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ కొంతమేరకు పనులు చేసి పార్టు బిల్లు రూ.3 లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత నిధుల కొరత వలన తరగతి గదుల నిర్మాణం అలాగే నిలచిపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణాన్ని గుర్చి పట్టించుకోలేదు. నాడు - నేడు పథకంలో ఆ పనులు చేర్చే అవకాశం ఉన్నప్పటికీ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించినవన్న ఉద్దేశంతో ఆ పనులను పక్కన పెట్టారు. ఏళ్ల తరబడి తరగతి గదుల కోసం నిర్మించిన గోడలు అలాగే మిగిలాయి. కిటికీలు దర్వాజలకు ఏర్పాటు చేసిన కలప దెబ్బతింటోంది. అధికారులు తరగతి గదుల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నారని తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తరగతి గదల నిర్మాణం పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందుల తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు

యువతను దగా చేసిన వైసీపీ

జనసేన పార్టీ నాయకుడు వెంకట్



మాట్లాడుతున్న వెంకట్

దర్శి, ఫిబ్రవరి 11 : యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా వైసీపీ పాలకులు దగా చేశారని దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయకుండా నిరుద్యోగులను నిండాముంచారన్నారు. దొనకొండలో పరిశ్రమ కారిడార్ ఏర్పాటును జగన్‌రెడ్డి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 90 రోజుల్లో ఇక్కడ ఐటీ కంపెనీలను ఏర్పాటు చేస్తామని వెంకట్ హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చినప్పటికీ పట్టించుకున్న వారే లేరన్నారు. అధికార పార్టీ పాలకు చేతగాని తనంతో తాగునీటి పథకాల న్నీ అధ్వానస్థితికి చేరాయని ధ్వజమెత్తారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించే కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో వంద వాటర్ ప్లాంట్‌లను సొంత నిధులతో ఏర్పాటు చేస్తానన్నారు. త్వరలోనే మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసి ఐదువేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలో నిలిచిపోయిన పనులను పునరుద్ధరిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీకి ప్రజలు పట్టంగట్టాలని వెంకట్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జనసేన పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీఆర్ ఉద్యోగుల సంఘ కోశాధికారిగా రాము



రాములు

దొనకొండ, ఫిబ్రవరి 11 : పంచాయతీరాజ్ మినిస్టీరియల్ తర్లుపాడు సమితి ఉద్యోగుల సంఘం కోశాధికారిగా ఏ రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన దొనకొండ మండల పరిషత్ కార్యాలయలంలో టైపిస్టుగా పనిచేస్తున్నారు. జిల్లా ఎన్నికల కమిటీ సాగర్‌రెడ్డి, లాలపురెడ్డి, సత్యం అధ్యక్షతన మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలో కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎంపికైనట్లు తెలిపారు. టైపిస్టు రామును పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు అభినందించారు.

నాయబ్ రసూల్‌కు డాక్టరేట్ ప్రదానం



నాయబ్‌రసూల్‌కు డాక్టరేట్ అందిస్తున్న వర్సిటీ అధ్యాపకులు

పామూరు, ఫిబ్రవరి 11 : స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్ రసూల్ సేవలకు గుర్తింపుగా గ్లోబల్ హ్యూమన్ పీస్ యునివర్సిటీ చెన్నైలోని విద్యా భవన్‌లో ఆదివారం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. నాయబ్ రసూల్ 15 ఏళ్లుగా పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడం, బాల్యవివాహాలు, బాలల అక్రమరవాణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, న్యాయ సేవలు, ప్లాస్టిక్ కవర్ల నిషేధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర సేవలకుగాను గ్లోబల్‌హ్యూమన్ పీస్ వర్సిటీ చైర్మన్ డాక్టర్ పీ మనుయేల్, తమిళనాడు జడ్జి, ఎస్.వెంకటేశన్, ప్రిన్సిపల్ సెక్రటరీ ధర్మేంద్ర ప్రతాప్‌యాదవ్, విశ్రాంత స్పెషల్ కమిషనర్ కే సంపత్‌కుమార్, డాక్టర్ జయమహేష్ అవార్డును రసూల్‌కు అందజేశారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

పామూరు, ఫిబ్రవరి 11 : జగన్‌రెడ్డి పాదయాత్రలో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాడుతామని యూనియన్ జిల్లా కార్యదర్శి కల్పన తెలిపారు. సుందరయ్యభవన్‌లో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. చలో విజయవాడ కట్టడికి వైసీపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా అక్కడకు చేరుకొని డిమాండ్లను వినిపించామన్నారు. కనీసవేతనాల అమలుకు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో షేక్ రజియా, కేజియా, సీఐటీయూ నాయకులు కే మాల్యాద్రి, తిరుపతమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



పసుపుగల్లులోని ఒక వీధిలో బురదమయం

కంపు..కంపు..!

- ఏ ఊరిలో చూసినా వ్యర్థాలే
- పట్టించుకోని అధికారులు
- రోగాలబారిన గ్రామస్థులు



ముండ్లమూరు - తమ్మలూరు రోడ్డుపై పారబోసిన వ్యర్థాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 11 : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్యం లోపించింది. దీని ప్రభావంతో ప్రజలు వ్యాధులబారిన పడి ఆస్పత్రులకుపోయి వేల రూపాయలు ఖర్చు పెట్టి గుల్లవుతున్నారు. పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. నెలనెలా జీతం వస్తుందిలే మాకెందుకన్నట్టుగా పంచాయతీ కార్యదర్శులు వ్యవహరిస్తున్నారు. ఎగిరెగిరి దంచినా అంతే కూలి.. ఊరకున్నా అంతే కూలి అన్న సామెతగా పంచాయతీ కార్యదర్శుల తీరు ఉంది. ముండ్లమూరులోని పలు వీధుల్లో చెత్తాచెదారం, వ్యర్థాలో కంపు కొడుతోంది. ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలు రోడ్డుపై పారబోయడంతో దుర్వాసనతో సమీప నివాస ప్రాంతాల ప్రజలు ఉండలేకపోతున్నారు. పసుపుగల్లులో పలు ప్రధాన వీధులు బురదమయమయ్యాయి. పసుపుగల్లు కొత్తూరు నుంచి చింతలపూడి వెళ్లే రహదారి పక్కన నివాస ప్రాంతాల మధ్య మురికి విలయ తాండవం చేస్తోంది. సాక్షాత్తు ఆ మురికిలోనే ఎస్‌పీపీ కుళాయిలు ఉన్నాయి. దీంతో సమీపంలోని వీధుల్లో నివశించే వారు మంచి నీటి కోసం వెళ్లాలంటే ఆ బురదలోనే పట్టుకొని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ గ్రామంలోని గిరిజన కాలనీ సమీపం అంతా బురదమయమై పోయింది. మెయిన్ బజారులోని కాలువలు వ్యర్థాలో నిండాయి. ఏ వీధిలోకి వెళ్లినా కంపే. ఈదరలో వ్యర్థాలన్నీ వాగు సమీపంలో వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. వాగు అవతల ఒక గుడి, ఇవతల ఒక గుడి ఉండడం నిత్యం భక్తులు ఆలయాలకు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. పెదఉల్లగల్లు నుంచి కెల్లంపల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలున్నాయి. మారెళ్ల నుంచి జమ్మలమడక వెళ్లే ప్రధాన రహదారిపై చెత్తలు ఉండటం, శంకరాపురంలోని ఊరికి సమీపంలో రహదారి పక్కనే వ్యర్థాలు ఉండడంతో గ్రామస్థులు అల్లాడిపోతున్నారు. ఇటీవల పసుపుగల్లులో డెంగ్యూ, విషజ్వరాలతో మంచంపట్టిన విషయం తెలిసిందే. లక్షలాది రూపాయలు పెట్టి నిర్మించిన డంపింగ్ యార్డులు అలంకార ప్రాయంగానే మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తాచెదారాలను డంపింగ్ యార్డుల్లో వేసే విధంగా చూసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు : శంకరరావు, ఎంపీడీవో

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎంపీడీవో బీ శంకరరావు తెలిపారు. గ్రామంలో వ్యర్థాలను డంపింగ్ యార్డులో వేసే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించడం జరుగుతుందన్నారు. ఏ గ్రామంలో పారిశుధ్యం లోపిస్తే అందుకు పంచాయతీ కార్యదర్శులను బాధ్యతలను చేస్తామని తెలిపారు.

ఐసీడీఎస్ నిర్వీర్యానికి ప్రభుత్వాల కుట్ర

సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్



మాట్లాడుతున్న రమేష్

కనిగిరి, ఫిబ్రవరి 11 : అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు కుట్ర పన్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లకు ఆదివారం రెండవ రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేసిన పోరాటం ఆదర్శంగా నిలించిందన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం మొండిగా ఉద్యమాన్ని నీరు గార్చేందుకు విశ్వప్రయత్నం చేసి విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జీ శ్రీనివాసులు, కార్యదర్శివర్గ సభ్యులు పీసీ కేశవరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన, సీఐటీయూ నాయకులు రాయళ్ళ మాలకొండయ్య, రంగారావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మహాలక్ష్మి, రాధా, సీత, రజని, రామసుబ్బులు, ఎల్లమ్మ ఐద్వా నాయకురాలు ప్రసన్న పాల్గొన్నారు.

గుంటిగంగలో వాటర్‌ప్లాంట్‌కు భూమి పూజ

తాళ్లూరు, ఫిబ్రవరి 11 : గుంటిగంగ సన్నిధిలో భక్తులకు మంచి నీటిని అందించేందుకు శ్రీమత్ బాలాత్రిపుర సుందరి సేవా సమితి ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సేవా సమితి నిర్వాహకులు, విశ్రాంత డీఎస్పీ రాఘవరావు ఆదివారం భూమి పూజ చేశారు. గంగమ్మతల్లి దర్శనంకు వచ్చే భక్తులకు మంచి నీటి వసతిని కల్పించేందుకు రాఘవరావు ముందుకు వచ్చారు. ప్లాంట్ ఏర్పాటుకు గ్రామపంచాయతీ గుంటిగంగ సన్నిధిలో ఆర్యవైశ్య సత్రానికి వెళ్లే ముందు భాగంలో రోడ్డును ఆనుకుని స్థలాన్ని కేటాయించారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఆలయ ఈవో పి.కార్తీక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఎస్సై వైవీ రమణయ్య, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.శ్రీనివాసరావు, నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు యాడిక యల్లమందారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ యోగిరెడ్డి, సోమా సుబ్బారావు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత డీఎస్పీ రాఘవరావు, దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్

ఆదరించండి అండగా ఉంటా..!





రేణిమడుగు, డీవీపాలెంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

- మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర
- వెల్లువలా కొనసాగుతున్న వలసలు
- చింతపూడిలో ఆయన సమక్షంలో 46 కుటుంబాలు చేరిక
- పామూరులో వైసీపీని వీడిన 115 కుటుంబాలు

కనిగిరి (సీఎస్‌పురం), ఫిబ్రవరి 11: కనిగిరి ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని తనను ఆదరించి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని సీఎస్‌పురం మండలంలోని చింతపూడిలో ఆదివారం జరిగిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనతో అన్ని వర్గాల ప్రజలు నానా అవస్థలు పడ్డారన్నారు. దాదాపు ఐదేళ్లుగా వైసీపీ నేతల అరాచకాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలతో ప్రజలు విసుగు చెందారన్నారు. తెలుగుదేశం పార్టీతోనే సంక్షేమం, పారదర్శకమైన పాలన ఉంటుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే టీడీపీకి ప్రజలు చేరవవుతున్నారన్నారు. పాలనా దక్షతకల్గిన చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కనిగిరి నియోజకవర్గంలో వైసీపీ పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. అన్నిచోట్లా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎస్‌పురం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేస్తానన్నారు. ఇంటింటికీ తాగునీటిని ఇస్తానన్నారు. బత్తాయి, దానిమ్మ, జామ, బొప్పాయి లాంటి ఉద్యాన పంటల సాగుకు ఊతమిస్తామన్నారు. వాటిఎగుమతికి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన పలువురు

టీడీపీలోకి వెల్లువలా వలసలు కొనసాగుతున్నాయి. సీఎస్‌పురం మండలంలోని చింతపూడి గ్రామంలో ఆదివారం డాక్టర్ ఉగ్ర సమక్షంలో వైసీపీని 46 కుటుంబాలు వీడాయి. వారంతా టీడీపీలో చేరగా, వారికి డాక్టర్ ఉగ్ర కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి సైనికుల్లా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో పాటు, కనిగిరి ప్రాంత అభివృద్ధికి తాను ఎంచుకున్న 5 కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో గుంటిమడగు సర్పంచ్ శ్రీనివాసురాజు, చింతపూడి వలంటీర్ శ్రీనివాస్, గోనెపూడి ప్రసాద్, యాసారపు వెంగయ్య, పులి జేమ్స్, రాజేష్, కుమార్, రవి, ఏబేలు, మల్లికార్జునయాదవ్, ప్రకాశం, యేసు, చల్లగాలి ఆరోను, పోలెయ్య, రవికుమార్, తిరుపతయ్య, అంతేలయ్య, రమేష్‌తో పాటు మరికొన్ని కుటుంబాలు ఉన్నాయి.

టీడీపీలో చేరిన 115 కుటుంబాలు

పామూరు : రానున్న ఎన్నికల్లో తనను ఆదరించి, ఆశీర్వదించడండి.. అభివృద్ధి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రేణిమడుగు గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉగ్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం వద్ద జరిగిన సభలో ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంత ప్రజలు, రైతుల నీటి సమస్యకు వెలిగొండ జలాలతోనే శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. గత 10 సంవత్సరాలుగా తాను అధికారంలోకి లేకపోయినా ఇరిగినేనిలా నిత్యం ప్రజా సేవలో ప్రజల చెంతనే ఉంటున్నానని గుర్తు చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎక్కడా అభివృద్ధి అనేమాట లేదన్నారు. అధికార పార్టీ పాలకులు దోచుకోవడం..దాచుకోవడం తరహాలో ముందుకు సాగుతున్నారన్నారు. రోడ్లు, విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసిన సుమారు 30 కుటుంబాల వారు నాయకుల తీరు నచ్చక ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఉగ్ర ప్రజాసేవ, రానున్న రోజుల్లో ఈ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరిస్తారన్న భరోసాతో వారంతా టీడీపీలో చేరారు. వారందరికీ పచ్చ కండువాలు కప్పి ఉగ్ర పార్టీలోకి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జీ దశరథరామయ్య, మాజీ మాజీ సర్పంచ్ గోళ్ల మాల్యాద్రినాయుడు, సింగిల్ విండో మాజీ చైర్మన్, గద్దె గంగయ్యచౌదరి, కంభాలదిన్నె, బొట్లగూడూరు గ్రామ పార్టీ అధ్యక్షులు మన్నం రమణయ్య, కోట చినవెంకటేశ్వర్లు, గద్దె మోహన్‌రావు, వై.చెన్నయ్య, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోళ్ల కొండయ్య, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, కమ్మబాలకృష్ణ, జీ వెంకటేశ్వర్లు, తలపనేని మాలకొండయ్యచౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, పోకా నాయుడుబాబు, గోళ్ల వీరబాబు, బోడవాడ సర్పంచ్ మాలకొండయ్యయాదవ్, బుద్ధిపూడి మార్క్, రత్తయ్య, రమేష్, ఓరుగంటి సుబ్బమ్మ పాల్గొన్నారు.

పట్టణంలోని ఎస్సీ పాలెంలో మాజీ వార్డు సభ్యుడు బంకా యోబు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాల వారు డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం డీవీపాలెంలో శ్రీరాం శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన 65 కుటుంబాలు వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చేరినవారందరికీ డాక్టర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఉగ్ర మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, పేదలకు పథకాలు నిరాటకంగా కొనసాగాలంటే చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీకే సాధ్యమన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పామూరు, సీఎస్‌పురం అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, బొమ్మబోయిన వెంకటేశ్వర్లు, పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, పందిటి హరీష్, షేక్ గౌస్‌బాషా, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యుడు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, ఎం.గంగరాజు యాదవ్, సయ్యద్ అమీర్‌బాబు, వైప్రసాదరెడ్డి, శ్రీనివాసులు, షేక్ ఖాజారహంతుల్లా పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గోరంట్ల

టీడీపీలోకి 10 కుటుంబాలు

కురిచేడు, ఫిబ్రవరి 11 : కురిచేడు మండలం ఆవులమంద ఎస్సీ కాలనీకి చెందిన 10 కుటుంబాలు వారు ఆదివారం రాత్రి టీడీపీ నాయకుడు గోరంట్ల రవికుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. వైసీపీకి చెందిన గండి కోటేశ్వరరావు, గండి నాగేశ్వరరావు, సాతులూరి కోటేశ్వరరావుతోపాటు మరో ఏడు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి రవి కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానన న్నారు. కార్యక్రమంలో ఆవులమంద టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, ఫిబ్రవరి 11: వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా తాళ్లూరు, తూర్పుగంగవరం కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ఆదివారం ఆర్యవైశ్యులు హోమాలు, అభిషేకాలు, పూజలను నిర్వహించారు. తెల్లవారుజామునే వాసవీమాత చిత్రపటాన్ని కలశాన్ని ఊరేగించారు. అనంతరం కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కార్యక్రమాల్లో చందోలు ఆంజనేయులు, రామారావు, రవికుమార్, మల్లికార్జునరావు, నేరెళ్ల కిషోర్, రవి, భక్తులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

ముగ్గురికి గాయాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 11 : మండలంలోని పెద ఉల్లగల్లు సచివాలయం ఎదురు అద్దంకి - దర్శి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. దొనకొండ మండలం ఇండ్లచెరువు గ్రామానికి చెందిన దెయ్యాల అచ్చయ్య తన భార్య రాణి ద్విచక్ర వాహనంపై మండలంలోని కెల్లంపల్లి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా పసుపుగల్లు నుంచి వడియాల అబ్రహం ద్విచక్ర వాహనంపై దర్శి వెళ్తుండగా పెద ఉల్లగల్లు సచివాలయం వద్దకు వచ్చే సరికి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో భార్యాభర్తలు అచ్చయ్య, రాణి తీవ్రంగా గాయపడ్డారు. అబ్రహంకు స్వల్ప గాయాలయ్యాయి. ముగ్గురినీ 108 సిబ్బంది దర్శిలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన అచ్చయ్య



గాయపడిన రాణి



గాయపడిన నాగభూషణం

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మండలంలోని చిన ఉల్లగల్లు ఎస్సీ కాలనీకి చెందిన తప్పెట నాగ భూషణం అనే వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొనటంతో తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే నాగ భూషణం హోటల్ టిఫెన్ చేసి ఇంటికి వెళ్తుండగా పసుపుగల్లుకు చెందిన బిజ్జం శ్రీనివాసరెడ్డికి చెందిన ట్రాక్టర్ నడుపుకుంటూ పసుపుగల్లు వెళ్తుండగా నాగ భూషణాన్ని ఢీకుంది. దీంతో నాగ భూషణానికి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక కాలు విరిగి పోగా మరొక కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు నాగ భూషణానికి చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ముండ్లమూరు పోలీసులు వివరాలు సేకరించారు. ఆస్పత్రి నుంచి ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.



నేడు ఇరిగినేని వర్ధంతి

పామూరు, ఫిబ్రవరి 11 : కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు వర్ధంతి కార్యక్రమాలను మండలంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని బొట్లగూడూరు గ్రామంలోని ఇరిగినేని విగ్రహానికి నివాళి, మోపాడులో ఇరిగినేని ఘాట్ వద్ద శ్రద్ధాంజలి, అన్నదాన కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర పాల్గొంటారని తెలిపారు. టీడీపీ శ్రేణులు, ఇరిగినేని అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



గంజాయి ఘోరాలు

- జోరుగా అమ్మకాలు.. మత్తులో దారుణాలు
- గతంలో పర్యాటకులపై దాడి.. తాజాగా హత్య
- వెలుగులోకి కొన్నే.. ఎన్నో ఘటనలు మరుగున



- గంజాయి మాఫియాకి పాలక పార్టీ నేతల అండ
- అవగాహన శిబిరాలతో సరిపెడుతున్న పోలీసులు
- కళాశాలలు, తీరప్రాంతాలు, రిసార్టులే అడ్డాగా దందా

బాపట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జోరుగా గంజాయి విక్రయాలు.. మత్తులో యువత.. ఘర్షణలు.. దారుణాలతో చెలరేగిపోతోంది. కళాశాలలు, తీరప్రాంతాలు, రిసార్టులే అడ్డాగా గంజాయి దందా సాగుతోంది. సరిహద్దుల వద్ద పోలీసు తనిఖీలు అంతంత మాత్రంగా ఉండడంతో గంజాయి మాఫియాకి కలిసివస్తోంది. గతంలో గంజాయి ఎక్కడన్నా పట్టుబడితే అదొక సంచలనంగా ఉండేది. అలాంటిది ప్రస్తుతం గంజాయి పట్టు బడడం అనేది సాధారణ విషయంగా మారిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ ఘనత పాలకులు, పోలీసులదేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో గంజాయి ఎక్కడ పట్టుబడినా అంతిమంగా దానిని చేరవేస్తున్నది కళాశాలలకు, తీరప్రాంతాలకు అనే తేలడం మరింత ఆందోళన కలిగిస్తోంది. గంజాయి మత్తులో జిల్లాలో యువత ఘోరాలకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. నాలుగు నెలల క్రితం గంజాయి మత్తులో ఉన్న కొంతమంది యువకులు సూర్యలంక తీరానికి వచ్చిన పర్యాటకులతో దురుసుగా ప్రవర్తించగా, పెద్దమనుషుల రంగప్రవేశంతో అది సమసిపోయింది. తాజాగా సూర్యలంక తీరానికి వెళ్లే రోడ్డులో ఓ యువకుడ్ని దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. గంజాయి మత్తులో జరిగే దారుణాలలో వెలుగుచూస్తున్నవి కొన్నే. మరెన్నో ఘటనలు బహిర్గతం కాకుండానే మరుగునపడి పోతున్నాయి. విద్యల కాణాచిగా పేరున్న బాపట్లకు ఆ పేరును చెడగొట్టేలా కొంతమంది గంజాయి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఓ మండల స్థాయి వైసీపీ నేత బంధువే ఈ దందాలో కీలకంగా ఉంటాడన్న ప్రచారం ఉంది. గతంలో ఓ సారి బాపట్ల రూరల్ పోలీసులు సదరు యువకుడ్ని అదుపులోకి తీసుకోగా ఆ నేత పై స్థాయిలో పరపతి ఉపయోగించి అతడ్ని విడిపించారన్న ప్రచారం అప్పట్లో నడిచింది. ఇలా చివరికి గంజాయి అమ్మకాల్లో కూడా పాలకపార్టీ పాత్ర ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉండడం విస్మయం కలిగిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. విశాఖ మన్యంతో పాటు తీర ప్రాంతాల్లో ఉన్న రవాణా వెసులుబాటును ఆసరాగా చేసుకుని ఎక్కువగా జిల్లాలోకి గంజాయి ప్రవేశిస్తోందని సమాచారం. సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీలు తూతూ మంత్రంగా ఉండడంతో ఆ మార్గం కూడా మాఫియాకు వరంగా మారింది. అనుమానం రాకుండా కొందరు విద్యార్థులను ఎంపిక చేసుకుని వారు అనుకున్న ప్రాంతాలకు ప్యాకెట్ల రూపంలో గంజాయిని చేరవేస్తున్నారు.

గంజాయి పట్టుబడిన ఘటనలు ఇలా..

- రేపల్లెకు చెందిన ఇద్దరు వ్యక్తులు కృష్ణా జిల్లాలో గంజాయి అమ్ముతూ పట్టుబడిన ఘటన గతేడాది వెలుగుచూసింది. వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు.

బాపట్లలో గంజాయి అమ్ముతున్న గ్యాంగ్‌ను గతేడాది పోలీసులు అరెస్టు చేశారు.

చినగంజాం మండలం మోటుపల్లి సమీపంలోని రుద్రమాంబపురంలో భారీగా దొరికిన గంజాయి ఖాకీలను ఉలిక్కిపడేలా చేసింది.

బాపట్లలోని ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో గంజాయి అమ్మకాలు సాగిస్తున్నాడన్న అనుమానంతో గతంలో ఓ యువకుడ్ని తీసుకొచ్చి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

గతేడాది చినగంజాం మండలం మోటుపల్లిలో దొరికిన గంజాయి వైసీపీ ఎంపీటీసీ సభ్యుడి ఇంట్లోనే కావడం గమనార్హం. సదరు నాయకుడికి వైసీపీ కీలక నేతల అండదండలుండడంతో ఆ కేసును నీరుగార్చారనే విమర్శలు ఉన్నాయి.

హడావిడి తప్ప.. కఠిన చర్యలేవి

ఎక్కడైనా గంజాయి గుప్పుమన్నప్పుడు ఆ రెండు రోజులు హడావిడి చేయడం తప్ప చిత్తశుద్ధి అనేది పోలీసు చర్యల్లో కనిపించడం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గతేడాది కళాశాలల్లో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశారు. కానీ ఆశించిన స్థాయిలో ఆ చర్యలు ఫలితాలనివ్వలేదు. గంజాయి మూలాలు తెలిసినప్పటికీ ఒత్తిళ్లతో వారిపై పోలీసులు మెతక వైఖరి అవలంబిస్తున్నారన్న అపవాదు ఉంది. తీరప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న రిసార్టులపై నిఘా కొరవడింది. ఆ రిసార్టుల్లో పేకాట మొదలు మత్తు పదార్థాల వాడకం వరకు అన్నీ అడ్డూఅదుపు లేకుండా సాగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. అయినా వాటి వైపు కన్నెత్తి చూసే సాహసమే పోలీసులు చేయడం లేదన్న విమర్శ ఉంది.



చినగంజాం మండల పరిధిలో పట్టుబడిన గంజాయి (ఫైల్ ఫొటో)

ఎన్నికల.. బదిలీలలు

ఎన్నికల సమీపిస్తోన్న తరుణంలో ఉద్యోగుల బదిలీలకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల్లో రాజకీయ జోక్యం నివారించడమే బదిలీల ప్రధాన ఉద్దేశం. అయితే ఇప్పటి వరకు జరిగిన బదిలీల తీరుతెన్నులను పరిశీలిస్తే ఏ రాయి అయితే ఏమిటి పళ్లు ఊడగొట్టుకోవడానికి అన్న చందాన ప్రక్రియ తయారైందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నేతల సిఫార్సులతో జరిగిన పోస్టింగ్‌లపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీల ఉద్దేశమే అధికారపార్టీ ప్రాపకాన్ని తగ్గించడమై ఏకంగా వారి సిఫార్సు లెటర్లతోనే పోస్టింగ్‌లు దక్కించుకున్న వారు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉన్నారంటే వారి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేసే విధంగా కూడా కొన్ని చోట్ల నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలను ఉద్యోగ సంఘాలు కూడా వ్యక్తం చేస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మొత్తం ప్రక్రియ పాలకపార్టీ కనుసన్నల్లో జరగడంతో బదిలీల లీలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.



- వైసీపీ నేతల మాటే చెల్లుబాటు
- అధికార పార్టీ సిఫార్సు లెటర్లతో పోస్టింగ్‌లు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈసీ ఆదేశాలు బేఖాతరు
- అధికార పార్టీ అనుకూల పోస్టింగ్‌లపై మండిపడుతోన్న టీడీపీ

బాపట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశా లతో అధికారులు ఎన్నికల విధుల్లో భాగస్వామ్యమయ్యే ఉద్యోగుల బదిలీలను చేపట్టారు. ఒకే చోట మూడేళ్లు పూర్తి చేసుకున్న వారితో పాటు స్థానికత కొలమానంగా బదిలీలను చేపట్టాలని ఎన్నికల కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ నెల మొదటి వారంలో రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి వందల సంఖ్యలో ఉద్యోగులను బదిలీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. అయితే ఈ చేర్పులు మార్పులు మొత్తం పాలకపార్టీ నేతల కనుసన్నల్లోనే జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొరుగు జిల్లాలో తమకు అనుకూలంగా ఉండే అధికారులను వెతికి మరీ వైసీపీ నేతలు తమకు అనకూలంగా ఉండే చోట పోస్టింగ్ వేయించుకున్నారు. విస్తృత పరిచయాలున్న కొంతమంది ఉద్యోగులు అయితే ఏకంగా వారే నేతలను సంప్రదించి మీ మాటే శిరసావహిస్తామనే వాగ్దానంతో అనుకున్న చోట బదిలీని బహుమానంగా పొందగలిగారన్న విమర్శలున్నాయి. ఈ తంతు ఎన్నికల ప్రక్రియలో కీలకంగా వ్యహరించే రెవెన్యూ, పోలీస్ విభాగాల్లో చోటుచేసుకుంది. ఈ రెండు విభాగాల నుంచి ఒక్క బాపట్ల జిల్లాలోనే 50 మందికి పైగా బదిలీలు అధికారపార్టీ నేతల ఆశీస్సులతోనే జరిగాయని తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ సంఖ్య వందల్లో ఉన్నట్లు సమాచారం. రెవెన్యూలో తహసీల్దార్ల బదిలీలు ఎక్కువగా ఉండగా, పోలీసు విభాగంలో దాదాపు ప్రతి చోట ఎస్‌ఐ, సీఐలను బదిలీ చేశారు.

స్థానిక నేతల అంగీకారంతోనే..

ఉమ్మడి జిల్లాలు కొలమానంగా ఒకే చోట మూడేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేసే క్రమంలో అనేక వింతలు చోటు చేసుకున్నాయి. వేరే జిల్లాల నుంచి ఇక్కడకు రావాలనుకున్న వారు అందుకు ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్లు సమాచారం. అధికార పార్టీ నేతల ఆశీస్సులతో అనుకున్న చోటకు బదిలీ చేయించుకోగలిగారు. ఇటీవల జరిగిన బదిలీలలో దాదాపు 75 శాతం ఈ విధంగా జరిగినవే కావడం గమనార్హం. ఇక పోలీసు శాఖలో అయితే స్థానికంగా ఉన్న నేతల లెటరు ఆధారంగానే ఈ తంతు నడిచిందనే ఆరోపణలు ఆ శాఖ నుంచే రావడం గమనార్హం. అద్దంకిలో వైసీపీ సమన్వయకర్తగా నియమితులైన నేత కనుసన్నల్లోనే ఉద్యోగుల బదిలీల పర్వం నడిచినట్లు తెలుస్తోంది. సీఐలు, ఎస్‌ఐల పోస్టింగ్‌ల విషయంలో ఆ నేత అంగీకారమే ప్రామాణికంగా బదిలీలు చేపట్టినట్లు సమాచారం. బాపట్ల రూరల్ పోస్టింగ్ విషయంలో సదరు నేత ఆదేశాలతోనే పోస్టింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. రెవెన్యూలో అయితే నేతలు తమ అనుకూలురును ఆయా మండలాల్లో తహసీల్దార్లుగా నియమించుకోవడంలో విజయం సాధించారు. నిత్యం ఫ్యాక్షన్ గొడవలతో అట్టుడుకుతున్న పల్నాడు జిల్లాలో స్థానిక నేతల అండదండలతోనే 80 శాతం బదిలీలు జరిగినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతల అండదండలతో వారికి అనుకూలంగా జరిగిన ఈ బదిలీలపై ప్రతిపక్ష టీడీపీ నాయకులు మండిపడుతున్నారు.

ఇక పారదర్శకతకు ఆస్కారం ఎక్కడ...

ఎన్నికలు సమీపిస్తున్న వేళ అత్యంత పారదర్శకంగా జరగాల్సిన బదిలీలు పాలకపార్టీ నేతల అంగీకారంతోనే జరగడంపై విపక్ష టీడీపీ మండిపడుతోంది. బదిలీలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చి వదిలేసిందని, కానీ వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అస్మదీయులకు పదవుల పందేరం చేసి ఎన్నికల వేళ అక్రమాలకు రంగం సిద్ధం చేసుకుందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బదిలీలు అన్నీ నిబంధనల ప్రకారమే జరిగినట్లు పైకి కనబడుతున్నా అనుకున్న చోట పోస్టింగ్ పొందిన వారంతా పాలకపార్టీ ప్రాపకం ఉన్నవారేనని ఈసీ ఈ అవకతవకలపై దృష్టి సారించాలని టీడీపీ అభ్యర్థిస్తోంది.

ఓట్లకు.. ఇంధనం



- ఎన్నికలు సమీపిస్తున్న వేళ కరెన్సీ కట్టలు సిద్ధం
- కోట్లు వెచ్చించాల్సిన ఆశావహులు
- నోటిఫికేషన్‌కు ముందే డబ్బు తరలింపు?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో గెలుపునకు ధనమే కీలకం. పార్టీలు టిక్కెట్ కేటాయింపులో కూడా డబ్బును ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. టిక్కెట్ ఇస్తే ఎంత ఖర్చు పెట్టగలరు... ఎలా సమకూర్చుకుంటారు అనే ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పగలిగిన నేతలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజకీయాల్లో సీనియర్లు, జూనియర్లు తేడా లేదు. డబ్బు భారీగా ఖర్చు చేయగల సత్తా ఉన్న నేతలకే పార్టీలు టిక్కెట్లు ఇస్తున్నాయన్న ప్రచారం ఉంది. ధనం తర్వాతే కులానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకటి రెండు టిక్కెట్‌లను మాత్రమే సమర్థత ఆధారంగా ఇస్తు న్నారు. ఒక్కో అభ్యర్థికి రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్లు ఖర్చు అవుతుందన్న అంచనా వేసున్నారు. ఈ మేరకు లెక్క కడితే పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రూ.1,700 నుంచి రూ.2,100 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాగా ఉంది. ఎన్నికల్లో నిబంధనల మేర చూపించే ఖర్చు మినహా మిగతాది నల్లధనమే ఖర్చు చేస్తారు.

కోట్లు కుమ్మరిస్తేనే గెలుపు...

కోట్లు కుమ్మరిస్తేనే గెలుపు అవకాశాలు ఉండే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు అధికారికంగా టిక్కెట్‌లు పూర్తిస్థాయిలో ప్రకటించనప్పటికీ అభ్యర్థులకు సమాచారం ఇచ్చారు. దీంతో డబ్బు సమకూర్చుకోవడంతో వారంతా నిమగ్నమయ్యారు. నోటిఫికేషన్ వెలువడే లోపు డబ్బు సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఒక్కో ఓటుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. కొన్ని చోట్ల రూ.2,000 కూడా ఇచ్చారు.

డబ్బు సమకూర్చుకోవడంలో నిమగ్నం..

నామినేషన్ దాఖలు నుంచి పోలింగ్ వరకు ఊహించని రీతిలో డబ్బు ఖర్చు అవుతుంది. ప్రచారానికే ఎక్కువగానే ఖర్చుచేయాల్సి ఉంది. మద్యం కూడా ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తోంది. మద్యం ఖర్చు కూడా భారీగానే ఉంటుంది. ఒక్కో నియోజకవర్గంలో కేవలం మద్యానికి ఖర్చు రూ.5 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. పోలింగ్ ఏజెంట్లు, నేతల కొనుగోలు జరుగుతుంటాయి. వీరికి లక్షల్లో చెల్లిస్తుంటారు. విందులు, వినోదాలకు కూడా భారీగానే ఖర్చు చేస్తుంటారు. ఓటు కొనుగోలు అన్నిటికన్నా ప్రధానమైనది. ఈ సారి ఎన్నికల్లో ఓటు రేటు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఉంటుందని నేతలు అంచనా వేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో లక్ష నుంచి 1.50 లక్షల ఓట్లు కొనుగోలు చేస్తుంటారు. దీని ప్రకారం ఓట్ల కొనుగోలుకు 25 నుంచి 30 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నెల మూడవ వారంలో నోటిఫికేషన్ వస్తుందని ప్రచారం నేపథ్యంలో అప్పటికల్లా డబ్బు సమకూర్చుకోవడం పూర్తి చేసుకోవాలని వారు భావిస్తున్నారు. నోటిఫికేషన్ వెలువడితే తనిఖీలు ముమ్మరంగా ఉంటాయి. దీంతో ఆ సమయంతో డబ్బు ఒక చోట నుంచి మరో చోటికి చేరవేసే పరిస్థితులు ఉండవు. దీంతో నోటిఫికేషన్ వెలువడే లోపలే డబ్బు పక్రియ పూర్తి చేసుకునే దిశగా అభ్యర్థులు జాగ్రత్త పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈసారి ఎన్నికల ఖర్చు ఉంటుందని అంచనా. నల్లధనమే ఎన్నికల్లో ఖర్చు చేస్తారన్నది బహిరంగ రహస్యమే.

ప్రకటనల్లోనే.. మరమ్మతులు

- చిద్రమైన కాల్వ కట్టలు, ర్యాంప్‌లు
- చివరి భూములకు సాగునీరు ప్రశ్నార్థకం
- నాలుగున్నరేళ్లుగా పట్టించుకోని అధికారులు

రేపల్లె, ఫిబ్రవరి 11: వైసీపీ అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్లుగా పంట కాల్వలు మరమ్మతులకు, పూడికతీతలకు నోచుకోలేదు. ప్రతి ఏటా కాల్వల మరమ్మతులు, పూడికతీత పనులు చేపట్టి రైతులకు సాగునీరు అందిస్తామని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో అమలుకాలేదు. రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని బ్యాంక్ కెనాల్, అనుబంధ కాల్వకు కనీస మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. దీంతో రైతులు ఎన్ని కష్టాలు పడినా చివరి భూములకు సాగునీరు అందక లక్షలాది రూపాయల పంట నష్టపోతున్నారు. ఏటా ఓఎన్‌ఎం నిధుల కింద కాల్వల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చెయ్యాల్సి ఉండగా కనీస మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. కాల్వల పూడికతీతలు తియ్యాలని అడగ్గా నిధులు లేకపోతే తామేమి చెయ్యాలని అధికారులు అంటున్నారని రైతులు వాపోతున్నారు. వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని బ్యాంక్ కెనాల్ కాల్వ కట్టలు కోతలకు గురై ర్యాంప్‌లు, చప్టాలు చిద్రమై ప్రమాద భరితంగా మారాయి. రెండువైపులా విపరీతంగా చెట్లు పెరగడంతో కాల్వ కుచించుకుపోతున్నది. కాల్వలో విపరీతంగా మట్టి పేరుకుపోయినా పూడిక తీయడంలో జలవనరుల శాఖ నిర్లక్ష్యంగా ఉంది. రానున్న ఖరీఫ్ సీజన్‌లోపు బ్యాంక్ కెనాల్‌కు మరమ్మతులు చేపట్టాలని తీరప్రాంత రైతులు కోరుతున్నారు. కట్టలు ఎక్కడికక్కడ తెగిపోయి పూర్తిగా పూడుకుపోవటంతో చివరి భూములకు సాగునీరు అందక ఏటా వందల ఎకరాలు బీళ్లుగా మారిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో రైతులు లక్ష 50వేల ఎకరాలకు పైగానే ఖరీఫ్ సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నదే తప్ప ఆచరణలో అమలు చేయడంలేదని రైతులు అంటున్నారు. నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, రేపల్లె రూరల్ మండలంలోని రాజుకాల్వ, లంకెవానిదిబ్బ తదితర పొలాలకు సాగునీరు చివరి దశలో రావడంతో కొంతమేర పంట నష్టపోవాల్సి వస్తుంది. బ్యాంక్ కెనాల్ రేపల్లె మండలం రాజుకాల్వ నుంచి లక్ష్మీపురం వరకు సైడ్ కాల్వగా మారిపోయింది. వెల్లటూరు, పెదపులివర్రు, ఓలేరు, రేపల్లె మండలం పెనుమూడి, రుద్రవరం, మోర్తోట, లక్ష్మీపురం, అరవపల్లి, ఉప్పూడి, నగరం మండలం సజ్జావారి పాలెం, కోపూరి పాలెం, నల్లూరు, పీరాట్లంక, గంగడి పాలెం, నిజాంపట్నం మండలం కూచిన పూడి సమీపంలో కట్టలు కోతలకు గురై ర్యాంప్‌లు చిద్రమై వ్యర్థాలతో పూడుకుపోయింది. రాజుకాల్వ నుంచి లంకెవానిదిబ్బ వరకు వెళ్లే బ్యాంక్ కెనాల్ రొయ్యల చెరువులుగా మారి పిల్ల కాల్వగా తయారైంది. ఇందులో నీరు పారుదల కాక లంకెవానిదిబ్బ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరం మండలం సజ్జావారి పాలెం, అల్లపర్రు, మంత్రిపాలెం తదితర గ్రామాల్లో బ్యాంక్ కెనాల్‌కు మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి ఉంది. పూడికలు తీస్తే కాని చివరి భూములకు సాగునీరు అందే పరిస్థితి లేదు. ఈఏడాదైనా కాల్వ కట్టల మరమ్మతులు, పూడికతీత, చిద్రమైన ర్యాంప్‌లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. అంచనాలు రూపొందించి వేసవిలో అయినా మరమ్మతు పనులు చేపడితే ఖరీఫ్ నాటికి చివరి భూములకు సాగునీరు అందే అవకాశం ఉందని రైతులు చెప్తున్నారు. జలవనరుల శాఖాధికారుల ఈఏడాదైన వీటిపై దృష్టి సారించి బ్యాంక్ కెనాల్ పూడిక తీతలతో పాటు కట్టలను బలపరిచి సైడ్ రివిట్‌మెంట్లు, ర్యాంప్‌లను ఏర్పాటు చేసి చివరి భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మెయిన్‌కెనాల్ కోతకు గురవ్వటంతో కాలిబాటగా తయారైన కట్ట



బీటులు బారిన ర్యాంప్‌లు, ఉప్పూడి మెయిన్ కెనాల్‌లో చిద్రమైన ర్యాంప్‌లు

తగిలేదేలే!

- లక్షలు కొల్లగొడుతున్న లాటరీ
- సామాన్యుడి జేబుకు చిల్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిలువు దోపిడీ
- వైసీపీ నేతల అండతో చెలరేగుతున్న నిర్వాహకులు

వంద రూపాయలు కట్టి లాటరీ టికెట్ కొనండి.. మీదే అదృష్టం.. లాటరీ తగిలితే రాత్రికి రాత్రే లక్షాధికారులు కావచ్చు.. అంటూ వల వేస్తున్నారు. దీంతో ఓసారి తమ అదృష్టం పరీక్షించుకుందామని పేద, మధ్య తరగతివారు చమటోడ్చి సంపాదించుకున్న డబ్బుతో టికెట్లు కొంటున్నారు. కనీసం ఒక్కసారైనా లాటరీ తగలగకపోతుందా.. పోగొట్టుకున్న డబ్బు రాబట్టుకోలేమా అనే ఆశతో అప్పులు చేసి మరీ టికెట్లు కొనుగోలు చేసి సర్వం కోల్పోతున్నారు.



నిర్వాహకులు రాసే నెంబర్‌లు



గుంటూరు, ఫిబ్రవరి 11 : అదృష్టం వరిస్తే కనక వర్షం కురిసినట్లేనని నిర్వాహకులు ఆశచూపి ఎర వేస్తున్నారు. కేరళ రాష్ట్రంలో అధికారికంగా కొనసాగుతున్న లాటరీలో ఎంతోమందికి లాటరీ తగిలి కోట్లు వచ్చిన విషయాన్ని ఇక్కడ ప్రచారం చేస్తూ మీరు కూడా అదేవిధంగా కోట్లు సంపాదించుకోవచ్చు అని ఆకర్షిస్తున్నారు. ఈ లాటరీ మాయాజాలంలో నిర్వాహకులు లక్షల్లో కొల్లగొడుతుంటే టికెట్లు కొనుగోలు చేసిన సామాన్యులు దివాళా తీస్తున్నారు. కనీసం ఒక్కసారైనా లాటరీ తగలగకపోతుందా.. పోగొట్టుకున్న డబ్బు రాబట్టుకోలేమా అనే ఆశతో అప్పులు చేసి మరీ టికెట్లు కొనుగోలు చేసి సర్వం కోల్పోతున్నారు. ఆన్‌లైన్‌లో సాగే ఈ లాటరీకి ఎటువంటి అనుమతులు లేవు. దీని నిర్వాహకులు ఎవరు? ఈ వెబ్‌సైటును ఎక్కడి నుంచి ఆపరేట్ చేస్తున్నారు? ఫలితాలను ఎవరు విడుదల చేస్తున్నారు. ఈ డబ్బులు అన్నీ ఎక్కడికి చేరుతున్నాయి? అనే ప్రశ్నలకు సమాధానం లేదు.

ఆట సాగేదిలా...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు కేంద్రా ల్లో రోజూ సాయంత్రం నాలుగు గంటలకు ఆన్‌లైన్‌లో లాటరీ ఫలితాలను విడుదల చేస్తారు. అప్పటినుంచి ఆ తర్వాత రోజు లాటరీ కోసం టికెట్ల విక్ర యం ప్రారంభిస్తారు. తర్వాత రోజు మధ్యాహ్నం 2:30 గంటల వరకు టికెట్ల విక్రయం జరుగుతుంది. ఆ తర్వాత ఏఏ నెంబర్ల నుంచి ఏ నెంబర్ల వరకు టికెట్లు విక్రయాలు జరిగాయనే సమాచారం ఆన్‌లైన్‌లో నిర్వాహకుడి దృష్టికి వెళ్తుంది. టికెట్ ధర రూ.40 నుంచి రూ.1500 వరకు ఉంటుంది. ఒక్కో లాటరీపై ఐదు అంకెల నెంబర్ ఉంటుంది. అది తగిలితేనే లాటరీ వచ్చినట్లు. రూ.40తో టిక్కెట్ కొనుగోలు చేస్తే ఐదు అంకెలు లాటరీ తగిలితే రూ.80 వేలు ఇస్తారు.

పక్కాగా మోసం చేసేదిలా..

ఈ లాటరీ వ్యవహారంలో పక్కాగా మోసానికి పాల్పడుతున్నారు. అదెలా అంటే... ఈరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి టికెట్ల విక్రయం ప్రారంభమవుతుంది. తర్వాత రోజు నాలుగు గంటలకు ఆన్‌లైన్‌లో ఫలితాలు వెల్లడిస్తారు. ఫలితాల వెల్లడికి గంటన్నర ముందుగా టికెట్ల విక్రయం పూర్తవుతుంది. అయితే నిర్వాహకులు ముందుగా అన్ని టికెట్లు విడుదల చేయకుండా కొన్ని టికెట్లు వారి వద్ద ఉంచుకుంటారు. ఆ టికెట్ల నంబర్లనే ఆన్‌లైన్‌లో ఉంచుతారు. అంటే ఎవరు ఎన్ని టికెట్లు కొనుగోలు చేసినా లాటరీ మాత్రం రాదని స్పష్టంగా అర్థం అవుతుంది. అంతేగాక లాటరీ ఫలితాలు విడుదల చేయడానికి గంటన్నర ముందే టికెట్ల విక్రయం పూర్తవుతుంది కాబట్టి టికెట్లు విక్రయించిన వారందరూ ఏ ఏరియాలో ఎన్ని నెంబర్ల టికెట్‌లు విక్రయించిందీ ఆన్‌లైన్‌లో ఉంచుతారు. దీనిని బట్టి విక్రయించని టికెట్ నెంబర్లను కూడా ఆన్‌లైన్‌లో ఉంచుతున్నారు. దీంతో కొందరు రిటైల్ టికెట్ విక్రేతలు ఇదే విషయాన్ని కొనుగోలు దారులకు చూపి మరికొన్ని టికెట్లు కొంటే లాటరీ తగిలేదే అంటూ మరింత ఆశ కల్పిస్తున్నారు.



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామి

జైలు రాత నీకే రాసి ఉంది.. అందుకే నీనోట ఆమాట

● మంత్రి సురేష్‌పై స్వామి విమర్శ

● జయహో బీసీ కార్యక్రమానికి భారీగా హాజరు

కొండపి, ఫిబ్రవరి 11 : జైలుకెళ్లే రాత మంత్రి సురేష్‌కు, ఆయన భార్యకు రాసి పెట్టిఉందని, అందుకే నుదుట రాసిన రాత మంత్రి నోట పదేపదే పలుకుతోందని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విమర్శించారు. కొండపిలోని దివంగత ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాల సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగిన జయహో బీసీ సభలో స్వామి మాట్లాడారు. మంత్రి సురేష్ తనను పదేపదే జైలు పక్షి అని సంబోధిస్తున్నాడని, ఆ గతి ఆయనకే పట్టనుందని చెప్పారు. రూ.40 కోట్లు పన్నులు ఎగవేసిన కేసులో సురేష్ బెయిల్‌పై తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి మంత్రిగా ఉండి ఒక్క రోజైనా కొండపి నియోజకవర్గానికి రాని మంత్రి ఇప్పుడు అన్నీ చేస్తాననిబూటకపు మాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నాడని విమర్శించారు. ఒక్క చోటైనా రెండుసార్లు వరుసగా పోటీ చేయడానికి ధైర్యం లేని సురేష్ కొండపిలో పోటీ చేసి సాధించేదేమీ లేదని చెప్పారు. అతనికి ఓట్లేసి గెలిపించిన ఎర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజలు ప్రజలు మంచినీటి కోసం ఆందోళన చేస్తున్నారన్నారు. ముందు అక్కడి ప్రజల తాగునీటి ఎద్దడి తీర్చి, నీళ్లు తోలిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించాలని చెప్పారు. బీసీ బాలురకు కొండపిలో, బీసీ బాలికలకు సింగరాయకొండలో గురుకుల పాఠశాలలు టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేస్తే వాటికి భవనాలు కట్టని దుర్మార్గపు ప్రభుత్వం వైసీపీదని అన్నారు. తొలుత టంగుటూరు రోడ్డు నుంచి సభా ప్రాంగణం వరకు టీడీపీ కార్యకర్తలు భారీ ర్యాలీ చేశారు. సభకు ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బత్తుల నారాయణస్వామి, బీసీ సెల్ నాయకులు బ్రహ్మయ్య, మిచ్చల బ్రహ్మయ్య, దేపూరి రత్తమ్మ, దేపూరి మస్తాన్, బండ్ల శ్రీనివాసరావు, షేక్ ఖాతఃషా, ముక్కు ప్రసాద్, గొర్రెపాటి రామయ్య చౌదరి, పోకూరి రవీంద్రబాబు, బొడ్డపాటి యల్లమంద నాయుడు, బూదవాటి సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య జనసేన నేతలు యనమదిలి విశ్వం పాల్గొన్నారు. కొండపికి చెందిన పలు బీసీ కుటుంబాలు స్వామి సమక్షంలో పార్టీలో చేరారు.

రేపు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 11 : జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన ఈనెల 13న ఒంగోలులోని ఆగ్లీలియం హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.సుభద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులకు సంబంధిత పాఠశాలల గైడ్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రాజెక్టులు రూపొందించేందుకు చొరవ చూపాలన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల వారీగా ఈ ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9666955504 సెల్ నంబరులో సంప్రదించాలని డీఈవో కోరారు.



ఎస్పీ గర్గ్ దంపతులను సన్మానిస్తున్న ఐజీ పాల్‌రాజ్, పక్కన కలెక్టర్ దినేష్‌కుమార్

ఎస్పీ మలికగర్గ్‌కు ఘనంగా వీడ్కోలు

● నేడు విధుల్లో చేరనున్న పరమేశ్వరరెడ్డి

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 11 : పోలీసు శాఖలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని బదిలీపై తిరుపతి ఎస్పీగా వెళుతున్న మలికగర్గ్‌కు అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఆదివారం రాత్రి స్థానిక పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గుంటూరు రేంజ్ ఐజీ పాల్‌రాజు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీగా మలికగర్గ్ చేసిన సేవలను ప్రశంసించారు. మంచి అధికారిగా పేరుతెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం ఎస్పీ మలికగర్గ్, ఆమె భర్త అయిన బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్‌ను సత్కరించారు. ఇటీవల వరకూ జిల్లాలో పనిచేసి బదిలీ అయిన డీఎస్పీ కె.నారాయణస్వామి రెడ్డిని కూడా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావుతో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం వీడ్కోలు పరేడ్‌ను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా జిల్లా ఎస్పీగా పరమేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకూ తిరుపతిలో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వస్తున్నారు.



మాట్లాడుతున్న రమేష్

ఐసీడీఎస్ నిర్వీర్యానికి ప్రభుత్వాల కుట్ర

● సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్

కనిగిరి, ఫిబ్రవరి 11 : అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు కుట్ర పన్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లకు ఆదివారం రెండవ రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేసిన పోరాటం ఆదర్శంగా నిలించిందన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం మొండిగా ఉద్యమాన్ని నీరు గార్చేందుకు విశ్వప్రయత్నం చేసి విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జీ శ్రీనివాసులు, కార్యదర్శివర్గ సభ్యులు పీసీ కేశవరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన, సీఐటీయూ నాయకులు రాయళ్ళ మాలకొండయ్య, రంగారావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మహాలక్ష్మి, రాధా, సీత, రజని, రామసుబ్బులు, ఎల్లమ్మ ఐద్వా నాయకురాలు ప్రసన్న పాల్గొన్నారు.

గుంటిగంగలో వాటర్‌ప్లాంట్‌కు భూమి పూజ

తాళ్లూరు, ఫిబ్రవరి 11 : గుంటిగంగ సన్నిధిలో భక్తులకు మంచి నీటిని అందించేందుకు శ్రీమత్ బాలాత్రిపుర సుందరి సేవా సమితి ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సేవా సమితి నిర్వాహకులు, విశ్రాంత డీఎస్పీ రాఘవరావు ఆదివారం భూమి పూజ చేశారు. గంగమ్మతల్లి దర్శనంకు వచ్చే భక్తులకు మంచి నీటి వసతిని కల్పించేందుకు రాఘవరావు ముందుకు వచ్చారు. ప్లాంట్ ఏర్పాటుకు గ్రామపంచాయతీ గుంటిగంగ సన్నిధిలో ఆర్యవైశ్య సత్రానికి వెళ్లే ముందు భాగంలో రోడ్డును అనుకుని స్థలాన్ని కేటాయించారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఆలయ ఈవో పి.కార్తీక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఎస్సై వైవీ రమణయ్య, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.శ్రీనివాసరావు, నాగంబొట్లపాలెం సొసైటీ అధ్యక్షుడు యాడిక యల్లమందారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ యోగిరెడ్డి, సోమా సుబ్బారావు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

జగనా.. మజాకా!

డమ్మీలైన వైసీపీ ఎమ్మెల్యేలు

ఇన్‌చార్జిల పేరుతో స్థానికేతరులు, పాలనా అనుభవం లేని వారికి పెత్తనం

విపక్ష శాసనసభ్యుల కన్నా దిగజారిన పరిస్థితి

నిన్నటి దాకా సెల్యూట్ కొట్టిన యంత్రాంగం

నేడు ఫోన్ కూడా తీయని వైనం

ప్రతిపక్ష ఎమ్మెల్యేలను పక్కన పెట్టడం, అధికార పార్టీ నేతలకు పరోక్ష పెత్తనం ఇవ్వడం ఇప్పటి దాకా రాజకీయాల్లో మనం చూస్తున్న తంతు. కానీ జగన్‌రెడ్డి సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం వింత పోకడకు తెరతీసింది. సాక్షాత్తూ అధికార పార్టీ ఎమ్మెల్యేలనే పక్కకు నెట్టేసింది. స్థానికేతరులకు, కనీస ప్రొటోకాల్ సౌకర్యం కూడా లేని కొత్త ఇన్‌చార్జిలకు పెత్తనం ఇస్తోంది. అధికార పార్టీలో ఉండి ఇంకా నాలుగు మాసాల పదవీకాలం ఉన్నా ఎమ్మెల్యేలకు దక్కాల్సిన గౌరవం లభించకుండా చేసింది. నిన్న మొన్నటి వరకూ ఉదయాన్నే ఇంటికొచ్చి తలుపు తట్టి మరీ సెల్యూట్ కొట్టిన అధికారులు ఇప్పుడు ఆ ఎమ్మెల్యేల ఫోన్ కూడా ఎత్తడం లేదంటే వారిని ఏస్థాయికి దిగజార్చారో అర్థంచేసుకోవచ్చు. జిల్లాలోని సగం నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుండగా, ముగ్గురు ఎమ్మెల్యేల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను అధికార వైసీపీ ముందుగానే ప్రకటిస్తోంది. అలాంటి వారిని పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా నియమిస్తోంది. వారిని సిటింగ్ ఎమ్మెల్యేలతో కలిసి పనిచేసుకోవాలని సూచించటం సర్వసాధారణం. పాలనా వ్యవహారాలను పక్కన పెట్టి పార్టీ యంత్రాంగం మొత్తం కాబోయే అభ్యర్థికి సహకరించాలని ఆదేశించడం కూడా జరుగుతుంటుంది. కానీ వైసీపీలో ప్రస్తుతం అందుకు భిన్నమైన రాజకీయం నడుస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో సిటింగ్ ఎమ్మెల్యేలను కాదని కొత్తగా పార్టీ ఇన్‌చార్జిలుగా జగన్ నియమించిన వారికే మొత్తం పెత్తనం అప్పగిస్తున్నారు. వారికి యావత్ అధికార యంత్రాంగం దాసోహం కావాల్సిందేనని మౌఖికంగా సూచిస్తున్నారు. అలా పనిచేస్తామన్న వారినే ఆయా నియోజకవర్గాల్లో కొనసాగిస్తున్నారు. పోస్టింగ్‌లలోనూ ఇదే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అందుకు తలొగ్గని వారిని కొత్తగా వచ్చిన ఇన్‌చార్జి సిఫార్సులకు అనుగుణంగా ఎడాపెడా మార్చేస్తున్నారు. ఇక ఎమ్మెల్యేలకు కూడా తెలియకుండా ఈ ఇన్‌చార్జిలే అధికారులతో సమావేశాలు నిర్వహించడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని అన్నీ తామై వ్యవహరించడం జరుగుతోంది. తాము చేస్తుంది తప్పు, చట్ట వ్యతిరేకం అని తెలిసినా అధికారులు వారికి దాసోహం అంటున్నారు.

మూడు స్థానాల్లో శ్రుతిమించిన వైనం

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిల పెత్తనం శ్రుతిమించింది. ఉమ్మడి జిల్లాలో రమారమి సగం నియోజకవర్గాల్లో కొత్త ఇన్‌చార్జిల అజమాయిషీ ప్రారంభమైనప్పటికీ మూడుచోట్ల ఎమ్మెల్యేలను పూర్తిగా పక్కనపెట్టారు. సంతనూతలపాడు, దర్శి, కనిగిరి నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ మూడు నియోజకవర్గాల్లో సంతనూతలపాడుకు బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన మంత్రి నాగార్జునను, కనిగిరికి హెచ్‌ఎంపాడు జడ్పీటీసీ సభ్యుడు అయిన నారాయణయాదవ్‌ను, దర్శిలో మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డిని వైసీపీ ఇన్‌చార్జిలుగా నియమించారు. ఈ మూడు చోట్లా అధికార యంత్రాంగాన్ని స్థానిక ఎమ్మెల్యే వద్దకు కూడా వెళ్లకుండా అదిరించి, బెదిరించి ఇన్‌చార్జిలు పాలన చేస్తున్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు నియోజకవర్గంలోని మల్లవరంలో నిర్మించుకున్న ఇంటికి పరిమితమయ్యారు. కనిగిరిలో కొత్త ఇన్‌చార్జిని నియమించిన తర్వాత ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ నియోజకవర్గానికే రాలేదు. దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఒకరోజు నియోజకవర్గానికి వచ్చి తాను ఇంకా శాసనసభ్యుడినే అన్న విషయం గుర్తుంచుకోండి అంటూ అధికారులను హెచ్చరించి వెళ్లారు.

ఇన్‌చార్జిల చుట్టూ తిరుగుతున్న అధికారులు

కనిగిరి, దర్శి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో అధికారులు మొత్తం ఇన్‌చార్జిల చుట్టూ తిరుగుతున్నారు. దర్శిలో శివప్రసాద్‌రెడ్డి అధికారులతో సమీక్షా సమావేశాలు కూడా నిర్వహించారు. ఆసందర్భంగా వేదిక మీద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కనీసం ఎమ్మెల్యే ఫొటో కూడా లేదు. అధికారుల బదిలీలు, వివిధ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు విషయంలోనూ ఆయన మాటే వేదవాక్కు అయింది. కనిగిరిలో నారాయణయాదవ్ గత రెండు రోజులుగా అన్ని మండలాల్లో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని బహిరంగంగా పెత్తనం చెలాయిస్తున్నారు. సంతనూతలపాడు, కొండపిల్లో ఇన్‌చార్జిలుగా వచ్చిన నాగార్జున, సురేష్‌లు మంత్రులుగా ఉన్నందున పాలనలో జోక్యం చేసుకునేందుకు కొంత అధికారం ఉంది. కానీ దర్శి కనిగిరి ఇన్‌చార్జిలు అధికారులపై పెత్తనం చేస్తున్న వారు ఏమాత్రం అర్హతలేని వారే. అద్దంకికి పక్కజిల్లా నుంచి వచ్చిన ఇన్‌చార్జి హనిమిరెడ్డి హడావుడికి అధికారులే కాక సాధారణ ఉద్యోగులు హడలెత్తిపోతున్నారు.



దర్శిలో బూచేపల్లి ఏర్పాటు చేసిన సమావేశం ఫ్లెక్సీలో కనిపించని ఎమ్మెల్యే మద్దిశెట్టి ఫొటో

మంత్రి ఫోన్ చేసి చెప్పినా..

మంత్రి సురేష్ కొండపిలో బిజీ కావడంతో ఎర్రగొండపాలెంలో వైసీపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ యావత్తు యంత్రాంగంపై అజమాయిషీ చేస్తున్నారు. సాక్షాత్తూ మంత్రి ఫోన్‌చేసి చెప్పినా ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లి ఆయన అంగీకారం తర్వాతే అధికారులు పనులు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఎవరైనా నేరుగా చేస్తే ఇన్‌చార్జిలు చెప్పినట్లే నడుచుకోండి అంటూ ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు వస్తున్నట్లు తెలిసింది. దీంతో ఇప్పటికే మంత్రి సురేష్‌ను అనుసరిస్తున్న ముఖ్య నాయకులకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. మార్కాపురం బాధ్యతలు చేపట్టిన గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు పెత్తనం ఆదివారం నుంచి మార్కాపురంలో ప్రారంభమైంది. ఆయన కుమారుడు చైతన్య కూడా ఈసారి ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం కనిపించింది. గిద్దలూరు ఇన్‌చార్జిగా నియమితులైన మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి కార్యకర్తల పరిచయ కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేసుకోగా ఆయన సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి ఇప్పటికే నియోజకవర్గంలో కాలు మోపి పెత్తనం ప్రారంభించారు.

టీడీపీలోకి వలసల జోరు

వైసీపీని వీడి సైకిలెక్కుతున్న విభిన్నవర్గాలు

జిల్లావ్యాప్తంగా భారీగా చేరికలు

సాదరంగా ఆహ్వానిస్తున్న నేతలు

ఒంగోలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీలోకి వలసల జోరు పెరిగింది. విభిన్న వర్గాల వారు భారీగా చేరుతున్నారు. జిల్లావ్యాప్తంగా పక్షం రోజుల నుంచి వివిధ నియోజకవర్గాల్లోని పలు గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల నుంచి పెద్ద సంఖ్యలో కుటుంబాలకు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నాయి. వారిని ఎక్కడికక్కడ టీడీపీ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇలా తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకుంటున్న వారిలో అధిక శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారే ఉంటున్నారు. పేదలకు సంక్షేమ పథకాలు బటన్ నొక్కి అందిస్తున్నామని సీఎం జగన్ నుంచి కింది స్థాయి వరకు వైసీపీ నేతలు చెప్తూ ఆయా వర్గాలు తమ వెంటే ఉంటాయని పదేపదే గొప్పలుపోతున్నారు. అయితే ప్రస్తుతం జిల్లాలో వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరుతున్న వారిలో అత్యధికులు పేద వర్గాల వారే ఉంటున్నారు. సంక్రాంతి తర్వాత ఇలా చేరికలు పెరుగుతుండగా ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం పంచాయతీ దేవళంపల్లెపాలెం, కొత్తపాలెంకు చెందిన పలు కుటుంబాలు కొండపి ఎమ్మెల్యే స్వామి నివాసానికి వచ్చి పార్టీలో చేరారు. అదే మండలంలోని సోమరాజుపల్లిలో శుక్రవారం స్వామి.. బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించిన సందర్భంగా వైసీపీకి చెందిన 40 కుటుంబాల వారు సైకిలెక్కారు. ఒంగోలులోని నాల్గో డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు షేక్ ఆరిఫ్ నేతృత్వంలో 30 కుటుంబాలకు చెందిన ముస్లియువకులతోపాటు ఇతరులు పార్టీలో చేరారు. కనిగిరి నియోజకవర్గంలో నిత్యం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జరుగుతుండగా ఆదివారం కూడా ఆ జోరు కొనసాగింది. సీఎస్‌పురం మండలం చింతపూడిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నేతృత్వంలో దాదాపు 50 కుటుంబాల వారు చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ, సభ నిర్వహించారు. అలాగే పామూరు మండలం రేగిమడుగులోనూ పలు కుటుంబాలు డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నేతృత్వంలో గిద్దలూరు మండలం గుమ్మలపల్లి, కంభం మండలం చిన్ననల్లకాలువ గ్రామాలకు చెందిన పలు కుటుంబాల వారు సైకిలెక్కారు.



ఒంగోలులో దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లిం యువకులు



ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన చింతపూడి వాసులు

పేద విద్యార్థులకు 25శాతం ఉచిత సీట్లు

● ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో అవకాశం

● ప్రభుత్వం ఉత్తర్వులు

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 11 : బాలల నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం అననుకూల, బలహీనవర్గాల విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర సిలబస్‌తో నిర్వహిస్తున్న అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వతరగతిలో ప్రవేశానికి 25శాతం సీట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈమేరకు ఉత్తర్వులు ఇచ్చింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. సోమవారం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఆ ప్రకారం 13వతేదీన అన్ని ప్రైవేటు పాఠశాలలు తమ వివరాలను పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. ఈనెల 23నుంచి మార్చి 14 వరకు అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు పోర్టల్ అందుబాటులో ఉంటుంది. ఏప్రిల్ 1న అడ్మిషన్లకు మొదటి విడత లాటరీ నిర్వహిస్తారు. 25వ తేదీన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి. మిగిలిపోయిన సీట్లకు 15న లాటరీ తీసి జాబితాను ప్రకటిస్తారు. 16న విద్యార్థులు పాఠశాలల్లో ప్రవేశం పొందిన విషయాన్ని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అడ్మిషన్లకు సంబంధించిన వివరాల కోసం హెల్ప్‌డెస్క్ 14417 నంబర్‌ను సంప్రదించవచ్చు.

14న మంత్రుల ఇళ్ల ముట్టడికి యూత్ కాంగ్రెస్ పిలుపు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 11: ఈనెల 14 న జిల్లాలో ఉన్న మంత్రుల ఇళ్లు ముట్టడి చేస్తామని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బీఆర్.గౌస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మెగా డీఎస్సీని ప్రకటిస్తామని నిరుద్యోగులకు కల్లబొల్లి మాటలు చెప్పిన ప్రభుత్వం మినీ డీఎస్సీని ప్రకటించడం యువతను మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో 60 వేల ఉద్యోగాలతో మెగా డియస్సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

నేటి పోలీసు స్పందన రద్దు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 11: ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగే పోలీసు స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ప్రజలు ఎవరూ జిల్లా పోలీసు కార్యాలయానికి సుదూరప్రాంతాల నుంచి వ్యయప్రయాసలుకోర్చి రావద్దని సూచించారు.

కమనీయం లక్ష్మీనరసింహుని కల్యాణం

మద్రిపూడి, ఫిబ్రవరి 11 : పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఉభయదాతలైన బరూరి లక్ష్మీనరసింహశాస్త్రి, ప్రమీల దంపతులు గజవాహనాన్ని, మాదుగుల సునీల్‌కుమార్ దంపతులు స్వామి ఉత్సవమూర్తులను ఆదివారం దేవాలయ కార్యనిర్వహణాధికారి ఎం శ్రీనివాసరావుకు కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయంలో ఉత్సవమూర్తులకు ఆలయ ప్రధానార్చకులు నారాయణం మారుతీఆచారులు, వెంకటరమణ ఆచార్యులు, తిరుమలాచార్యులు ఆధ్వర్యంలో సంప్రోక్షణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, హోమాలు జరిపించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామికి అంగరంగవైభవంగా కల్యాణం నిర్వహించారు. ఒంగోలు కెనరాబ్యాంక్ రీజినల్ మేనేజర్ బరూరి శశిధర్ ధర్మపత్ని జ్యోత్స్నా, సునీల్‌కుమార్ దంపతులు పీఠలపై కూర్చొని కల్యాణ తంతు నిర్వహించారు.

అంతా అవినీతి, అరాచకం

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

ఓటు అనే ఆయుధంతో ఆ పార్టీని సాగనంపాలి

టీడీపీ నేతల పిలుపు

పెద్దకొత్తపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ

మద్దిపాడు, ఫిబ్రవరి 11: వైసీపీ పాలనలో అవినీతి, అరాచకం తప్ప అభివృద్ధి శూన్యమని టీడీపీ నేతలు, ఎమ్మెల్యేలు విమర్శించారు. ప్రజలు ఓటు అనే ఆయుధంగా ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దకొత్తపల్లిలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. జగన్ పాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు గ్రావెల్, ఇసుక, మట్టి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు కొత్తగేటు నిర్మించలేకపోయారని ఎద్దేవా చేశారు. నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రాజెక్టును పట్టించుకోకుండా సంబరాలు, డ్యాన్సుల్లో మునిగి తేలుతున్నారని విమర్శించారు. కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ టీడీపీ అన్ని సామాజికవర్గాలకు సమన్యాయం చేసిందన్నారు. వైసీపీ పాలనలో దళితులు, బీసీలను అన్ని విధాలా దగా చేసిందన్నారు. ఎస్సీలపై అనేక దాడులు జరిగాయన్నారు. దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా వైసీపీ నేతలు ముందుకు సాగుతున్నారని మండిపడ్డారు. టీడీపీ జెండా కనిపించకుండా చేస్తామని జగన్ అనేక సార్లు చెప్పారని, ఇప్పుడు వైసీపీ నాయకులే ఆపార్టీ జెండాను పీకేసే రోజులు వచ్చాయన్నారు.

ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ జగన్ పాలనలో అన్ని వ్యవస్థలు సర్వనాశనమయ్యాయన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి రైతులకు నీరు అందించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉన్నదని దుయ్యబట్టారు. వైసీపీ నాయకులు భూరాబందులుగా మారి వందల ఏళ్ల నాటి రైతుల భూములకు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర మాట్లాడుతూ సొంత చెల్లెలు అయిన షర్మిలకే అన్యాయం చేసిన జగన్.. రాష్ట్ర ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని అన్నారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణను అట్టహాసంగా నిర్వహించారు. టీడీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎన్ విజయకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ రంగారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, నల్లూరి సంజీవరావు, నల్లూరి చంద్రయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మద్దిపాడులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి, మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల, విజయ్‌కుమార్ తదితరులు

సమష్టి పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

● ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 11 : సమష్టి పోరాటాల ద్వారానే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఒంగోలులోని మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం సంఘ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం ఎస్‌డీసర్దార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూజిల్లాలో కార్మికుల సమస్యలపై పోరాటం చేసి విజయాలు సాధించిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటీయూసీ స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్రపోషించిందని తెలిపారు. దేశంలో కార్మిక చట్టాల సాధనలో, హక్కుల సాధన లో కీలక పాత్ర పోషించి అనేక జీవోలను సాధించిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పీవీఆర్ .చౌదరి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు కందుకూరి సుభాన్‌నాయుడు, సుబ్బారావు, రమణయ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి దిగుబడి.. అరకొర

- అధికంగా తాలుకాయలు
- పెరిగిన పెట్టుబడులు
- నిలకడలేని ధరలు
- ఆందోళన చెందుతున్న రైతులు


నూతలపాడు వద్ద కల్లాలో మిర్చి కాయలను గ్రేడ్ చేస్తున్న కూలీలు


గుట్టలుగా పోసిన తాలుకాయలు

పర్చూరు, ఫిబ్రవరి 11: మిర్చి రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఒకవైపు దిగుబడులు లేక, మరోవైపు నిలకడలేని ధరలతో వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. గతంలో మిర్చి రైతులు లాభాలు గడించి ఉండటంతో ఈఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటంతో తెగుళ్ళ బెడద ఎక్కువైంది. దీనికి తోడు మూలిగే నక్కపై తాటికాయ పడిందన్నట్లు సాగునీరు కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి. ఇది చాలదన్నట్లు తాలు కాయకూడా అధికంగా వస్తుండటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గత ఏడాది ఎకరానికి 20 క్వింటాళ్ళకు పైగా ఉన్న దిగుబడులురాగా, ఈఏడాది సుమారు 9 క్వింటాలు వస్తున్నాయి.

పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, యద్దనపూడి మండలాల్లో దాదాపు 30వేల ఎకరాలకు పైగా మిర్చి సాగుచేశారు. వ్యవసాయ ప్రారంభం నుంచే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటం, తుఫాను ప్రభావంతో పంటలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. వ్యయ ప్రయాసలకు ఓర్చి తిరిగి మిర్చిని సాగుచేసుకున్నా సకాలంలో ఆరుతడులకు నీరు అందకపోవటంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది మిర్చి సాగుకు అధిక పెట్టుబడులు వెచ్చించాల్సి వచ్చింది. సాగు ప్రారంభం నుంచే తెగుళ్ళు వెంటాడటంతో పంటలను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. కౌలు, నారు, వ్యవసాయ ఖర్చులు, ఆరుతడులు కలుపుకొని ఎకరానికి రూ.1.50లక్షలకు పైగా ఖర్చుచేయాల్సి వచ్చింది. ప్రస్తుతం వస్తున్న దిగుబడులు పెట్టుబడులకు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట చేతికి అందివస్తున్న తరుణంలో కురిసిన అకాల వర్షంతోపాటు, సకాలంలో ఆరు తడులకు నీరు అందించపోవటంతో కాయలు తాలుగా మారాయి. పంట మొత్తంలో సగానికి సగం తాలుకాయలే వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. దీనికితోడు తాలుకాయలను వేరు చేయటానికి అదనపు ఖర్చవుతుందని, దీంతో ఏమిచేయాలో పాలుపోవటం లేదని వాపోతున్నారు.

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు!

- వి.శ్రీనివాసరావు, రైతు, నూతలపాడు



ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేశా. ఎకరానికి రూ.1.5 లక్షలకు పైగా ఖర్చయింది. వచ్చిన పంటలో అధిక భాగం కాయలు తాలుగా మారాయి. దీంతో నష్టపోవల్సి వస్తుంది.


ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

అద్దంకి, ఫిబ్రవరి 11: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి అగ్నిప్రవేశం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అభిషేకాలు, వాసవి మూలమంత్ర హోమం, అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మ ఆశ్రమానికి సాయం

మార్టూరు, ఫిబ్రవరి 11: మార్టూరులో అమ్మ ఆశ్రమం నూతన భవన నిర్మాణానికి శింగరకొండలోని నాయీబ్రాహ్మణ సంఘం అన్నసత్రం అధ్యక్షుడు జాగర్లమూడి వెంకటేశ్వర్లు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆదివారం ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు విరాళం అందజేశారు.


అద్దంకిలో ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఘంటసాల గానభారతి సభ్యులు

ప్రజల హృదయాల్లో ఘంటసాలకు సుస్థిరస్థానం

అద్దంకి, ఫిబ్రవరి 11: ఘంటసాల మరణించి 50 సంవత్సరాలు అయినా ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరచుకుని చిరస్మరణీయుడుగా నిలిచారని ఘంటసాల గానభారతి అధ్యక్షుడు మోటుపల్లి రామదాసు అన్నారు. ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఘంటసాల గానభారతి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సినీ విశ్లేషకులు అన్నమనేని వెంకటరావు మాట్లాడుతూ ఘంటసాలకు భారతరత్న ఇవ్వాలన్నారు. గాయకుడు శేషగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన పాట కచేరి అలరించింది. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్‌జేడీ దేవపాలన, మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, శ్రావణ్‌కుమార్, బాలు, పీసీహెచ్ కోటయ్య, మస్తాన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న లక్కిపోగు సుమన్

పర్చూరు, ఫిబ్రవరి 11: దళితుల అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని దళిత యువనేత లక్కిపోగు సుమన్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన పర్చూరు నియోజకవర్గస్థాయి ఎస్సీ సెల్ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దళితులను పూర్తిగా విస్మరించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దళితుల పరిస్థితి, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో దళితుల పరిస్థితి ఎలా ఉందో ప్రతి ఒక్కరికీ అర్థమైందన్నారు. ఎస్సీలు ఐక్యంగా ఉండి రానున్న ఎన్నికల్లో తిరిగి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేవిధంగా ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.వీరాస్వామి, జి.కనకరాజు, కె.రాజు, శేషగిరి, శ్యామ్, నాగరాజు, అశోక్, లక్ష్మణ్, రాజేష్, ఇశ్రాయిల్, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో మృతులకూ ఓటు హక్కు

ఇంకొల్లు, ఫిబ్రవరి 11: ఇంకొల్లులోని డీఎన్‌టీ బండకాలనీలో కొంతమంది చనిపోయి ఏళ్లు గడిచినా వారి ఓట్లు మాత్రం తొలగించలేదు. 6వ వార్డు బండకాలనీలో మొత్తం 639 ఓట్లు ఉన్నాయి. అందులో 12 మంది చనిపోయి ఏళ్లు గడిచింది. 8ఏళ్లకు పైగా మృతి చెందిన వారి ఓట్లు ప్రస్తుతం వచ్చిన ఓటరు లిస్టులో ఉన్నాయి. నూతలపాటి సుబ్బారావు 8 ఏళ్ల కిందట మృతి చెందాడు. సాతులూరి సత్యవతి చనిపోయి నాలుగేళ్లయింది. దేవరకొండ వెంకటేశ్వర్లు రెండేళ్లక్రితం మృతి చెందారు. వీరి పేర్లు ప్రస్తుతం వీరి పేర్లు ఓటరు లిస్టులో ఉన్నాయి. సుమారు పది మందికిపైగా ఈ కాలనీలో మృతి చెందగా వీరికి ఓటు హక్కు ఉన్నట్లు జాబితాలో పేర్లు రావడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఇక్కడ నుంచి వలసపోయిన వారి పేర్లు మాత్రం ఫాం 7తో తొలగించాచు. ఇంకొల్లులో 20 వార్డులు ఉండగా, ఒక్క 6వ వార్డులోనే ఇన్ని అవకతవకలు ఉన్నాయంటే మండలంలో మరెన్ని ఉన్నాయోనన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

నిర్మాణానికి నోచుకోని ఊరవాగుపై వంతెన


అరికట్లవారిపాలెంలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఊరవాగుపై వంతెన

పంగులూరు, ఫిబ్రవరి 11: వరద ఉధృతికి ఊరవాగుపై వంతెన కూలి ఏళ్ళు గడుస్తున్నా నిర్మాణానికి నోచుకోలేదు. కూలిన వంతెన పై రాకపోకలు సాగించలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరికట్లవారిపాలెం గ్రామం నుంచి చందలూరు వైపు వెళ్ళే రహదారిలో ఐదేళ్ళ క్రితం తుఫాన్ కారణంగా వరద ఉధృతికి వంతెన కూలిపోయింది. వాగుకు అవతలి వైపుఉన్న పొలాల్లో వ్యవసాయ పనుల కోసం రైతాంగం పంగులూరు, చందలూరు వైపుగా తిరిగి వెళ్ళాల్సి వస్తుంది. గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న పొలాలకు ఎరువులు చేరవేయడం, పురుగు మందుల పిచికారీతో పాటు యితర పనులకు కూలీలను పొలాలకు తరలించడం కష్టంగా ఉందని రైతులు వాపోతున్నారు. పంటసాగుతో పాటు పండిన పంటను ఇంటికి చేర్చేందుకు వ్యయప్రయాసలతో ఇబ్బందులు పడుతున్నట్టు పేర్కొన్నారు. ఊరవాగుపై వంతెన పునర్నిర్మించి తమ కష్టాలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

చీరాలటౌన్, ఫిబ్రవరి 11: అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని శనివారం వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల పరిధిలోని కొత్తపాలెంకు చెందిన మురళీ సుమారు వందకు పైగా మద్యం సీసాలను స్కూటీపై పెట్టుకుని దండుబాట రోడ్డులో వెళుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

జగన్‌ను గద్దెదించే సమయం ఆసన్నమైంది

- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్
- సంఘీభావం తెలిపిన 20వ వార్డు యువకులు


ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలుపుతున్న అద్దంకి పట్టణంలోని 20వ వార్డు యువకులు

అద్దంకి, ఫిబ్రవరి 11: సీఎం జగన్మోహన్‌రెడ్డిని గద్దె దించే సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని 20వ వార్డుకు చెందిన పలువురు యువకులు ఆదివారం జొన్నతాళి క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రతిపక్షాలు, మేధావులు, విద్యార్థులు కలిసికట్టుగా పార్టీలకతీతంగా పనిచేసి సీఎంను గద్దె దించాలన్నారు. అన్నివర్గాల ప్రజలు పార్టీలకతీతంగా చంద్రబాబుకు, టీడీపీకి మద్దతు ఇవ్వటం చూస్తుంటే వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజలలో ఎంత వ్యతిరేఖత ఉందో అర్థమవుతుందన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ పని అయిపోయిందని, 2024 ఎన్నికలలో టీడీపీ గెలవటం ఖాయమన్నారు. బండారు వెంకటరావు, కుంచాల గోపి, గుంజి శ్రీవిష్ణు, వాసు, కుంచాల రామాంజనేయులు, బండారు బ్రహ్మయ్య, మోత్కుపల్లి చిన్నపురెడ్డి, వేముల రాముడు, మేస్త్రి వేణు, గుంజి బుల్లయ్య, బండారు నారాయణ, గుంజి వాసు, పాలపర్తి అశోక్, గజ్జర్లపూడి పినేలు, గద్దల దయానందం, వల్లపు రామాంజి, రాఘవులు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 11: నియోజకవర్గంలో పలువురుని ఎమ్మెల్యే రవికుమార్ ఆదివారం పరామర్శించారు. అద్దంకి మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ మొండితోక సీతమ్మ శస్త్ర చికిత్స చేయించుకోగా పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పసుమర్తి జీవన్‌ను పరామర్శించారు. బల్లికురవలోని 5వ వార్డు మెంబర్ కందుకూరి చిన్న తల్లి రాజమ్మ శనివారం మృతిచెందగా కుటుంబసభ్యులను ఎమ్మెల్యే రవికుమార్ పరామర్శించారు.

పంగులూరు మండలం నూజెళ్ళపల్లిలో గంగా నాగమ్మ దశదిన కర్మకు రవికుమార్ హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విప్పర్ల నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా కుటుంబసభ్యులను పరామర్శించారు.

ట్రావెల్స్ బస్సులో చోరీ

- ఇద్దరిని గుర్తించి పోలీసులకు అప్పగింత
- యువకుల నుంచి గంజాయి స్వాధీనం



అద్దంకి పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ట్రావెల్ బస్సు, ప్రయాణికులు

అద్దంకి, ఫిబ్రవరి11: ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో బంగారం, నగదు అపహరించిన ఇద్దరు దొంగలను ప్రయాణికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. పోలీసులు, ప్రయాణికుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన వై.సనా ప్రొద్దుటూరులో పుట్టింటి వెళ్లారు. తిరిగి కడప నుంచి విజయవాడకు ట్రావెల్స్ బస్సులో వస్తున్నారు. ఇదే బస్సులో ఇద్దరు యువకులు ప్రొద్దుటూరులో ఎక్కారు. పైన బెర్త్‌లో సనాతో పాటు కుమార్తె చిన్న పాప ఉంది. ఇద్దరు యువకులు కింద సీట్లలో కూర్చున్నారు. మార్గమధ్యలో చినారికట్ల వద్ద అర్థరాత్రి దాటిన తరువాత బస్సు కొద్దిసేపు ఆగింది.

అనంతరం బయలుదేరి దర్శి-అద్దంకి మధ్యకు వచ్చేసరికి సనా తన హ్యాండ్ బ్యాగ్ పరిశీలించగా అందులో ఉండాల్సిన డైమండ్ నక్లెస్, రూ.6 వేల నగదు కనిపించలేదు. దీంతో తోటి ప్రయాణికులతో కలిసి బస్సులో పరిశీలించగా చోరీకి గురైన బంగారం, నగదు గుర్తించారు. దీంతో బస్సును పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకువచ్చి ఇద్దరు యువకులను పోలీసులకు అప్పగించారు. వీరిని పోలీసులు విచారించగా గతంలో పలు చోరీలలో నిందితులుగా ఒప్పుకున్నట్లు తెలుస్తుంది. ఈ యువకుల వద్ద కొద్దిమేర గంజాయి కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తుంది. సనా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

- మార్టూరు చెరువు కట్టపై మూడు బోర్లు ఏర్పాటు


మంచినీటి చెరువు కట్టపై వేస్తున్న బోరు

మార్టూరు, ఫిబ్రవరి 11: మార్టూరు ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మంచినీటి చెరువులో నీరు లేనపుడు సమస్య రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం మంచినీటి చెరువు కట్టపై మూడు బోర్లను ఏర్పాటు చేశారు. గతంలో రెండు బోర్లను ఏర్పాటు చేశారు. ఈబోర్లకు 5 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటుచేస్తారు. అనంతరం బోరు నుంచి మోటారు ద్వారా సంపు వరకు ప్రత్యేకంగా పైపులైను వేస్తారు. తదనంతరం సంపు నుంచి ఓవర్ హెడ్ ట్యాంకు కు నీటిని ఎక్కించి పైపులైను ద్వారా తాగునీటిని సరఫరా చేస్తారు. ఇందుకోసం గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలు కేటాయించారు. మరో పది రోజులలో ఈప్రక్రియను పూర్తి చేయడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

ఇరవై రోజుల క్రితం సాగర్ కాలువ నుంచి గ్రామాలలో తాగునీటి చెరువులను నింపేందుకు నీటిని విడుదల చేశారు. మేజరు పంచాయతీ మార్టూరు చెరువుకు కనీసం నాలుగైదు రోజులు కూడా సాగర్ జలాలు రాలేదు. వాస్తవంగా చెరువులో నీరు తక్కువగా ఉంది. దాంతో సాగర్ కాలువ నుంచి వచ్చే నీటితో చెరువును నింపాలని అధికారులు భావించారు. పాతికవేలకు పైగా జనాభా కలిగిన మేజరు పంచాయతీ మార్టూరు చెరువుకు కనీసం 20 రోజులు సాగర్ జలాలు వస్తేగాని చెరువులో 70 శాతం నీరు చేరదు. సమృద్ధిగా కాలువ నుంచి నీరు రాకపోవడంతో వేసవిలో గ్రామంలో ప్రజానీకం తాగునీటికి ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయి. గతంలో కూడా చెరువులో నీరు లేనప్పుడు ఎన్నో ఇబ్బందులుపడ్డారు. ఆసమయంలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. అందుకోసం సుమారు రూ.17 లక్షలు పంచాయతీ నిధులు ట్యాంకర్లు తోలిన వారికి చెల్లించిన దాఖలాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పంచాయతీ అధికారులు శాశ్వత చర్యలు చేపట్టారు. ఈనేపథ్యంలో చెరువుకట్టపై కొత్తగా మూడు బోర్లను ఏర్పాటుచేశారు. తద్వారా చెరువులో నీరు లేనప్పటికీ గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తవని పంచాయతీ అధికారులు భావిస్తున్నారు.

మంచినీటి చెరువు నుంచి గత కొన్ని రోజులుగా వస్తున్న తాగునీరు పచ్చని రంగుగా, దుర్వాసనతో ఉంటున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కలుషిత నీరు తాగునీరుగా వస్తున్నదని గ్రామస్థులు అంటున్నారు. సాగర్ కాలువ నుండి చెరువుకు నీటిని నింపే సమయంలో చెత్తా చెదారం, పాచి, నాచు చెరువులోకి చేరడం ద్వారా కలుషిత నీరు సరఫరా చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. 15ఏళ్ల క్రితం మార్టూరు చెరువు నుంచి నీటిని బయటకు పంపించి చెరువును ఎండ బెట్టారు. మరలా ఇంతవరకు అటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం చెరువు మురికి కూపంగా తయారయింది. మరోసారి చెరువును ఎండబెట్టి శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది. తద్వారా శుభ్రమైన తాగునీటిని ప్రజలకు అందించడానికి అవకాశం ఉంటుంది.

వైసీపీకి గుణపాఠం తప్పదు!


మాట్లాడుతున్న టీడీపీ నేత బండి నాగేశ్వరరావు

మార్టూరు, ఫిబ్రవరి 11: వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ సీనియర్ నాయకుడు బండి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక విజయ్ నగర్ కాలనీలోని 13, 14 పోలింగ్ బూత్‌ల ప్రజానీకంతో పార్టీ నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి పట్టణ అధ్యక్షుడు కామినేని జనార్దన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బండి నాగేశ్వరరావు మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మూడోసారి గెలవాలన్నారు. రాష్ట్రంలో చంద్రబాబును సీఎంగా చూడాలన్న ఆకాంక్షతో పట్టుదలతో ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. వైసీపీ అక్రమాలను రాష్ట్ర ప్రజానీకం భరించలేకపోతున్నారన్నారు. టీడీపీ పట్ల ఆదరణ పెంచుకున్నారన్నారు.

షేక్ రజాక్ మాట్లాడుతూ సైకిలు స్పీడు పెంచడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల వారికి సమన్యాయం జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని చెప్పారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో తొండెపు ఆదినారాయణ, తాటి నాగేశ్వరరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు, జంపని శ్రీను, రావినేని శ్రీను పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న వైసీపీ నియోజకర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల, ఫిబ్రవరి 11: నియోజకవర్గ సమస్యలపై బాధ్యతలను పంచుకుందాం.. భవిష్యత్‌ను తీర్చిదిద్దుకుందామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు చెప్పారు. వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ కనకనాగారపమ్మ దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో కరణం వెంకటేష్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ పార్టీలకతీతంగా భక్తులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలాలయ నిర్మాణానికి భూమిపూజ

ఇంకొల్లు, ఫిబ్రవరి 11: మండలంలోని దుద్దుకూరులో బాలాలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం దేవదాయశాఖ నుంచి రూ. 60 లక్షలు సీజీఎఫ్ నిధులు మంజూరుచేసింది గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇతర ప్రాంతాలలో స్థిరపడిన వ్యాపారవేత్తలు, గ్రామస్థుల సహకారంతో రూ.30 లక్షలు మ్యాచింగ్ గ్రాంట్ గ్రామం తరుపున చెల్లించారు. మొత్తం రూ. 90 లక్షల వ్యయ అంచనాతో శ్రీచెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయశాఖ కమిషనర్ ద్వారా అనుమతి లభించింది. ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామస్థులు బాలాలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ఆలయ అర్చక స్వాములు సత్తిబాబు, శ్రీనివాసాచార్యులు పూజలు నిర్వహించారు. ఈనెల 29న శాస్త్రోక్తంగా పూజలు, హోమం కార్యక్రమాలు నిర్వహించి ఆలయంలోని కొలువుదీరిఉన్న దేవతామూర్తులను బాలాలయంలో స్థాపన చేయనున్నట్టు ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

మార్టూరు, ఫిబ్రవరి 11: కారు ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మార్టూరు నుంచి డేగర్లమూడి గ్రామానికి వెళ్లే సర్వీసు రోడ్డులో చోటుచేసుకుంది. మార్టూరుకు చెందిన పాలపర్తి శ్రీనివాసరావు యద్దనపూడి జడ్పీ హైస్కూల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పనినిమిత్తం ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఇంటూరి ఫంక్షను హాలు సమీపంలో వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన శ్రీనివాసరావు చేతికి బలమైన గాయమైంది. అతనిని బంధువులు నరసరావుపేటలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

కంటి రక్షణపై శ్రద్ధ వహించాలి

పంగులూరు, ఫిబ్రవరి 11: కంటి పరిరక్షణపై ప్రతిఒక్కరూ తగిన శ్రద్ధ చూపాలని నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ చింతన్, డాక్టర్ పద్మప్రియ సూచించారు. పంగులూరులో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 45 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరికి సోమవారం కాకాని శంకర్ కంటి వైద్యశాలలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్టు చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరణం హనుమంతరావు, షేక్ కాలేషావలి, కోశాధికారి గుర్రం ఆంజనేయులు, క్లబ్ ప్రతినిధులు ఆర్వీ సుబ్బారావు, పోతిన ప్రసాద్, జేకేసీ, బీవీ రామారావు, పోలిశెట్టి సీతారామయ్య, ఐసుబ్బారావు, క్యాంప్ ఇన్‌చార్జ్ గంగాధర్, శంకర్ వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండలో వైవీ దంపతుల పూజలు


శింగరకొండలో పూజలు నిర్వహిస్తున్న టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు

అద్దంకి, ఫిబ్రవరి 11: టీటీడీ పాలక మండలి మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు శింగరకొండలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసీపీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం వైవీ సుబ్బారెడ్డి, స్వర్ణలత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వైవీ దంపతులను ఈవో సుభద్ర, పూజారులు ఆశీర్వదించి సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యోన్నతి ఫౌండేషన్ ద్వారా ఉపకార వేతనం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 11: విద్యోన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ అర్హత పరీక్ష నిర్వహించారు. ప్రశ్నపత్రాన్ని ఫౌండేషన్ డైరెక్టర్ ధూళిపాళ్ల వీరనారాయణ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దంకి మండలంలో పది ఉన్నత పాఠశాలల నుంచి 113 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. జె.పంగులూరు, ఇంకొల్లు మండలాల్లో కూడా అర్హత పరీక్ష నిర్వహించినట్టు చెప్పారు. మూడు మండలలో 253 విద్యార్థులు పరీక్ష రాసినట్లు తెలిపారు. మండలానికి ఐదుగురు చొప్పున మూడు మండలాలలో 15 మందిని ఎంపిక చేస్తున్నట్టు చెప్పారు. వీరికి సంవత్సరానికి రూ. 10 వేలు చొప్పున రెండు సంవత్సరాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ తాళ్ళూరి బాబురావు, మన్నం త్రిమూర్తులు, ఆర్.శ్రీనివాసరావు, మలాది శ్రీనివాసరావు, కావూరి ధనలక్ష్మి, ఎస్.తరుణ్, రత్తయ్య, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బ్యాడ్మింటన్ పోటీలు

చీరాల, ఫిబ్రవరి 11: బ్యాడ్మింటన్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. స్థానిక ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో నిర్వహించిన ఇన్విటేషన్ బ్యాడ్మింటన్ డబుల్ విభాగం పోటీలు కారుణ్య సేవా సమితి ఆధ్వర్యంలో జరిగాయి. 30 టీంలు పోటీలలో పాల్గొన్నాయి. ఆయా టీంల మధ్య జరిగిన పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. పోటీలలో గెలుపొందిన విజేతలకు కారుణ్య సేవా సమితి సెక్రటరీ గోవర్ధన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ హుమాయున్ కబీర్, ఆజాద్, షాహిద్, సుధాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

హేతుబద్ధంగా ఆలోచించాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 11: మనుషులు హేతుబద్ధంగా ఆలోచిస్తే వారి సమస్యలను వారే పరిష్కరించుకోవచ్చునని భారత హేతువాద సంఘం కోశాధికారి షేక్ బాబు అన్నారు. రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ 33వ వార్షికోత్సవ సభ స్థానిక రావిపూడి వెంకటాద్రి మీటింగ్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హేతువాద ప్రముఖులు కరణం రవీంద్ర, సింహాద్రి యలమందారెడ్డి, షేక్ దరియావలి, మేడూరి సత్యనారాయణ, చుంచు శేషయ్య, కరి హరిబాబు, సంగీతరావు, హేతువాదులు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలని బైకు ర్యాలీ

ఇంకొల్లు, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపరచకుండా మోసం చేసిందని రైతుసంఘం నాయకులు ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈనెల 16న జరగనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఇంకొల్లులో ఆదివారం బైకు ర్యాలీ నిర్వహించారు. ఇంకొల్లు మండలంలో రైతుసంఘం, సీఐటీయూ నాయకులు రైతులను చైతన్య పరుస్తూ ప్రజలందరూ బంద్‌లో భాగస్వాములై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, కృష్ణమూర్తి, సీఐటీయూ నాయకులు నాగండ్ల వెంకట్రావు, మాదాల అంజయ్య, శంకర్, గోవిందు, గంగయ్య పాల్గొన్నారు.

సోమశిలలో 22.514 టీఎంసీల నీటి నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 11 : సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి 22.514 టీఎంసీలు నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2500, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు వారు వివరించారు.

అటు దూకుడు..
ఇటు అనిశ్చితి !

- స్పష్టతతో దూసుకుపోతున్న టీడీపీ అభ్యర్థులు
- వైసీపీలో ఎవరు ఉంటారో.. ఎవరు ఊడుతారో తెలియని అయోమయం
- వీపీఆర్ నిర్ణయంపై అభ్యర్థుల విజయావకాశాలు

నెల్లూరు, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కో(డ్)డి కూయకముందే జిల్లాలో రాజకీయ వేడి రాజుకుంది. ప్రధానప్రతిపక్షమైన టీడీపీ రెట్టింపు ఉత్సాహంతో దూకుడు పెంచుతోంది. కొత్తవారి చేరికలతో రోజురోజుకు బలం పుంజుకుంటోంది. వైసీపీలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. పార్టీలో ఏ నాయకుడు ఉంటాడో, ఏ నాయకుడు జారుకుంటారో తెలియక కేడర్‌లో గందరగోళం నెలకొంది. అభ్యర్థుల ప్రకటన పెను విస్ఫోటమై ఆ పార్టీ పునాదులను కదలించి వేస్తోంది. ఈ క్రమంలో ఆ పార్టీ నేతల్లో మునుపటి ఉత్సాహం, ధైర్యం కనిపించడం లేదు.

● ప్రచారంలో టీడీపీ జోరు

జిల్లాలో జరిగిన రా..! కదలిరా.. కార్యక్రమం తరువాత పరిస్థితులు వేగంగా మారిపోయాయి. అభ్యర్థుల విషయంలో స్పష్టత రావడం, వారికి అధినేత గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నియోజకవర్గ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉదయగిరి ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు ఇంటింటి ప్రచారాన్ని ఉధృతం చేశారు. దీనికి తోడు వైసీపీలో ఉన్న అసంతృప్తివాదులను తనవైపునకు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీపరంగా, వ్యక్తిగతంగా చేసిన సర్వేలు అనుకూలంగా రావడంతో ఆయన రెట్టింపు ఉత్సాహంతో ముందుకు కదులుతున్నారు. కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన కావ్య కృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టారు. నియోజకవర్గ నాయకులను కలిసి వారి మద్దతు కూడగట్టుకోవడంతో పాటు వార్డులు, గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోవూరు ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలు చెరోవైపు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. వివిధ కార్యక్రమాలు, ఆందోళనలతో ప్రజల్లోకి వెళుతున్నారు. వైసీపీలో ఉన్న అసంతృప్తవా దులను ఆకర్షిస్తున్నారు. నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పొంగూరి నారాయణ సతీసమేతంగా రాత్రింబవళ్లు నగరంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. గతంలో మంత్రి హోదాలో చేసిన అభివృద్ధి పనులు ఆయనకు వరంగా మారుతున్నాయి. రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతోంది. అదే సమయంలో వైసీపీలో చోటుచేసుకున్న పరిణామాలు నారాయణకు బాగా కలిసివస్తున్నాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా కుటుంబ సమేతంగా నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. రూరల్ నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు ప్రారంభమయ్యాయి. ఒకటి రెండు రోజుల్లో నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో చేరికలు ఉండబోతున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పోరాటాల ద్వారా ప్రజల్లో పట్టు పెంచుకొంటున్నారు. క్వార్ట్జ్, కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ అంశాలపై సోమిరెడ్డి జరిపిన పోరాటంతో నియోజకవర్గంలో ఆయన గ్రాఫ్ పెరిగింది. ఈ నియోజకవర్గంలో కూడా వైసీపీ నుంచి పెద్ద ఎత్తున టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి.





● వీపీఆర్ కలకలం


చేరికలతో టీడీపీ ఉత్సాహంగా కనిపిస్తుంటే, వైసీపీలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి.ముఖ్యంగా జిల్లా పార్టీ అధ్య క్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి పార్టీ నుంచి పక్కకు జరగడంతో ఆ పార్టీ తీవ్ర సంక్షోభంలో పడిపోయింది. నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేయనని ఆయన అధిష్ఠానానికి స్పష్టం చేయడంతోపాటు ఏకంగా పార్టీకే దూరం కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. తాను వద్దన్నా రెండేళ్లకు ముందే ఎంపీగా పోటీ చేయాలని ఒప్పించి, ఆ విషయాన్ని జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలందరికీ చెప్పి, ఎన్నికలు జరిగే సమయంలో ఉద్దేశపూ ర్వకంగా తన గెలుపు అవకాశాలను దెబ్బకొట్టాలని అధిష్ఠానం కుట్రపన్నడాన్ని ఆయన జీర్ణించుకోలేక పోతున్నారు. వీపీఆర్ పార్లమెంట్‌కు పోటీ చేయరన్న ప్రచారం జిల్లా వైసీపీని పెద్ద కుదుపే తీసుకొచ్చింది. ప్రధానంగా వైసీపీ అభ్యర్థుల్లో రెండు రకాల భయాలు పట్టుకున్నాయి. ఒకటి ఆర్థిక అండ దూరం కావడం, రెండోది అసమ్మతి బెడద. వీపీఆర్ వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీచేసినా, లేక పోటీ నుంచి తప్పుకున్నా, ఈ రెండు నిర్ణయాలేకాక తన రాజకీయ భవిష్యత్తును మరో రాజకీయ పార్టీతో ముడిపెట్టుకున్నా...!!? నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని వైసీపీ అభ్యర్థుల ఫలితాలపై ఆ ప్రభావం పడుతుంది. అంతేకాక పలువురు వైసీపీ నాయకులు పార్టీ నుంచి జారుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే చాప కింద నీరులా ఆ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. మొత్తం మీద అధికార పార్టీ హోదాతో ఉత్సాహంగా రంగంలోకి దిగాల్సిన వైసీపీ ప్రజల మద్దతు కూడగట్టుకోలేక, కొత్తవారిని చేర్చుకోలేక, పార్టీ నుంచి జారిపోతున్న పాతవారిని పట్టుకోలేక అల్లాడుతోంది.



అభ్యర్థుల ఆందోళన

- టెట్, డీఎస్సీ వెంటవెంటనే నిర్వహణపై అభ్యంతరం
- వచ్చేనెల 14న టెట్ ఫలితాలు, 15 నుంచి డీఎస్సీ
- ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని హడావిడి
- ప్రభుత్వం తీరుపై నిరుద్యోగుల మండిపాటు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (విద్య) / సంగం/ పొదలకూరు, ఫిబ్రవరి 11: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం తగినంత వ్యవధి ఇవ్వ కుండా టెట్, డీఎస్సీ నిర్వహించేందుకు సిద్ధం కావడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేర్వేరు సిలబస్‌లు అయినందున రెండు పరీక్షల మధ్య కొంత సమయం ఉండాలి. కానీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తోందన్న ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని వెంటవెంటనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నదని వారు మండిపడుతున్నారు. టెట్‌లో ఉత్తీర్ణులైనవారే డీఎస్సీ రాసేందుకు అర్హులు. అందువల్ల టెట్‌కు కూడా ప్రాధాన్యం ఉంది. అంతేకాక ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వరకు వెయిటేజ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఎస్సీ రాసే అభ్యర్థులకు టెట్ అత్యంత కీలకం. టెట్‌కు హాజరుకానున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ఈనెల 8 నుంచే ప్రారంభమైంది. ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకుంటే 27 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఫలితాలు వచ్చే నెల 14న విడుదల చేస్తారు. సాధార ణంగా టెట్ ఫలితాలు వెలువడాక డీఎస్సీ పరీక్షకు షెడ్యూల్ ఖరారు చేయాలి. రెండు పరీక్షల మధ్య నెల నుంచి 45 రోజుల వ్యవధి ఉండాలి. కానీ వచ్చే నెల 14న టెట్ ఫలితాలు వెలువడిన మరుసటి రోజు అంటే 15వ తేదీ నుంచి డీఎస్సీ రాత పరీ క్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27వ తేదీ టెట్, వచ్చే నెల 15 నుంచి డీఎస్సీ నిర్వహించబోతున్నారు. ఇంత తక్కువ వ్యవధిలో రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కాగలమని నిరుద్యోగులు ప్రశ్నిస్తు న్నారు. రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్‌లో మార్పులు చేయాలని సర్వత్రా కోరుతున్నారు.



● నామమాత్రంగా భర్తీ

తాజాగా ఎన్నికల ముందు మెగా డీఎస్సీ పేరుతో దగా డీఎస్సీని ప్రకటించి ప్రభుత్వం నామమాత్రంగా పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రకటించింది. రూ.లక్షలు వెచ్చించి డీఎడ్, బీఈడీ కోర్సులు పూర్తి చేసిన యువత తమ భవిష్యత్ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పరీక్షలకు వ్యవధి లేకపోవడంపై కొంతమంది అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. మరికొంతమంది డీఎస్సీలో పోస్టుల సంఖ్యను కూడా పెంచాలని కోరుతూ న్యాయస్థానానికి వెళ్లాలన్న యోచనలో ఉన్నట్లు సమాచారం.

● పోస్టులు తక్కువ.. పోటీ ఎక్కువ

రాష్ట్ర వ్యాప్తంగా 6100 పోస్టులకుగాను జిల్లాలో 346 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ)లు 104, స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ)లు 140, టీజీటీలు 102 పోస్టులు ఉన్నాయి. వేలాదిమంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఐదేళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు.

● నిరుద్యోగుల నిరాశ

గత ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ పూర్తి చేసిన మరో 10వేల మంది కలిపి 20వేల మంది వరకు నిరుద్యోగులు జిల్లాలో డీఎస్సీ కోసం ఎదురుచూ స్తున్నారు. వీరిలో అత్యధికశాతం గ్రామీణ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతే ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న ఆలోచనలతో రూ.లక్షలు వెచ్చించి కోర్సులు పూర్తి చేశారు. తాజాగా ప్రభుత్వం నామమాత్రంగా డీఎస్సీ ప్రకటన చేయడంతో వారు నిరాశ పడ్డారు.

● నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ఈనెల 12 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. 12 నుంచి 21వతేదీ వరకు ఫీజు చెల్లించి సీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 22లోగా దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనంతరం 24న ఆన్‌లైన్ మాక్ టెస్ట్ నిర్వహించి, మార్చి 5 నుంచి హాల్‌టికెట్‌లను పంపిణీ చేస్తామని వివరించారు. అలాగే ఫిబ్రవరి 8 నుంచి టెట్ నిర్వహణ చేపట్టి ఏప్రిల్ 7న ఫలితాలు వెల్లడి స్తామన్నారు. అలాగే టెట్‌కు ఫీజు చెల్లించేందుకు చివరితేదీ ఈనెల 17, దరఖాస్తుకు చివరితేదీ ఈనెల 18గా నిర్ణయించామన్నారు. ఫిబ్రవరి 23 నుంచి హాల్‌టికెట్‌లను అందచేస్తామన్నారు.

ఉపాధ్యాయ నియామకాలు మోసపూరితం : ఎస్టీయూ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గంటా మోహన్

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 11 : జీవో 117 ద్వారా వేలాది టీచరు పోస్టులకు మంగళం పాడిన ప్రభుత్వం తాజాగా అప్రెంటీస్ విధానంలో టీచర్ల నియామకం చేపట్టాలని ప్రయత్నించడం మోసపూరితమని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) నేతలు ధ్వజమెత్తారు. నెల్లూరులోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ వారంలో రద్దు చేస్తామన్న సీపీఎస్ రద్దు చేయకపోగా, జీపీఎస్ భూతాన్ని ప్రవేశపెట్టడం దారుణమన్నారు. డీఎస్సీ పోస్టులను సైతం నామమాత్రంగా విడుదల చేయడం దారుణమన్నారు. రాష్ట్ర కార్యదర్శి అశోక్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగుల జీతాల నుంచి పొదుపు చేసుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ మొత్తాలకు కూడా భద్రత లేదన్నారు. అనంతరం ఎస్టీయూ జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వై.అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా జీ.రాజమనోహర్, ఆర్థిక కార్యదర్శిగా కే నరసింహం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఏ. ఏడుకొండలు, పీ కృష్ణయ్య, కే.కృష్ణ, డీ మహేష్‌లతోపాటు కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ప్రయోగ పరీక్షల ప్రారంభానికి ముందు నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాల ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఐవో శ్రీనివాసులు

ఇంటర్ ప్రయోగ పరీక్షల ప్రారంభం

- తొలిరోజు 7,032 మంది హాజరు

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 11 : జిల్లావ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్) ఆదివారం నాన్‌జంబ్లింగ్ విధానంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు 107 కేంద్రాల్లో జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ విద్యార్థులు 7,032 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 3,041 మంది హాజరు కావాల్సి ఉండగా, 2,958 మంది హాజరయ్యారు. 83 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్నాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 4,203 మంది హాజరు కావాల్సి ఉండగా, 4,074 మంది హాజరయ్యారు. 129 మంది గైర్హాజరయ్యారు. ఉదయం, మధ్నాహ్నం కలిపి మొత్తం 7,244 మంది హాజరు కావాల్సి ఉండగా, 7,032 మంది హాజరయ్యారు. 212 మంది గైర్హాజరయ్యారు. ప్రాకిట్కల్స్ జరుగుతున్న పలు పరీక్ష కేంద్రాలను పరీక్షల నిర్వహణ కన్వీనర్, ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు, డీఈసీ సభ్యులు, తదితరులు పరిశీలించారు. విద్యార్థుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, వారి సమస్యలను 0861-2320312 నెంబరుకు తెలియచేయాలని ఆర్ఐవో తెలిపారు.



విద్యుత్ శాఖలోనూ
వేతనాల వెతలు

- పదిరోజులు గడిచినా అందని జీతాలు
- తీవ్ర ఆవేదనలో ఉద్యోగులు, సిబ్బంది

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 11: గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ శాఖలోనూ జీతాల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. కొంతకాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర అవేదన చెందుతున్నారు. సహజంగా కాంట్రాక్టర్లకు బిల్లులు ఆగడం జరుగుతూ ఉంటుంది. విద్యుత్‌శాఖ చరిత్రలో ఎప్పుడూ కూడా ఉద్యోగులు జీతాలకు ఇబ్బంది పడిన దాఖలు లేవు. అయితే గత ఏడాది కాలంగా విద్యుత్‌శాఖలోనూ పేదరికం పెరిగినట్లుంది. ఒకటో తేదీన ఇవ్వాల్సిన జీతాలు పది, పన్నెండు తేదీల వరకు కూడా ఇవ్వడం లేదు. జిల్లాలో జూనియర్ లైన్‌మెన్ల నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు రెండువేలకుపైగా ఉన్నారు. వీరందరికి ప్రతి నెలా రూ.20 కోట్లకుపైగా జీతాలను ఏపీఎస్‌పీడీసీఎల్ సంస్థ అందస్తున్నది. అయితే గత ఏడాది కాలంగా జీతాలను ఒకటవ తేదీకి ఇవ్వకపోతుండటంతో బ్యాంకు రుణాలతోపాటు ఇంటి అద్దెలు, ఖర్చులకు ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. బ్యాంక్‌ల్లో చెక్కులు బౌన్స్ అవుతుండటతో జరిమానాలు పడుతున్నాయని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ బిల్లులకు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాల కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తూ, వేతనాలను సకాలంలో చెల్లించకుండా తమని ఇబ్బంది పెడుతున్నారని ఉద్యోగులు, సిబ్బంది వాపోతున్నారు.

నేటి నుంచి స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సేవలు

నెల్లూరు(హరనాథపురం): నెల్లూరు నగరంలోని చిల్డ్రన్స్ పార్కు వద్ద ఒక ప్రైవేటు భవంతిలో ఉన్న స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం చిరునామా మారింది. రేబాలవారి వీధిలోని పూర్వపు ప్రభుత్వ చిన్నపిల్లల వైద్యశాల పక్కనున్న ప్రభుత్వ భవంతిలోకి దానిని మార్చామని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యాలయం సేవలు సోమవారం నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రక్తమోడుతున్న
రహదారులు

- జిల్లాలో వరుస రోడ్డు ప్రమాదాలు
- ప్రయాణమంటేనే వణుకుతున్న ప్రజలు
- మితిమీరిన వేగం, నిద్రమత్తులోనే ఘటనలు



కావలి ముసునూరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న జిల్లా పోలీసు అధికారులు (ఫైల్)

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) ఫిబ్రవరి 11: జిల్లాలోని రోడ్లు రక్తమోడుతున్నాయి. వరుస రోడ్డు ప్రమాదాలతో ప్రజలు ప్రయాణం చేయాలంటేనే వణుకుతున్నారు. జిల్లాలోని జాతీయ రహదారులు రక్తం రుచి మరగడంతో ఎంతో మంది మృత్యుఒడికి చేరుతున్నారు. మితిమీరిన వేగం, రాత్రి పూట నిద్రమత్తులో వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలకు ఎక్కువగా జరుగుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. తాజాగా జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. పోలీసు శాఖ, ఆర్టీసీతో పాటు పలు శాఖల అధికారులు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ క్రమంలో కావలి ముసునూరు వద్ద శనివారం జరిగిన ఘోర దుర్ఘటన అధికారులను కలవరపెడుతున్నది.

● నిద్రమత్తులోకి జారుకుంటూ...

లోడ్‌తో వెళ్లే లారీడ్రైవర్లు ప్రయాణం కలిసి వస్తుందన్న భావనతో రాత్రిళ్లు ఎక్కువసేపు వాహనాలను నడుపుతుంటారు. ఈ క్రమంలో రాత్రి 12 నుంచి ఉదయం 4 గంటలలోపు అధికంగా ప్రమాదాలు జరుగుతుంటాయి. జిల్లాలో అధిక రోడ్డు ప్రమాదాలుఈ సమయంలోనే జరిగినవే. అందులోనూ జిల్లాను మంచుదుప్పటి కప్పేయడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అంతేకాక జాతీయరహదారిపై వాహనాలను నిలుపుకుని విశ్రాంతి తీసుకునేలా రెస్ట్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో కావలి వద్ద గౌరవరం, వెంకటాచలం దాటిన తర్వాత కృష్ణాపట్నంకు వెళ్లే మార్గం వద్ద రెస్ట్‌రూములు ఉన్నాయి. అయితే భారీ వాహనాల డ్రైవర్లు డాబాలు, దుకాణాలు వద్ద, రోడ్డుకు పక్కగా వాహనాలు నిలిపి విశ్రాంతి తీసుకోవడం, బహిర్భూమికి వెళ్లడం ద్వారా మంచులో వాహనాలు కనిపించక వెనుక వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి.

● ఫొటోలకే పరిమితం

ప్రమాదాల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నా అవి అచరణలోకి అమలు కావడంలేదు. ప్రతినెలా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై కలెక్టర్ అధ్వర్యంలో సమావేశం జరుగుతున్నా, అక్కడ చేసిన తీర్మానాలు అమలు కావడం లేదు. ఇక వాహనాలను రాత్రిళ్లు నిలిపి ఫేస్‌వాష్ కార్యక్రమం ఫొటోలకే పరిమితం అవుతుందని ఆరోపణలు ఉన్నాయి. అధికారుల మెప్పుకోసం, పని చేశాం... అని నిరూపించుకునేందుకు ఫొటోల కోసం పలు శాఖల అధికారులు, సిబ్బంది పోటీ పడుతున్నారు.

ప్రాణం కంటే మించింది లేదు

రాత్రిళ్లు విశ్రాంతి లేకుండా వాహనం నడపడం ద్వారా డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకునే అవకాశాలు ఉన్నాయి. నిద్ర వస్తుందని భావిస్తే వాహనాలను పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపి విశ్రాంతి తీసుకోవాలి. ప్రాణం కంటే మించింది లేనేలేదు.

- జీ చందర్, డీటీసీ

జీజీహెచ్‌కి
వైద్యనిపుణులు

- నలుగురు స్పెషలిస్టు డాక్టర్ల రాక
- న్యూరో ఫిజిషియన్లు, న్యూరో సర్జన్లు ఇద్దరు చొప్పున నియామకం
- త్వరలో గుండె వైద్యనిపుణుడు కూడా...
- మరింత విస్తృతంగా వైద్యసేవలు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 11: నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కి త్వరలో వైద్య నిపుణులు రానున్నారు. న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జరీ విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యులు ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం యూరాలజీ విభాగంలో డాక్టర్ జయరాజ్ అందుబాటులో ఉన్నారు. కాగా న్యూరాలజీ ఫిజీషియన్‌లుగా ఇద్దరు వైద్య నిపుణులు, న్యూరో సర్జన్లుగా మరో ఇద్దరు వైద్య నిపుణులు రానున్నారు. జీజీహెచ్‌లో వీరి అవసరం ఎంతో ఉంది. త్వరలో గుండె వైద్యనిపుణులు కూడా రానున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. కాగా నెల్లూరు జిల్లాలో జాతీయ రహదారి విస్తరించి ఉండటం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ నెల్లూరుతో పాటు జిల్లాలోనూ సరాసరి 10 వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జీజీహెచ్‌కి ప్రతిరోజు 1,200 నుంచి 1,500 మంది వరకు రోగులు వస్తుంటారు. ఇన్‌పేషెంట్లుగా 500 మందికిపైగా రోగులు చికిత్స పొందుతుంటారు.



నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

ప్రస్తుతం జీజీహెచ్‌లో 235 మంది వైద్యులు వరకు పనిచేస్తున్నారు. రోడ్డు ప్రమాద బాధితులు ముందుగా జీజీహెచ్‌కే వస్తుంటారు. ఈ పరిస్థితిలో న్యూరాలజీ, న్యూరోసర్జన్‌ల అవసరం ఎక్కువగా ఉంది. తాజాగా న్యూరోసర్జన్లుగా డాక్టర్ ధీరజ్, డాక్టర్ దినేష్‌లు, న్యూరో ఫిజీషియన్లుగా డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ లావణ్యలు వస్తున్నారు. కాగా స్పెషలిస్ట్ వైద్యుల నియామకంపై ఉన్నతాధికారులు డీఎంఈకి పలుమార్లు రాతపూర్వకంగా తెలియచేశారు. ఎట్టకేలకు డీఎంఈ అంగీకరించి అవసరమైన వైద్య నిపుణులను నియమించారు.

వైద్య నిపుణులు వస్తున్నారు...



జీజీహెచ్‌కి వైద్య నిపుణులు వస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు డీఎంఈకి రాతపూర్వకంగా తెలియచేశాం. ప్రస్తుతానికి ఐదుగురు నిపుణులు వస్తున్నారు. గుండె వైద్య నిపుణులు కూడా త్వరలో వస్తారు. వీరంతా వస్తే వైద్యసేవలను మరింతగా విస్తరించవచ్చు.

- డాక్టర్ సిద్దా నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

అభివృద్ధికి ఆమడ దూరంలో ఏఎస్ పేట

సరైన సౌకర్యాలు లేక భక్తుల అవస్థలు

ఏఎస్‌పేట, ఫిబ్రవరి 11: ప్రముఖ యాత్ర స్థలంగా పేరొందిన ఏఎస్ పేట అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దర్గాకు విచ్చేసే భక్తులు సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. ఏఎస్ పేటలో హజరత్ సయ్యద్ ఖజారహమతుల్లా నయాబ్‌రసూల్ దర్గా ఉండడంతో దేశనలుమూలల నుండి ప్రతిరోజు వందల సంఖ్యలో, శుక్రవారం, సెలవు రోజులలో వేలాది మంది యాత్రి కులు విచ్చేస్తుంటారు. ప్రతిరోజు ఇక్కడి నుండి హైదారాబాదుకు ప్రత్యేక బస్సులు ఉన్నాయి. మన రాష్ట్రం నుంచేకాక తెలం గాణ, కర్ణాటక, చతీస్‌ఘడ్, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల నుండి యాత్రికులు విచ్చే స్తుంటారు. దీంతో దేశవ్యాప్తంగా ఏఎస్ పేట (రహమతాబాద్)గా గుర్తింపు పొందింది. కాగా, ఇటీవల దర్గా ప్రధాన వీధిలో డ్రైనేజీ నిర్మాణానికి గుంతలు తవ్వి వదిలేయడంతో దర్గాకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతు న్నారు. బస్టాండ్ సెంటర్‌లో బస్ షెల్టర్ కూలిపోయింది. అప్పటి నుండి షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దూరప్రాంతాల నుండి లగేజీతో వచ్చిన వారు బస్సుల కోసం ఎండలోనే పడిగాపులు కాయవలసిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం, ప్రత్యేక సందర్భాలలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వస్తారు. వారంతా షెల్టర్ లేకపోవడవంతో నీడకోసం దుకాణల ముందు నిలబడుతుండడంతో తమ వ్యాపారానికి అడ్డం అని వ్యాపారులు వారిని పంపించి వేయడంతో ఎండలోనే వేచి ఉండాల్సి వస్తోందని మహిళలు, వృద్ధులు వాపోతున్నారు. బస్‌షెల్టర్ లేక ప్రయా ణికులు ఇబ్బందులు పడుతున్నా పట్టిం చుకునే నాదుడే లేకపోయాడని గ్రామస్థులు అవేదన చెందుతున్నారు. గ్రామంలో బస్టాండ్ నిర్మించాలని పలుమార్లు అధికారులకు, నాయకులకు తెలిపినా ఫలితం లేక పోయిందని వాపోతున్నారు.


డ్రైనేజీ నిర్మాణానికి తవ్విన గుంతలు


బస్సుల కోసం దుకాణాల ముందు వేచి ఉన్న యాత్రికులు

మరుగుదొడ్లు లేక అవస్థలు

ప్రతిరోజు వందలమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే యాత్ర స్థలంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మహిళల పరిస్థితి మరీ దారుణంగా మారింది. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. దేశవ్యాప్తంగా పేరుపొందిన గ్రామంలో కనీసం మరుగుదొడ్లు లేకపోవడం దారుణమని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి తగు సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు, గ్రామస్థులు, భక్తులు కోరుతున్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని గండిపాళెం ఎస్సీ కాలనీలో ఆదివారం రామాలయ నిర్మాణానికి కాలనీ వాసులు భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాధాన, కలశపూజ, నవగ్రహ, వాస్తు హోమాలు, శంఖు ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జే కేశవలింగం, రాపల్లి తిరుపతి, రమణయ్య, శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రాపల్లి భారతీ, కిరణ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగారపమ్మకు పూజలు

సంగం, ఫిబ్రవరి 11: మండలంలోని కోలగట్లలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పొంగించి నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సవాలకు ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 11: పట్టణంలోని సెయింట్ మేరీస్ పాఠశాల ఆవరణలో ఉన్న లూర్దుమాత చర్చి మహోత్సవాలకు మాజీ ఏఎంసీ చైర్మన్, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి ఆదివారం తన ప్రతినిధులచే ఆర్థికసాయం అందజేశారు. ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమానికి ఆర్థికసాయం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గాజుల బాబు, అంకయ్య, సుకుమార్, అర్షద్, నౌషాద్, చర్చి ఫాదర్ సుదర్శన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జైభారత్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌డీ ఖాసింవలి

సీతారామపురం, ఫిబ్రవరి 11: జైభారత్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌డి ఖాసింవలిని నియమించినట్లు ఉదయగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ముప్పాళ్ళ శ్రీరామరాజు తెలిపారు. ఆదివారం సీతారామపురం పరిధిలోని నారాయణంపేట, పంద్రంగి గ్రామాలలో ఇంటింటికీ తిరిగి జై భారత్ పార్టీని బలపరచాలని కోరారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని ఎస్‌డి ఖాసింవలి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ళ రామరాజు, కొండమూరి శ్రీనివాస్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్ష


హిందీ ప్రాథమిక పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సంగం, ఫిబ్రవరి 11: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో విద్యార్థులకు హిందీ దివాస్ ప్రాథమిక స్థాయి పరీక్ష ఆదివారం జరిగింది. ఈ పరీక్షకు పాఠశాలకు చెందిన 42 మంది విద్యార్థులు హాజరయ్యారు. హిందీ ఉపాధ్యాయుడు పెంచలహరి ఇన్విజిలేటర్‌గా వ్యవహరించారు.

యునాని వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధుల దూరం


ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్యసిబ్బంది

ఆత్మకూరు, ఫిబ్రవరి 11 : అతి ప్రాచీనమైన యునాని వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతున్నాయని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి పద్మావతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ యునాని వైద్యశాలలో ఆదివారం జాతీయ యునాని డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ఇప్పటికే ఆత్మకూరు పట్టణంలోని యునాని వైద్య శాల ఎంతో మంది రోగులకు మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. అన్ని వ్యాధులు నయమయ్యేందుకు అవసరమైన యునాని మందులు వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యునాని వైద్యాన్ని ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు. ముందుగా వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది పట్టణంలో యునాని వైద్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ప్రభుత్వ యునాని వైద్యశాల వైద్యులు డాక్టర్ ఎండి అబ్దుల్ రజాక్, మహిమలూరు పీహెచ్‌సీ డాక్టర్ అనూష తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం'

చేజర్ల, ఫిబ్రవరి 11 : మండలంలోని వావిలేరు, చేజర్ల, బోడిపాడు గ్రామాలలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కుంకు బాలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కిష్టయ్య, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొని కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రచారం చేయడంతో పాటు, రామమందిరం ఏర్పాటు చేసినందుకు ధన్యవాద తీర్మానం మీద సంతకాలు సేకరించారు. అనంతరం ఆయా గ్రామాలలో బూత్ కమిటీలు ఏర్పాటుచేసి క్యాలెండర్‌లను పంపిణీ చేశారు.

దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 11: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో రైత సంఘాల నాయకులు, కార్మికులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగాలకు అప్పగించేందుకు తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దుచేస్తామన్న కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. కార్మిక, ఉద్యోగుల శ్రమను కారుచౌకగా అందించేందుకు కేంద్రం లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడం దారుణమన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటుచేసి ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకు చర్యలు చేపడుతోందన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ 16న చేపట్టే బంద్‌కు అందరూ కలిసివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు, సీపీఎం నాయకులు గుజ్జుల మల్లికార్జున, ఫరుద్దీన్‌బాషా, కోడె రమణయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌన ధ్యానం అలవర్చుకోవాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 11: ప్రతి ఒక్కరూ మౌన ధ్యానాన్ని అలవర్చుకోవడం ఎంతో శ్రేయస్కరమని ప్రముఖ మాస్టర్ పి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక షిర్డీ సాయిరాం ధ్యాన మందిరంలో ధ్యానశిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తివంతులు తక్కువ మాట్లాడి అవతలి వారిని ఆకట్టుకుంటారని తెలిపారు. మౌనం అలవర్చుకోవడం, ఆచితూచి మాట్లాడం అన్నివిధాలా శ్రేయస్కరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ చంద్రా సుబ్రహ్మణ్యంనాయుడు పట్టణంలోని పలువురు పిరమిడ్ మాస్టర్లు, ధ్యానసాధకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 11: జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 18వ తేదీ వరకు మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జమాతే ఇస్లామీ హింద్ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ పేర్కొన్నారు. అందులో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు వీధుల ప్రధాన కూడళ్లల్లో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల మహమ్మారి నుంచి యువతను కాపాడి ఉత్తమ సమాజాన్ని నిర్మించడమే తమ సంస్థ ధ్యేయమన్నారు. దేశానికి యువత ఎంతో కీలకమని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నస్రుల్లా, మసూద్, సిద్ధిఖ్, మునాఫ్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పొంగూరులో ఉచిత వైద్యశిబిరం

మర్రిపాడు, ఫిబ్రవరి 11: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పొంగూరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆత్మకూరుకు చెందిన ప్రవేట్ వైద్యశాల వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నల్లపోతుల రమేష్, గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేశారు.

ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు


కలశ స్థాపనకు జలాలు తెస్తున్న మహిళలు

సంగం, ఫిబ్రవరి 11: స్థానిక వెంకటేశ్వరపురంలో ఉన్న పోలేరమ్మకు ఆదివారం పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు మేళతాళాల నడుమ కనిగిరి ప్రధాన కాలువ నుంచి జలాలు తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలు, కలశ స్థాపన, ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన బాణా శ్రీనివాసులురెడ్డి, ప్రవీణ దంపతలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు

బిట్రగుంట, ఫిబ్రవరి 11: బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శశికుమార్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యుడు కొర్రాచంద్రశేఖర్, ఏకే సుందర్‌రాజ్, సత్యనారాణ చార్యులు, రామయ్య, ప్రభాకర్, పాల్గొన్నారు.

బీసీలను వెన్నుపోటు పొడిచిన జగన్ : ఇంటూరి

లింగసముద్రం, ఫిబ్రవరి 11 : బీసీలను అన్ని విధాలుగా మోసం చేసిన జగన్మోన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక వేముల అంజయ్య కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జరిగిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదుగుదలకు ఎన్నో అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు అనేక మంది బీసీలకు మంత్రి పదవులు ఇచ్చి గౌరవించడంతో పాటు ప్రతి ఏడాది బడ్జెట్లో అధికంగా నిధులు కేటాయించారని తెలిపారు. వైసీపీ పాలనలో బీసీలను ఎన్నో అవమానాలకు గురి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని నమ్మి ఓటేసి పెద్ద తప్పు చేశారని, ఈ సారి అలాంటి తప్పు చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, జనసేన మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహారవు, నాయకులు ముచ్చు కృష్ణయ్య, టి ముసలయ్య, షేక్ సలాం, మద్దెల రామారావు, ఎన్ నారాయణ, అడపా రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ : మండలంలోని అన్నెబోయినపల్లిలో ఎన్టీ రామారావు విగ్రహం టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం భూమి పూజ చేశారు. ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును, టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావును గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి మాల్యాద్రి, బి రామయ్య, బాసం హరిబాబు, ఎందోటి ప్రసాద్, బి రమణయ్య, జి సాంబయ్య, జి ప్రసాద్, కె మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

కావలి అభివృద్ధికి కృషి చేస్తా : కావ్య



కావ్యను అభినందిస్తున్న శానం హరి, తదితరులు

కావలి, ఫిబ్రవరి 11: తాను పేద కుటుంబం నుంచి వచ్చినందున ప్రజల కష్టాలు తెలుసని, వారి సమస్యలు పరిష్కరిస్తూ కావలి అభివృద్ధికి కృషి చేస్తానని టీడీపీ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయనను పలువురు కలసి అభినందించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం మీకు అందుబాటులో ఉండి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని, కావలిలో తనను గెలిపించి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసేందుకు కృషి చేయాలన్నారు. అలాగే 18వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి శానం హరి ఆధ్వర్యంలో సుమారు 500 మందికి పైగా ఆ వార్డు ప్రజలు వెంగళరావునగర్ నుంచి ర్యాలీగా ముసునూరు వచ్చి ఆయనకు మద్దతు తెలిపారు. అదేవిధంగా 6వ వార్డుకు చెందిన టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి సంపాని ప్రసాద్ ఆధ్వర్యంలో, 22వ వార్డు ఇన్‌చార్జి కుందుర్తి కిరణ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అభిమానులు ముసునూరులోని కృష్ణారెడ్డి ఇంటికి వచ్చి మద్దతు తెలిపారు.

కన్యకాపరమేశ్వరికి పూజలు : వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కృష్ణారెడ్డి కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ వనితా లెజండ్ మహిళలు ఆయనకు స్వాగతం పలికారు. తొలుత పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కందుకూరు వెంకటసత్యనారాయణ, పోతుగంటి అలేఖ్య, సీవీసీ సత్యం, తటవర్తి వాసు, తటవర్తి రమేష్, మోడరన్ నరసింహం, కటకం రాము, చవల రామకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ఒక్క వాటర్ ట్యాంకైనా నిర్మించారా?

● మండల మీట్‌లో టీడీపీ సర్పంచు


మాట్లాడుతున్న సర్పంచు వెంగపనాయుడు

కలిగిరి, ఫిబ్రవరి 11: వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా తాగునీటి సరఫరాకు ఒక్క వాటర్ ట్యాంకైనా నిర్మించారా.. అని మండలంలోని రావులకొల్లు పంచాయతీ టీడీపీ సర్పంచు పూసాల వెంగపనాయుడు ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశాం అంటున్నారు.. కానీ గ్రామాల్లో గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. టీడీపీ సర్పంచులు ఉన్న పంచాయతీలకు నిధులు విడుదల చేయడంలో, పనులు మంజూరు చేయడంలోనూ పక్షపాత ధోరణి చూపుతున్న ఈ ప్రభుత్వానికి నూకలు చెల్లిపోయాయని, రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, వైసీపీకి వంత పాడుతున్న అధికారులు మూ ల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఎంపీపీ మెట్టుకూరు శిరీష మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులతో సర్పంచులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులు చేసుకోవాలన్నారు. రానున్నది వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, మండల విస్తరణాధికారి వెలుగోటి మధు మాట్లాడారు. ఈ సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

కావలి, ఫిబ్రవరి 11: తెలుగు సంస్కృతికి ప్రతీక ఉగాది పండుగ సందర్భంగా శ్రీకోధినామసంవత్సర కాలమానం ప్రకారం రూపొందించిన కాలెండర్‌ను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ముసునూరు హనుమక్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వహిందూపరిషత్ దక్షిణప్రాంత సహ కార్యదర్శి పీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉగాది నుంచి తెలుగు సంవత్సరాది చైత్రశుద్ధ పాడ్యమితో కొత్త సంవత్సరం ప్రాంభమవుతోందన్నారు. నగర అధ్యక్షుడు వేదగిరి సూర్యనారాయణ ఉగాది విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బాధ్యులు కొండూరు వెంకటేశ్వర్లు, కోటా సురేంద్రరెడ్డి, కొనసం సంజీవయ్య, గునిపూడి సుబ్బరాయుడు, కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, పల్లకీ, లోకేశ్వర్‌రెడ్డి, ఇంటూరు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : బొల్లినేని

కొండాపురం, ఫిబ్రవరి 11: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉదయగిరి ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు అన్నారు. ఆదివారం కలిగిరిలోని తన కార్యాలయంలో బొల్లినేనిని ఉప్పలూరు సర్పంచు కొండలరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, మండల క్లస్టర్ ఇన్‌చార్జి చెరుకూరు వెంకటాద్రి, ఉప్పలూరు యూనిట్ సభ్యుడు కుమ్మర వెంకటరావు పాల్గొన్నారు.

పేద వృద్ధులను ఆదుకోవడం ప్రశంసనీయం

కావలి, ఫిబ్రవరి 11: డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో పేద వృద్ధులను ఆదుకోవడం ప్రశంసనీయమని కావలి సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆ సేవా సమితి ఆధ్వర్యంలో వెంగళరావులోని వారి కార్యాలయంలో ఆదివారం 60 మంది వృద్ధులకు నిత్యావసర సరుకులు, ప్యాకెట్ మనీ కింద కొంత నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ తాతిరెడ్డి, సభ్యులు సతీష్‌సింగ్, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్ డీగ్రీ కళాశాలలో 14న న్యాక్ బృందం పర్యటన

కందుకూరు, ఫిబ్రవరి 11 : టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14, 15 తేదీల్లో న్యాక్ బృందం పర్యటిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని వసతులు, బోధనా పద్ధతులను పరిశీలిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా 14న పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల అభిప్రాయాల ఆధారంగా కళాశాల గ్రేడ్‌ను నిర్ణయిస్తారన్నారు. కళాశాలకు మంచి గ్రేడ్ రావడానికి పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు న్యాక్ బృందంతో జరిగే సమావేశంలో పాల్గొని కళాశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని ప్రిన్సిపాల్ కోరారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత

కావలి రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని సర్వాయపాలెం పంచాయతీ కోనేటివారిపాలెంకు చెందిన వైసీపీ నేత తాతా నాగరాజు ఆదివారం వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు ఆధ్వర్యం టీడీపీ కావలి నియోజక వర్గ ఇన్‌చార్జి కావ్య క్రిష్టారెడ్డి నాగరాజుకు పార్టీ కండువ కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, ఎంపీటీసీ జంపాని శీనయ్య, మాజీ సర్పంచు ఉప్పాల వెంకయ్య, నాయకులు తాతా యానాది, జంపాని కల్యాణ్, పెనుబాపల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కావలిటౌన్, ఫిబ్రవరి 11: శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ చిన్నపిల్లల ఆసుపత్రి నిర్వాహకులు శ్రీధర్, ఝాన్సీ దంపతులు తమ కుమారుడు జనిత్ జన్మదిన వేడుకలను ఆదివారం పేద గిరిజనుల మధ్య నిర్వహించారు. వారికి అన్నదానం చేశారు. సంయుక్త సేవా సంస్థ పర్యవేక్షణలో బుడమగుంట గిరిజన కాలనీలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో సంయుక్త సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

● ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి


రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలిటౌన్, ఫిబ్రవరి 11: పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రూ.20కోట్లతో నూతనంగా నిర్మించిన భవనాలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. జాతీయ రహదారి పక్కన మరో ఆసుపత్రి రూ.70 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పద్మావతి, విశ్రాంత సూపరింటెండెంట్ కె సుబ్బారావు, ఆర్ఎంవో ప్రమీల, వైద్యాధికారులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయకండి

లింగసముద్రం, ఫిబ్రవరి 11 : విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని.. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయవద్దని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 26 వేల ఎకరాలలో విస్తరించి, ఏటా 7.3 మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేస్తూ దాదాపు 16 వేల మంది శాశ్వత ఉద్యోగులు, 17,500 మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. దాదాపు లక్ష మంది పరోక్షంగా ఈ ప్లాంటు ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ ఉక్కు కర్మాగారానికి ఇనుప ఖనిజం కేటాయించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే విభజన ద్వారా నష్టపోయిన ఏపీకి సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు.

సచివాలయ, ఆర్‌బీసీ భవనాల ప్రారంభం


భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉలవపాడు, ఫిబ్రవరి 11 : మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన సచివాలయం 3, రైతు భరోసా కేంద్రాల భవనాలను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆదివారం ప్రా రంభించారు. కరేడు పంచాయతీలో మూడు సచివాలయాలు ఉండగా రెండు కరేడు గ్రామంలోనే నిర్మించారు. 3వ సచివాలయం అలగాయపాలెంలో నిర్మాణం పూర్తయింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ చేవూరి అరుణ, ఎంపీపీ వాయిల మస్తానమ్మ, స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాళ్‌కు ఘన నివాళి


కందుకూరు: నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 11 : పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ పుణ్యతిథి కార్యక్రమాన్ని పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జరుపుకున్నారు. నియోజకవర్గ సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు దీనదయాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కో కన్వీనర్ జొన్నాదుల సురేష్, పట్టణ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు, రూరల్ అధ్యక్షుడు చల్లా వెంకటరాజా, తదితరులు పాల్గొన్నారు.


కావలిటౌన్ : నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్ : బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నమస్కార్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పుణ్యతిథి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె బ్రహ్మానందం, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు కందుకూరి సత్యనారాయణ, సీవీపీ సత్యం, కామినేని ఉదయలక్ష్మి, మంద కిరణ్, మస్తాన్, వెంకటరెడ్డి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.